thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 37 కరీంనగర్ శుక్రవారం, 18 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి

పట్నా : జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు. దళితనేత, స్వాతంత్ర్య సమరయోధుడు జగ్‌లాల్ చౌదరీ జయంతి సందర్భంగా పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.

# 'బోణీ బాగుంది'

## జపాన్‌లో సీఎం రేవంత్ పెట్టుబడుల వేట..!




హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం కాబోతోంది. పెట్టుబడులు సేకరించడమే లక్ష్యంగా జపాన్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. వ్యాపార దిగ్గజం మారుబెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం సీఎం బృందం జపాన్ లోని సోనీ హెడ్ క్వార్టర్స్ ను సందర్శించింది. జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంది. జపాన్ కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసింది.టోక్యోలో మారుబెనీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై ఇరువురు చర్చించారు. వెయ్యి కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ప్రాజెక్టు చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. సదరు ఇండస్ట్రియల్ పార్క్‌లో జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. తద్వారా రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడును ఆకర్షించే అవకాశం ఉంది. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ , డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరఫున తగినంత సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతను మారుబేని నెక్ట్స్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ దై సకాకురా ప్రశంసించారు. తెలంగాణలో అవకాశాలను వినియోగించుకునేందుకు ముందు వరుసలో ఉంటామని చెప్పారు. కాగా, మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఫుడ్, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ , మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉందీ కంపెనీ.




## బిగ్ షాక్..

హైదరాబాద్, ఏప్రిల్ 17: తెలంగాణ ప్రభుత్వం మద్యం ప్రియులకు బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే బీర్ల ధరలు భారీగా పెంచిన సర్కార్.. ఇప్పుడు లిక్కర్ ధరలను కూడా పెంచే యోచనలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన సర్కార్.. ఇప్పుడు మందు బాటిళ్లపైనా ధరలు పెంచాలని భావిస్తున్నట్లు అధికార వర్గాల నుంచి సమాచారం అందుతోంది. చీప్ లిక్కర్ మినహా.. రూ. 500 కంటే ఎక్కువ ధర ఉన్న మద్యం బాటిళ్ల ధరలు పెంచనున్నట్లు విశ్వసనీయ సమాచారం. లిక్కర్ బాటిళ్లపై కనీసం 10 శాతం ధరలు పెంచాలని ప్రభుత్వం భావిస్తోందట. ఇదే జరిగితే బాటిల్‌పై కనీసం రూ. 50 పెరిగే అవకాశం ఉంది. అధికారులతో సమీక్ష జరిపిన అనంతరం ధరల పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని, ఆ తరువాత అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది




## స్మితా సబర్వాల్ పై సర్కార్ సీరియస్.. ఆ పోస్టు నుంచి ఔట్!

ఐఏఎస్ స్మితా సబర్వాల్ తీరుపై కాంగ్రెస్ సర్కార్ సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి హోదాలో ఉండి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా ట్వీట్స్ చేయడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. దీంతో శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి స్మిత తీరు వివాదాస్పదంగా ఉందన్న చర్చ సాగుతోంది. **పోలీసుల నోటీసులు..** HCU వ్యవహారంలో ఇప్పటికే ఆమెకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. BNSS సెక్షన్ – 179 కింద నోటీసులు జారీ చేశారు. నోటీసులోని విషయాలను వెల్లడించేందుకు మాత్రం పోలీసులు నిరాకరించారు. HCU కంచె గచ్చిబౌలి 400 ఎకరాల భూమి ఇష్యూలో AI –జనరేటెడ్ గిబ్లి ఇమేజ్‌ను స్మితా సబర్వాల్ రీపోస్ట్ చేశారు. మార్చి 31న హాయ్ హైదరాబాద్ అనే ఎక్స్ హ్యాండిల్‌లో పోస్టు చేసిన ఇమేజ్‌ను స్మితా సబర్వాల్ రీపోస్ట్ చేశారు.

అంతటితో ఆగకుండా నిన్న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని సైతం ఆమె రీపోస్ట్ చేశారు. అత్యంత బాధ్యతాయుతమైన పోస్టులో ఉండి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్మిత పోస్టులు పెట్టడం సరికాదన్న అభిప్రాయాన్ని సచివాలయ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఒకటి లేదా రెండు రోజుల్లోనే ఆమెపై చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతానికి పోస్టింగ్ ఇవ్వకుండా ఆమెను పక్కటన పెట్టే ఛాన్స్ ఉంది.



## 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

హైదరాబాద్: నగరంలోని పుప్పాలగూడ పరిసరాల్లో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పుప్పాలగూడ భూముల్లో ఐటీ హబ్ ఏర్పాటుపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, రెవెన్యూ, స్పెషల్ పోలీస్ సొసైటీలకు కేటాయించిన ఈ భూమిలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. "వివిధ సొసైటీలకు 200 ఎకరాల భూ కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. పక్కనే ఉన్న మరో 250 ఎకరాల టీజీఐఐసీ భూములు కలిపి ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం. ఈ ఐటీ నాలెడ్జ్ హబ్‌తో 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.




# ఎలాంటి మార్పులు వద్దు

## వక్ఫ్ సవరణ చట్టంపై వాదనలు..

### ఆస్తులపై మార్పులు చేయొద్దంటూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ.. దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. అందులోభాగంగా సుప్రీంకోర్టులో వాదనలు ప్రారంభమైనాయి. అయితే వక్ఫ్ చట్టంలోని కొన్ని అంశాలపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామని బుధవారం సిజెఐ ధర్మాసనం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం తరపున ఎస్ జి తుషార్ మెహతా వాదిస్తున్నారు.

ఆ క్రమంలో కొన్ని సెక్షన్లను మాత్రమే చదివి నిర్ణయం తీసుకోవద్దని ఆయన ధర్మాసనాన్ని కోరారు. ఈ విషయంలో అనేక సవరణలు,కమిటీల ఏర్పాట్లు,లక్షల సంఖ్యలో అభ్యర్థనలు ఉన్నాయని గుర్తు చేశారు. గ్రామాలకు గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగానూ, వ్యక్తిగత ఆస్తులను తీసుకున్నారని వివరించారు. ఇది ప్రజలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ స్టే ఇవ్వడం కఠినమైన నిర్ణయం అని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దయచేసి తనకు ఒక వారం సమయం ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. అలాగే తన వాదనలతో పాటు డాక్యుమెంట్లను సమర్పించడానికి సైతం అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

ఆ వెంటనే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. మేము పరిస్థితి మారిపోవాలని కోరుకోవడం లేదన్నారు. ఐదేళ్ల వరకు ప్రొవిజెన్స్ ఉన్నాయని తమకు తెలుసునని స్పష్టం చేశారు... వాటిని తాము స్టే చేయడం లేదని స్పష్టం చేశారు. చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలపై ఎస్ జీ తుషార్ మెహతా స్పందిస్తూ.. దయ చేసి తమ వాదనను వినాలని కోరారు. ఒక వారం రోజుల్లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. అలాగే తాము ఎలాంటి నియామకాలు చేయమని ధర్మాసనానికి విన్నవించారు. ఇంతలో చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకొని .. తదుపరి విచారణ వరకు ఎలాంటి మార్పులు వద్దన్నారు. దీంతో ఎస్ జీ తుషార్ మెహతా స్పందిస్తూ.. ఏ రాష్ట్రం అయినా.. నియామకాలు చేస్తే.. అవి చట్టబద్ధమైనవిగా పరిగణించకూడదన్నారు. తాను ఈ ప్రకటన చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీంతో కౌంటర్ దాఖలు చేయడానికి సుప్రీంకోర్టు ధర్మాసనం వారం రోజులు సమయం ఇచ్చింది. అలానే తదుపరి విచారణ తేదీ వరకు ఎలాంటి నియామకాలు జరగకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇక తదుపరి విచారణ తేదీ వరకు.. యూజర్ వై వక్ఫ్‌గా పర్కొన్నవాటితోపాటు నోటిఫికేన్ ద్వారా రిజిస్టర్ చేయబడినవి.. డీ నోటిఫై చేయకూడదంటూ సుప్రీం కోర్టు ఆదేశించింది. మరోవైపు.. అంత వరకు వక్ఫ్ ఆస్తుల్లో ఎటువంటి మార్పులు చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వర్క్ బోర్డులో ఎటువంటి నూతన నియామకాలు చేయొద్దని సూచించింది. ఇక వక్ఫ్ సవరణ చట్టంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై వారం రోజుల్లో వివరణాత్మక సమాధానం ఇవ్వాలని కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టంగా సూచించింది.



# జపాన్ ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

టోక్యో: జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అక్కడి సోనీ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సోని కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలిసి చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాల్లో అనుకూలతలను వివరించారు. అనంతరం ప్రముఖ జపాన్ కంపెనీ మారుబెని ప్రతినిధుల బృందం టోక్యోలో సీఎంతో భేటీ అయ్యింది. ఫ్యూచర్‌సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై చర్చించారు. నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మారుబెని సంస్థ ముందుకొచ్చింది. మొత్తం 600 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో పార్కు ప్రతిపాదనలు తీసుకొచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టుతో సుమారు రూ.5 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. "ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదే. సుమారు 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలున్నాయి. దేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తాం. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు మారుబేని ముందుకు రావడం సంతోషం" అని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు.




# దేశంలోనే రోల్‌మోడల్‌గా భూ భారతి

మద్దూరు: ధరణిలో తమ భూమి నమోదు కాలేదని భారాస నేతలే చెబుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో 'భూభారతి'పై ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. "ధరణి లోపాలను సరిదిద్దాలని మాజీ మంత్రులు కోరుతున్నారు. వివరాలు తప్పుగా నమోదయ్యాయని చెబుతున్నారు.

భూభారతి బిల్లు అసెంబ్లీలో పెడితే మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదలకు అండగా ఉండేందుకు ఈ చట్టం తీసుకువచ్చాం. భూ భారతి చట్టం దేశంలోనే రోల్‌మోడల్ కాబోతోంది. ధరణి అమలులో ఉన్నప్పుడు అధికారుల వద్దకే ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారు. ఒక్క రూపాయి లేకుండా దరఖాస్తు చేసే అవకాశం వచ్చింది. పేదలకు చెందిన వేల ఎకరాలను గత ప్రభుత్వం కొల్లగొట్టింది.

గతంలో కొల్లగొట్టిన భూములపై ఆడిట్ చేసి పేదలకు పంచుతాం. అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హులైన పేదలకు ఇస్తాం. కోర్టులో లేని భూముల సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరిస్తాం. గతంలో పాసు పుస్తకం ప్రకారం కాకుండా భూమి ఎక్కువో.. తక్కువో ఉండేది" అని పొంగులేటి అన్నారు.




# ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ధర్నా

హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు.

ఏఐసీసీ పిలుపు మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు: కేటీఆర్

హైదరాబాద్: ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ తమకు లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "బంగ్లా తరహాలో జనమే రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని పడగొడతారు. ఎంతో మంది నియంతలకు ప్రజలకు గుణపాఠం చెప్పారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా. మళ్లీ 20 ఏళ్ల వరకు ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరు. ప్రజలకు కూడా అన్ని విషయాలు అర్థం కావాలి. సీఎం ఆర్థిక దోపిడీ, పర్యావరణ విధ్వంసంపై సిట్టింగ్ జడ్జి లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయాలి. మరొకరు సీఎం స్థానంలో ఉంటే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో రాజీనామా చేసేవారు. రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే భద్రత లేకుండా జనంలోకి వెళ్లాలి మాటల వేట సీఎందే కానీ.. సీఎస్, అధికారులు బలవుతున్నారు. ఐఏఎస్, అటవీ అధికారుల వంతైంది.. ఇతర అధికారులూ జాగ్రత్తగా ఉండాలి. రేవంత్‌రెడ్డి సైన్యంలా కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం కేసులు పెట్టిన వారిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. రేవంత్‌రెడ్డి ప్రైవేటు ముఠాలా పని చేస్తున్న పోలీసులు ఊచలు లెక్కించాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ఎండగట్టింది. భాజపాకు చిత్తశుద్ధి ఉందా? లేదా? అనే దానిపై నెలాఖరు వరకు ఎదురుచూస్తాం. నెలాఖరులో భారాస భేటీ తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్దకు వెళ్తాం. ఆధారాలతో సహా వాటికి అం



దజేస్తాం. అప్పటికీ స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో భాజపాను ఎండగడతాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని భాజపా కాపాడుతోందని చెప్పాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆర్థిక దోపిడీ, పర్యావరణంపై దాడి విషయంపై ప్రధాని స్పందించాలి. స్పందించకపోతే ఆయనకు కూడా పాపంలో వాటా ఉందని భావించాల్సి వస్తుంది. చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి బయటకు రావాలి. ఫార్ములా ఈ రేసులో మంత్రిగా విధాన నిర్ణయాలు తీసుకున్నా అని చెప్పా.. అంతేకానీ అధికారులను బలి చేయలేదు. ఫార్ములా ఈ రేసులో అభ్యంతరం ఉంటే నేను బాధ్యత తీసుకుంటా" అని కేటీఆర్ తెలిపారు.

# హైడ్రామాకు తెర.. ఇంట్లోకి వెళ్లిన రాజ్‌తరుణ్ పేరెంట్స్

హైదరాబాద్, ఏప్రిల్ 17: నగరంలోని కోకాపేటలో గల పావని విల్లాలో హీరో రాజ్‌తరుణ్ ఇంటి వద్ద జరిగిన హైడ్రామాకు తెరపడింది. ఎట్టకేలకు హీరో తల్లిదండ్రులు కోకాపేటలోని ఇంట్లోకి వెళ్లారు. ఈ వ్యవహారానికి సంబంధించి అర్ధరాత్రి సమయంలో లావణ్యతో పోలీసులు మాట్లాడారు. చివరకు వారిని ఇంట్లోకి రానిచ్చేందుకు లావణ్య ఓకే చెప్పడంతో.. రాజ్‌తరుణ్ తల్లిదండ్రులను పోలీసులు ఇంట్లోకి పంపించారు. నిన్న (బుధవారం) వృద్ధాప్యంలో ఉన్న హీరో తల్లిదండ్రులు బసవరాజు, రాజేశ్వరితో పాటు వారి కేర్ టేకర్స్ కోకాపేటలోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకోగా లావణ్య హైడ్రామా సృష్టించిన విషయం తెలిసిందే. కాగా.. సూరారంలో ఉంటున్న రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు.. అద్దె ఇంట్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తమ కుమారుడి ఇంట్లో ఉండేందుకు కోకాపేటకు వచ్చారు. అప్పటికే ఆ ఇంట్లో ఉంటున్నారు లావణ్య. దీంతో రాజ్ పేరెంట్స్ రాగానే వారిని ఇంట్లోకి రానీయకుండా లావణ్య అడ్డుకుంది. రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు పది మందితో కలిసి వచ్చి తన ఇంటిపై దాడి చేశారంటూ లావణ్య నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కేసు కోర్టులో ఉందని, పోలీసులతో మాట్లాడిన తర్వాత ఇంట్లోకి రావాలని ఆమె తేల్చి చెప్పారు. అంతే కాకుండా తమను ఇంట్లో నుంచి గెంటేయడానికే రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు వచ్చారని లావణ్య ఆరోపించారు. దీంతో రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు ఇంటి బయటే ఉండిపోయారు. తమ కొడుకు కష్టార్జితంతో కొన్న ఇళ్లని తమకు న్యాయం చేయాలని రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు కోరగా.. ఇంటి నిర్మాణం కోసం రాజ్‌తరుణ్‌కు కోటి రూపాయలు ఇచ్చానని లావణ్య తండ్రి చెబుతున్నాడు. కానీ అదంతా అబద్ధమని రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు తెలిపారు. తాము కోకాపేట నివాసానికి వస్తున్నట్లు రాజ్‌తరుణ్‌కు కూడా తెలియదని వారు చెబుతున్నారు. చివరకు పోలీసులు అక్కడకు చేరుకుని లావణ్యతో సంప్రదింపులు జరిపారు. చివరకు రాజ్‌తరుణ్ తల్లిదండ్రులను ఇంట్లోకి రానిచ్చేందుకు లావణ్య అనుమతించింది. దీంతో వారు విల్లాలోకి వెళ్లారు.




# సెన్సెక్స్ 1500 పాయింట్లు జంప్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా, చైనా మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా.. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సూచీలను ముందుండి నడిపించాయి. దేశీయంగా కనిష్ఠ స్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణ చేరడం, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు కూడా పాజిటివ్ సెంటిమెంట్‌కు తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ 1500 పాయింట్ల మేర లాభపడి మళ్లీ 78 వేల మార్కును దాటగా.. నిఫ్టీ దాదాపు 400 పాయింట్ల మేర లాభపడి 23,800 ఎగువన ముగిసింది. మదుపర్ల సంపదగా వ్యవహరించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.419 లక్షల కోట్లకు చేరింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ ఉదయం 76,968.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,044.29) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత క్రమంగా లాభాల్లోకి వెళ్లిన సూచీ.. ఇంట్రాడేలో 78,616.77 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1508.91 పాయింట్ల లాభంతో 78,553.20 వద్ద ముగిసింది. నిఫ్టీ 414.45 పాయింట్ల లాభంతో 23,851.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.85.35గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు మినహా మిగిలిన షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎటర్నెల్ (జొమాటో), ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 3,324 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..** బ్యాంకింగ్ స్టాక్స్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ కలిసి సెన్సెక్స్‌ను దాదాపు 600 పాయింట్లు పెరగడంలో దోహదపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు బుధవారం రూ.3,936 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. రెండు సెషన్లలో ఈ మొత్తం దాదాపు రూ.10 వేల కోట్లుగా ఉంది. ఇది మన దేశీ ఈక్విటీ మార్కెట్లపై నమ్మకాన్ని పెంచింది. అమెరికా కరెన్సీ అయిన డాలరు విలువ బలహీన పడటం మన మార్కెట్లకు సానుకూల పరిణామం అని అనలిస్టులు చెబుతున్నారు. టారిఫ్‌ల విషయంలో అమెరికా, జపాన్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఇది సెంటిమెంట్‌ను బలపరిచింది. ఇదే తరహాలో భారత్‌తో కూడా సానుకూల ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందన్న అంచనాలు దీనికి తోడయ్యాయి. దీంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ 66 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే భారత్‌కు ఎంతకాలం తక్కువ ధరల వద్ద క్రూడ్ లభిస్తే ఆ మేర ద్రవ్యలోటు తగ్గుతుంది.

# పాతబస్తీలో మెట్రో నిర్మాణం.. చారిత్రక కట్టడాలకు నష్టం చేయొద్దు: హైకోర్టు

హైదరాబాద్: పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనులపై తెలంగాణ హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిగింది. యాక్ట్ ఫర్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ వేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. మెట్రో నిర్మాణం వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని ఫౌండేషన్ తన పిటిషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏఏజీ వాదనలు వినిపించారు. పురావస్తుశాఖ గర్తించిన చారిత్రక కట్టడాలకు నష్టం లేకుండా చూస్తున్నామని ఈ సందర్భంగా ఏఏజీ కోర్టుకు తెలిపారు. చారిత్రక కట్టడాలను కూలగొట్టడం లేదని చెప్పారు. పరిహారం చెల్లించాకే స్థలాలు సేకరించి నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి ఏఏజీ సమయం కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. మెట్రో నిర్మాణ పనుల్లో భాగంగా చారిత్రక కట్టడాలకు ఎలాంటి నష్టం చేయకూడదని సూచించింది. పురావస్తుశాఖ గుర్తించిన చారిత్రక కట్టడాల వద్ద



ఎలాంటి పనులు చేపట్టకూడదని ఆదేశించింది. ఈ నెల 22 లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌పై తదుపరి విచారణను 22కి వాయిదా వేసింది.

# వక్ఫ్‌బోర్డు ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద ముస్లింలకు పంచుతాం: కిషన్‌రెడ్డి




హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను డిజిటలైజేషన్ చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎప్పటికప్పుడు ప్రకటిస్తామన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు ఆస్తులపై వచ్చిన ఆదాయంలో లాభాన్ని పేద ముస్లింలకు పంచుతామన్నారు.

దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల భూమి కబ్జాకు గురైందని, ముస్లిం సమాజం వాస్తవాలు గుర్తించాలని కోరారు. జిల్లాల్లో నిర్వహించే సమావేశాలకు అన్ని వర్గాల వారిని ఆహ్వానించాలని పార్టీ నేతలను కోరారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణలోని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నేతలకు సూచించారు.

# సీబీఐ, ఈడీపై ఆధారపడి భాజపా ప్రభుత్వాన్ని నడుపుతోంది: మంత్రి పొన్నం

సిద్దిపేట: దేశాభివృద్ధి కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం కక్ష సాధింపులకు గురవుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో ఆయన పర్యటించారు. ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ నాయకత్వాన్ని బలహీనపరచాలని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇది కచ్చితంగా రాజకీయ కక్ష సాధింపే అన్నారు. "సీబీఐ, ఈడీపై ఆధారపడి భాజపా ప్రభుత్వాన్ని నడుపుతోంది. మిత్రపక్షాలు ఎంత అవినీతి చేసినా ఆ పార్టీ వాళ్లు మాట్లాడలేదు. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు ధోరణి మంచిది కాదు. దేశం మొత్తం గాంధీ కుటుంబానికి అండగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



# తెలంగాణ గ్రూప్-1 నియామక ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్: తెలంగాణలో నిర్వహించిన గ్రూప్-1 నియామక ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని తెలిపింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని టీజీపీఎస్సీని ఆదేశించింది. ఇటీవల వెల్లడించిన గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్‌ను సవాల్ చేస్తూ 20 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు.

జీఆర్‌ఎల్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. మెయిన్స్ పత్రాల మూల్యాంకనం సరిగా నిర్వహించలేదని, అందుకే అభ్యర్థులు నష్టపోయారని పిటిషనర్లు పేర్కొన్నారు. మూల్యాంకనం, నియామకాలు నిబంధనలకు విరుద్ధమని, తిరిగి మూల్యాంకం చేయాలని, లేదంటే మరోసారి మెయిన్స్ నిర్వహించాలని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. మూల్యాంకనంపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఈ మేరకు ప్రతివాదులను ఆదేశించాలని 20 మంది గ్రూప్-1 అభ్యర్థులు అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీపీఎస్సీని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

# దాచేపల్లి పోలీస్ స్టేషన్‌కు బేడీలు

పల్నాడు జిల్లా: దాచేపల్లి పోలీస్ స్టేషన్‌కు బేడీలు వేశారు. పీఎస్ మెయిన్ గేటుకు పోలీసులు బేడీలు వేసి తాళం వేశారు. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణిని దాచేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే పోలీస్ స్టేషన్‌లోకి ఎవరు రాకుండా స్టేషన్ గేట్‌కు పోలీసులు తాళాలు వేశారు. ముద్దాయి మాదిరిగా స్టేషన్ గేట్లకు బేడీలు వేయడం ఏంటని వైసీపీ నేతలు మండిపడుతున్నారు. ఈ ఘటనపై గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని అన్నారు. డీజీపీ దీనిపై ఏలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలని.. ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందోనని కాసు మహేష్ రెడ్డి అన్నారు. కాగా వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణిని ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి ఆమెను పల్నాడు జిల్లా, దాచేపల్లికి తరలించారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్‌డీఏ నాయకులపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారనే ఆరోపణలతో పాలేటి కృష్ణవేణిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కృష్ణవేణి స్వగ్రామం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి. ఏపీలోని అధికార కూటమి నేతల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారని కృష్ణవేణిపై ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉండగా.. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయినా వైసీపీ నేతలు వెనక్కి తగ్గడంలేదు.

చురకలు


# నిర్లక్ష్యపు నీడలలో శాతవాహనుల తొలి రాజధాని

## ఏప్రిల్ 18...అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవం/ ప్రపంచ వారసత్వ దినోత్సవం




అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు , శాత వాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహా రాష్ట్ర లోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉ ద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతిపతిస" అను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగోబదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకంనిస" ఆని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉ జ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిసున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చీఫ్ విప్ గా చేరాక, ఆయన చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి ఆరవ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు. 50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. మంత్రిగా కొప్పుల ఈశ్వర్ హరిత హెూటల్ ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు చేపట్టడానికి కృషి చేశారు. మారిన ప్రభుత్వం, ప్రస్తుత రాష్ట్ర విప్, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేయూతను అందించి, పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రాబ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సంబంధ ఆధారాలను పరిరక్షించి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మించి, కోటిలింగాల ఉనికిని కరుమరుగు కాకుండా ఉండ గలందులకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దేవస్థానాలు ధర్మస్థానాలు కావాలి - ధర్మ కర్తలకు అవగాహన ఉండాలి

భారతీయ సంస్కృతిలో దేవాలయాలు శాశ్వత విలువలకు నిలయాలు. ఇవి భక్తి, సంస్కృతి, సమాజ సేవకు కేంద్ర బిందువులుగా ఉన్నాయి. ఈ దేవస్థానాల నిర్వహణ, అభివృద్ధికి బాధ్యత వహించే వ్యక్తులు ధర్మకర్తలు. వీరి పాత్ర కేవలం నిర్వహణ పరంగా మాత్రమే కాక, సమాజ విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా ఉన్నదనేది మరువరాని విషయం. తెలుగు రాష్ట్రాల్లోని హిందూ దేవాలయాల ధర్మకర్తల నియామకాల్లో కొన్ని ఉమ్మడి అంశాలలో...ధర్మకర్తలు హిందువులై ఉండాలి. వారికి దేవాలయ వ్యవహారాల నిర్వహణలో ఆసక్తి, సామర్థ్యం ఉండాలి. సత్ప్రవర్తన కలిగి ఉండాలి. ఆర్థిక స్థిరత్వం కలిగి ఉండాలి. ధర్మకర్తల మండలి సభ్యుల సంఖ్య దేవాలయం యొక్క ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా 5 నుండి 15 మంది వరకు సభ్యులు ఉండవచ్చు. రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు) తప్పనిసరిగా ఉంటాయి. ప్రధాన అర్చకులు ఎక్స్–అఫీషియో సభ్యులుగా ఉంటారు. ధర్మకర్తల విధులు ఆయా దేవస్థానాల నియమ నిబంధనలపై ఆధార పడినప్పటికీ, కొన్ని సాధారణ ప్రమాణాలు ప్రతి ధర్మకర్తకు వర్తిస్తాయి. ముఖ్యంగా దేవస్థానం ఆస్తుల పరిరక్షణ, నిధుల పారదర్శక నిర్వహణ, పూజా విధుల పర్యవేక్షణ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యంగా నిలుస్తాయి. ఇవన్నీ "The Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments Act, 1987" వంటి చట్టాల ఆధారంగా నిర్వర్తించాల్సినవే. ధర్మకర్తలు రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి, సమాజ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించాలి. కొన్ని సందర్భాలలో ధర్మకర్తల అధిక జోక్యం వల్ల మతపరమైన సంప్రదాయాలలో అంతరాయం కలగడం, పరస్పర అభిమత రాహిత్యం ఏర్పడడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇది నిష్పాక్షికతకు విఘాతం కలిగించే ప్రమాదం. తమ చర్యలకు, నిర్ణయాలకు జవాబుదారీగా ఉండటం, అవసరమైనప్పుడు వివరణ ఇవ్వడం ముఖ్యం. భక్తులందరినీ సమానంగా చూడటం, ఎటువంటి వివక్ష చూపకుండా వ్యవహరించడం అవసరం. దేవస్థానం యొక్క ముఖ్యమైన విషయాలపై సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడం ప్రధానాంశం. విధులు అలాగే బాధ్యతలు స్థానిక చట్టాలు మరియు దేవస్థానం యొక్క ప్రత్యేక నియమాల ప్రకారం మారవచ్చు. కొన్ని



పెద్ద దేవస్థానాలలో ధర్మకర్తల మండలి ఉంటుంది, వారు ఈ బాధ్యతలను పంచుకుంటారు. ఒక అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. చిన్న దేవస్థానాలలో ఒకే ధర్మకర్త లేదా కొద్దిమంది ధర్మకర్తలు ఈ బాధ్యతలన్నింటినీ నిర్వర్తించవలసి ఉంటుంది. దేవస్థాన నిర్వహణలో ధర్మకర్తల పాత్ర పర్యవేక్షణకు పరిమితం కావాలి. నిత్యపూజా విధుల నిర్వహణ, ఆలయ ఉద్యోగుల నియామకం వంటి మతపరమైన అంశాల్లో వారికి శాస్త్రోక్త ఆచారాలను గౌరవించే దృక్పథం అవసరం. ఆలయ ప్రధాన పూజారులు, ఆగమ శాస్త్ర నిపుణులతో సలహా, సహకారం తీసుకొని ముందడుగు వేయాలి. ఇక భక్తుల సహకారంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఆదాయ వ్యయాల సమాచారాన్ని ప్రజల ముందుంచే ప్రయత్నం చేయడం ద్వారా విశ్వసనీయత పెరుగుతుంది. ధర్మకర్తలు భక్తుల అభిప్రాయాలను వినడం, సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆలయాన్ని ఒక సమిష్టి ఆధ్యాత్మిక కేంద్రముగా మార్చగలుగుతారు. ధర్మకర్తల పదవి అధికార లక్షణములతో పాటు పెద్ద బాధ్యతను కలిగి ఉంటుంది. ఇది సేవకు మార్గదర్శకం కావాలి. ధర్మకర్తలు తమ పాత్రను నిష్పక్షపాతంగా, నియమాల ప్రకారం, మతపరమైన సంప్రదాయాలను గౌరవిస్తూ నిర్వర్తించినప్పుడే దేవస్థానాలు నిజంగా "ధర్మస్థానాలు"గా నిలుస్తాయి. వారు మితిమీరిన జోక్యం కాకుండా, నియమిత పరిమితులలోనే పర్యవేక్షణ చేస్తే... ఆ దేవస్థానం భక్తుల విశ్వాసానికి అర్హత గలదు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# బౌద్ధ స్తూపం స్థానంలో బుద్ధ విగ్రహం?

## చారిత్రక పాషాయిగాం వద్ద ఆచరణకు నోచుకునేనా? - ఏప్రిల్ 18...ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా



ధర్మపురి నియోజక వర్గం లోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, రెండు దశాబ్దాల క్రితం ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాత వాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉ త్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్ట మౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించ బడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. ఇటీవలి కాలంలో బౌద్ధ స్తూపం స్థానంలో బుద్ధ విగ్రహం ఏర్పాటుకై తాజా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్ణయం గైకొన్నారు. వెల్గటూర్ మండలం కరీంనగర్ రాయపట్నం రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉన్న పాషిగామ బౌద్ధ స్తూపం స్థానంలో సుమారు ఎకరం విస్తీర్ణంలో ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేసేందుకు గత మంత్రి వర్యులు కొప్పుల చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న బౌద్ధ స్తూపం ఉన్న స్థలాన్ని స్థానిక నాయకులు అధికారులతో కలిసి స్థల పరిశీలన జరిపారు. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దం కాలంనాటి ఈ బౌద్ధ స్తూపం స్థానంలో 30 అడుగుల బుద్ధ విగ్రహం తోపాటు 25 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతోపాటు ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఇదివరకే సమీక్షించారు. ఈ మేరకు ఢిల్లీలో ఈ విగ్రహాల తయారీ పూర్తయినట్లు ఆయన ప్రకటించారు. కాగా ఇక్కడ లభ్యమైన అవశేషాలతో ఇక్కడే పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేసి ధ్యాన మందిరం ఇతర బౌద్ధ ప్రాధాన్యత ఉన్న నిర్మాణాలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరారు. ధర్మపురి, గూడెం గుట్ట, కోటిలింగాల ప్రాంతాల మధ్యలో ఉన్న ఈ చారిత్రక ప్రాంతంలో అభివృద్ధి చర్యలు చేపడితే పర్యాటక హబ్ లాగా ఏర్పడుతుందని స్థానికులు కోరారు. సాధ్యాసాధ్యాలను బట్టి పూర్తిస్థాయిలో తగిన చర్యలు తీసుకుంటామని నాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శతాబ్దాల చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకున్న సంతరించుకున్న బౌద్ధ స్తూపం ఉన్న స్థలంలో బుద్ధ విగ్రహం ఏర్పాటు, మ్యూజియం విషయంలో ప్రస్తుత ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ చొరవ తీసుకుని ఈ ప్రాంత ప్రాచీనత్వ ప్రాధాన్యతను భావి తరాల ప్రజలు మరిచి పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




అంతర్జాతీయ వేదికలపై ఎన్ని మొట్టికాయలు పడినా పాకిస్థాన్ తన వైఖరిని మార్చుకోవడం లేదు. జమ్మూకశ్మీర్ పేరు చెప్పి, భారత్‌ను నిందలపాలు చేయాలని పాకులాడి బోర్లా పడుతున్నా దాని బుద్ధి మారడం లేదు. తాజాగా దాయాది దేశం ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. అది తమ జీవనాడి అని, దానిని మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో ఓవర్సీస్ పాకిస్థానీస్ కన్వెన్షన్‌లో మునీర్ మాట్లాడారు. "విదేశాల్లో నివసిస్తోన్న పాకిస్థానీయులంతా దేశ రాయబారులు. మీరు ఉన్నతమైన భావజాలం, సంస్కృతికి చెందినవారనే విషయాన్ని మర్చిపోకూడదు. మీరు మీ పిల్లలకు పాక్ స్టోరీ చెప్పాలి. హిందువులతో పోలిస్తే మనం భిన్నమని మన పూర్వీకులు భావించారు. మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, ఆశయాలు భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది వేసింది. ఈ దేశం ఏర్పాటు కోసం మన పూర్వీకులు ఎంతో పోరాడారు. ఈ స్టోరీని తర్వాత తరాలకు చెప్పడం మర్చిపోవద్దు. అప్పుడే వారికి పాకిస్థాన్‌తో ఉన్న బంధం దృఢంగా ఉంటుంది" అని మాట్లాడారు. "ఉగ్రవాద కార్యకలాపాల వల్ల పాకిస్థాన్‌కు పెట్టుబడులు రాకపోవచ్చని చాలామంది భయపడుతున్నారు. ఉగ్రవాదులు దేశ భవిష్యత్తును హరించగలరని మీరు భావిస్తున్నారా..?"అంటూ భారత సైన్యాన్ని ఉ ద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. పాక్‌కు బలోచిస్థాన్ గర్వకారణమన్నారు. అలాగే కశ్మీర్ గురించి మాట్లాడుతూ.. "ఈ విషయంలో మా వైఖరి స్పష్టం. కశ్మీర్ సోదరులను మేం అలా వదిలేయం" అంటూ బీరాలు పలికారు.




# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని అభినందించిన సీఎం చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 17: దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా ఈ ఏడాది యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్ర పౌరవిమాన యాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. తన ఎక్స్ ఖాతా వేదికగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయడుకు సీ ఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు మన దేశానికి.. మరి ముఖ్యంగా మన తెలుగు జాతికి గర్వ కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సేవను అంకిత భావంతో చేస్తున్నారంటూ రామ్మోహన్ నాయుడుపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. ఇది దేశంలోని యూవతకు స్ఫూర్తినిస్తుందన్నారు. మన రాష్ట్రంతోపాటు దేశ పురోగతికి కృషి చేస్తూ.. ప్రపంచ వేదికపై భారత్ స్వరాన్ని వినిపిస్తూ.. ఆయన నిరంతరం విజయాలను సాధించాలని కోరుకొంటున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో యూరప్‌లోని దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ తదితరులు హాజరయ్యారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి పలువురు కేంద్రమంత్రులు సైతం వెళ్లారు. వారిలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నారు. అయితే ఈ ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి.

చురకలు

## సంపాదకీయం

### రాష్ట్రాలకు కోత పెడుతున్న మోడీ సర్కార్ ?

దేశంలోని 28 రాష్ట్రాలు ఉన్నాయి. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాలు ఎన్డీయే పాలిత రాష్ట్రాలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు అన్న వివక్ష ఉందని ఇండియా కూటమి నేతలు అంటూంటారు. బీజేపీ రాష్ట్రాలకు రూపాయికి ఏడు రూపాయల దాకా కేంద్రం నుంచి నిధులు అందుతాయని అదే విపక్షాల రాష్ట్రాలకు ఎంత ఆదాయం కేంద్రానికి పన్నుల రూపంలో ఇచ్చినా నలభై నుంచి యాభై పైసల వద్దనే నిధులు ఇస్తారని విమర్శలు చేస్తూంటారు. ఇక జీఎస్టీ వచ్చాక రాష్ట్రాలు సొంతంగా పన్నులు వేసుకుని నిధులను పొందే సౌలభ్యం లేకుండా పోయింది అన్నది ఉంది. అంతే కాదు బీజేపీ ఏలుబడిలో స్పెషల్ గ్రాంట్స్ అన్నవి కూడా పెద్దగా లేవని రాష్ట్రాల పట్ల సానుకూలత ఉంటే ఉదారంగా అప్పులు చేసుకునేందుకు మాత్రమే వీలు కల్పిస్తుందని కూడా విమర్శిస్తుంటారు. ఇక ప్రకృతి విపత్తులు వచ్చినపుడు కూడా కేంద్రం నుంచి గతంలో మాదిరిగా పెద్దగా సాయం ఇపుడు అందడం లేదు అన్నది కూడా చర్చగా ఉంది. ఇవన్నీ ఇలా ఉంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ద్రవ్య లోటుని పూడ్చుకునేందుకు రాష్ట్రాలకు పన్నుల ద్వారా ఇవ్వాల్సిన వాటాలలో కోత పెట్టడానికి చూస్తోంది అన్నది ఇపుడు ఒక ప్రచారంగా ముందుకు వస్తోంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి దక్కాల్సిన పన్నుల వాటాను తగ్గించేందుకు ఆర్థిక శాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లుగా రాయిటర్స్ ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం చూస్తే ఇప్పటిదాకా కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల ద్వారా 41 శాతం వాటా వచ్చేది. తాజా ప్రతిపాదనల ప్రకారం దీనిని ఒక్క శాతం వాటా తగ్గించి నలభై శాతానికి పరిమితం చేయాలని చూస్తోంది అని అంటున్నారు. ఇలా కేవలం ఒక్క శాతం వాటాలో కోత పెట్టడం వల్ల కేంద్రానికి ఏకంగా 35 వేల కోట్ల రూపాయల ఆదాయం మిగులుతుందని రాయిటర్స్ కథనం వెల్లడించింది. ఆర్థికవేత్త అరవింద్ పనగరియా నాయకత్వంలోని ఆర్థిక సంఘానికి ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదించినట్లుగా చెబుతున్నారు. ఈ నెలాఖరులో జరిగే కేంద్ర మంత్రివర్గ భేటీలో ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసి ఆ మీదట పరిశీలన కోసం ఆర్థిక సంఘానికి పంపుతారని అంటున్నారు. ఇక ఈ నిర్ణయానికి ఆర్థిక సంఘం కనుక ఓకే చెబితే 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కోత అమలుకోకి వస్తుంది. దాని వల్ల రాష్ట్రాలకు దక్కే కేంద్ర పన్నులలో వాటా సొమ్ము గణనీయంగా తగ్గిపోతుంది అని అంటున్నారు. దీని వల్ల రాష్ట్రాలు మరింతగా ఆర్థికంగా ఇబ్బందులోకి వెళ్తాయని చెబుతున్నారు. ఇప్పటికే ఏపీ లాంటి రాష్ట్రాలు అప్పుల మీద నడుస్తున్నాయి. ఇక మీదట సంక్షేమానికి కాదు కదా అభివృద్ధికి కూడా నిధుల కోసం తీవ్ర కొరత వస్తుందని అంటున్నారు. కేంద్రం ద్రవ్య లోటుని పూడ్చుకోవడానికి రాష్ట్రాల పన్నుల వాటలో కోత పెట్టడం ఏమిటి అన్నది విపక్షాల నుంచి మెల్లగా వినిపిస్తోం ది. కేబినెట్ ఆమోదం తెలిపిస్తే మరి విపక్షాలు ఏ రకంగా ప్రతిఘటిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# పరమ పవిత్రం.... శుభ శుక్ర వారం





భూమిపై అవతరించిన, పాపులను ద్వేశించకు... పాపాలను ద్వేషించూ...అన్న ప్రేమ మూర్తి, దైవ కుమారుడు ఏసుక్రీస్తుకు కల్వరిగిరి పై శిలువ చేసిన దినమే శుభ శుక్రవారం. క్రీస్తు సువార్తల ప్రకారం క్రీ.శ.33లో చంద్ర గ్రహణం రోజున అని భావి స్తారు. క్రీస్తు మరణ తాలూకు జ్ఞాపకాలను క్రైస్తవులు జ్ఞాపకం చేసుకునే దినమిది. ఈస్టర్ కు ముందు వచ్చే శుక్రవారంను క్రైస్తవులు గుడ్ ఫ్రైడే గా జరుపు కుంటారు. దీనినే హెూలీ ఫ్రైడే, బ్లాక్ ఫ్రైడే, గ్రేట్ ఫ్రైడే అని అంటారు. గుడ్ ఫ్రైడే పదం %+శీస%'%ం ఖీతీఱ-ఝఎ% నుండి ఉద్భవించిందని కూడా చెపుతారు. ప్రపంచానికి శాంతి దూతగా అందించిన యేసు క్రీస్తును 2000 ఏళ్ల క్రితం ఇదే శుక్రవారం కల్వగిరి గిరి పై శిలువ వేశారు... మానవాళి పాప ప్రక్షాళన కోసం ప్రాణాలను అర్పించిన ఏసు ప్రభువు త్యాగానికి గుర్తుగా క్రైస్తవులు చర్చిలలో శిలువను ఉంచి ప్రార్థిస్తారు. ప్రపంచంలో మానవాళి అత్యధికంగా నమ్మేది క్రైస్తవ మతం అని చెప్పడంలో సందేహం లేదు. క్రైస్తవ ధర్మాన్ని పాటించేవారు శుభ శుక్రవారం రోజున ప్రాయశ్చిత్తం ప్రార్థనలు, ఉపవాసాలు జరుపు కోవడం ఆచారం. ఏసు క్రీస్తు బోధనల ప్రకారం జీవించే వారిని క్రైస్తవులు అంటారు. పరిశుద్ధ గ్రంథము (హెూలీ బైబిల్) క్రైస్తవుల పవిత్ర గ్రంథము. యూదుల మతము సుమారు క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల్లో (భారత దేశంలో వేద కాలం నడుస్తున్న కాలంలో) ఆవిర్భవించింది. బైబిలు పాత నిబంధనలో మొదటి ఐదు అధ్యాయాలైన ఆది కాండము, నిర్గమ కాండము, లేవీయ కాండము, ద్వితియోపదేశ కాండము, సంఖ్యా కాండము వంటి పుస్తకాలు యూదులకు పవిత్రమైనవి. వీటిని ధర్మశాస్త్ర గ్రంథాలని యూదులు నమ్ముతారు. అయితే కాల క్రమేణా విగ్రహారాధన ఊపందుకొని యూదుల ఆచార వ్యవహా రాలు చాలా మార్పులకు లోనయ్యాయి. ఆ కాలంలో యూదులు పాప పరిహారార్థం బలులు అర్పించేవారు. కాలక్రమేణా యూదుల ఆచారాలలో ధనిక - పేద, యజమాని - బానిస వంటి అసమానతలు, వ్యాధి గ్రస్తుల పట్ల చిన్న చూపు, మూఢ నమ్మకాలు ఏర్పడ్డాయి. ఫలితంగా ధర్మ శాస్త్రాన్ని కాలానికి అనుగుణంగా సులభతరం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. యోషయా గ్రంథం రచించబడిన 700 సంవత్సరాల తర్వాత యూదుల కులంలో కన్య మరియ, యేసేపులకు యేసు క్రీస్తు జన్మించాడు. యేసు క్రీస్తు కాలానికి ఇశ్రాయేలు దేశం అంతా రోమన్ల (%=శీఝఅం%) పరిపాలన లోకి వెళ్ళిపోయింది. బాల్యం నుండే ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొన్న ఏసు క్రీస్తు సమాజంలో అణగద్రొక్క బడినవారిని అక్కున చేర్చు కొన్నారు. సంఘ సంస్కర్తగా అప్పటి సమాజంలో మంచి మార్పు తీసుకు రావడానికి ప్రయత్నించారు. రాజ్యాంగం వంటి యూదుల పాత నిబంధన ధర్మశాస్త్రాన్ని సులభ తరం చేసి క్రొత్త నిబంధనగా బోధించారు. యేసుక్రీస్తు ఆధ్యాత్మిక బోధనలకు పలువురు యూదులు, మరికొన్ని కులాలవారు ప్రభావితు లయ్యారు. రోమన్ సామ్రాజ్యపు రాజులకు, యూదుల్లో మత చాందస్తులకు ఏసుక్రీస్తు బోధనలు నొప్పి కలిగించాయి. యూదుల్లో కొంతమంది మత చాందస్తులు యేసుక్రీస్తును దైవ ద్రోహిగా, దేశ ద్రోహిగా చిత్రీకరించి, చివరికి రోమన్ సామ్రాజ్యపు చక్రవర్తికి అప్పగించారు. చక్రవర్తి జూడాల ఆరోపణలను అంగీకరించక పోయినా, ఆయన దేవుని ప్రతినిధిగా చెప్పు కుంటున్నారని, వివిధ ఆరోపణలను జోడించి వొత్తిడి తెచ్చి, చక్రవర్తి మత ప్రవక్తకులకు వదిలి వేయగా, వారు ఏసు క్రీస్తును అత్యంత కిరాతకంగా శిలువ వేశారు. తర్వాత శిలువ యాగం కారణంగా నిర్యాణం చెందిన ఏసు క్రీస్తును దైవ కుమారుడని యూదులు, రోమన్స్ అంగీకరించారు. ఆనాటి నుండి క్రైస్తవ్యం అనే మార్గం ప్రపంచ మంతా విస్తరించ సాగింది. క్రీస్తు సమాకాలిక శిష్యులు, భక్తులు క్రొత్త నిబంధన రచించారు. యేసును శుక్రవారం సిలువ వేసి, అనేక విధాలుగా హింసించగా, మూడు రోజుల తర్వాత ఆదివారం అయిన ఆరోజు కూడా ఆయన జీవించి ఉన్నారు. గుడ్ ఫ్రైడే తరువాత ఆదివారం ఈస్టర్ సండే అని పిలవడానికి కారణం ఇదే. గుడ్ ఫ్రైడే అనేది బైబిల్ లో ఎక్కడా ప్రస్తావించ బడకున్నా, యేసు ప్రభువును శిలువ వేయడాన్ని ప్రస్తావించడం జరిగింది. దానికి గుర్తుగా గుడ్ ఫ్రైడేను జరుపు కుంటారు. క్రైస్తవ మతాన్ని అనుసరించే వారి ఇళ్లలో గుడ్ ఫ్రైడే కు 40 రోజుల ముందు ప్రార్థనలు మరియు ఉపవాసం ప్రారంభ మవుతాయి. గుడ్ ఫ్రైడే రోజున, ప్రజలు చర్చికి వెళ్లి ప్రభువైన యేసును స్మరిస్తారు. ఆయన ఇచ్చిన విద్యను కూడా గుర్తు చేసుకుంటారు. ఈస్టర్ ఆదివారం యేసు జీవించి ఉన్న ఆనందంలో, ప్రజలు ప్రభువు భోజనంలో పాల్గొని ఒకరికొకరు బహుమతులు ఇచ్చి పుచ్చు కుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తల వంచని వీరుడు... అలుపెరుగని యోధుడు తాంతియా - ఏప్రిల్ 18...తాంతియా తోపే వర్ధంతి

తాంతియా తోపే గా ప్రసిద్ధి చెందిన మరాఠా నాయకుడు రామచంద్ర పాండురంగ తోపే ధైర్యవంతుడైన స్వాతంత్ర్య సమర యోధుడు. తాంతియా తోపే ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం 1857 భారత తిరుగు బాటులో ప్రముఖ పాత్ర వహించాడు. అధికారిక సైనిక శిక్షణ లేనప్పటికీ, తాంతియా టోపే అత్యు త్తమ, అత్యంత ప్రతిభావవంతమైన తిరుగు బాటుకు జనరల్‌గా వ్యవహ రించాడు. తాంతియా అంటే కమాండింగ్ అధికారి అని అర్థం. పేరుతో తోపేగా పెనవేసుకు పోయింది. తాంతియా తోపే (16 ఫిబ్రవరి 1814- 18 ఏప్రిల్ 1859) అసలు పేరు రామచంద్ర పాండిరంగ తోపే.. రామచంద్ర పాండిరంగ యావల్క ర్‌గా మరాఠీ దేశస్థ బ్రాహ్మణ కుటుంబంలో నాసిక్ సమీపంలోని యోలా పట్టణంలో జన్మించాడు. పాండు రంగరావు తోపే, రుఖ్మా బాయి దంపతులకు ఏకైక కుమారుడు. మరాఠా సమాఖ్య మాజీ పేష్వా (పాలకుడు) బాజీ రావు, ఆయన దత్తపుత్రుడు నానా సాహెబ్ తిరుగుబాటులో కీలక పాత్ర పోషించారు. 1851లో లార్డ్ డల్హౌసీ నానా సాహిబ్‌కు ఆయన తండ్రి పెన్షన్‌ను రద్దు చేయడంతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తాంతియా మొదటి పోరాటం ప్రారంభించాడు. మే 1857లో నానా సాహిబ్ అధికారాన్ని స్థాపించాడు. గ్వాలియర్‌ను ఆక్రమించడానికి రాణి లక్ష్మీ బాయితో చేరడానికి కల్పికి మారాడు. కాన్పూర్ ను ఆంగ్లేయుల నుండి హస్తగతం చేసుకున్న తర్వాత ఝాన్సీ రాణి లక్ష్మీభాయితో చేతులు కలిపాడు. ఆమెతో కలిసి గ్వాలియర్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నాడు. గ్వాలియర్ దళం మద్దతుతో నానా సాహిబ్‌ను పీష్వాగా ప్రకటించాడు. తన స్థానాన్ని సుస్థిరం చేసుకునే ముందు అతను హ్యూ హెన్రీ రోస్, 1వ బారన్ స్ట్రాత్‌నైర్న్ చేతిలో ఓడిపోయాడు. అయితే యుద్ధంలో రాణి లక్ష్మీ బాయి మరణించింది. తర్వాత బ్రిటిష్ వారు గ్వాలియర్ లో తమ పాలనను విస్తరించారు. యుద్ధంలో ఓటమి బ్రిటీష్ వారితో పోరాడటానికి భారీ శక్తిని సృష్టించడానికి దారితీసింది. తోపే భారతదేశం లోని అనేక కోటలను స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించాడు. కల్పిలో ఆయుధాల తయారీ కేంద్రాన్ని స్థాపించాడు. గ్వాలియర్ యుద్ధంలో ఓడిపోయిన తర్వాత నర్మదా ప్రాంతాలలో, ఖాందేష్, రాజస్థాన్‌లలో విజయ వంతమైన గెరిల్లా పోరాటాన్ని ప్రారంభించాడు. బ్రిటీష్ వారికి వనరుల కొరత ఉందని తెలుసు కున్న అతను దానిని సద్వినియోగం చేసుకుని, తన విప్లవ కార్యకలాపాల్లో పాలు పంచుకుంటూ మొత్తం 150 యుద్ధాలు చేశాడు. బ్రిటిష్ వారు పరోన్ అడవిలోని తన శిబిరంలో నిద్రిస్తున్నప్పుడు తోపేకు నమ్మకమైన స్నేహితుడు నార్వార్ చీఫ్ మాన్ సింగ్ చేసిన ద్రోహం




వల్ల పట్టుబడి, శివపురికి తీసుకెళ్ల బడ్డాడు. ఏప్రిల్ 18, 1859న ఉరిశిక్ష విధించ బడగా, తోపే తనపై వచ్చిన ఆరోపణలను అంగీకరించాడు. తోపే జ్ఞాపకార్థం మధ్య ప్రదేశ్‌లోని శివపురి పట్టణంలో ఆయనను ఉరితీసిన ప్రదేశంలో తాంతియా తోపే విగ్రహం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కనుమరుగు అవుతున్న కట్టడాలు...తెరమరుగు అవుతున్న చారిత్రక నిర్మాణాలు... రక్షణపై శ్రద్ధ లేని ప్రభుత్వాలు

## ఏప్రిల్ 18...అంతర్జాతీయ చారిత్రిక కట్టడాల దినోత్సవం లేదా ప్రపంచ వారసత్వ దినోత్సవం



అంతర్జాతీయ చారిత్రిక కట్టడాల దినోత్సవం (ప్రపంచ వారసత్వ దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారంగా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ -ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చబడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సేనియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు

శుక్రవారం 18 ఏప్రిల్ 2025

# పునాది పూర్తయితే.. తొలి విడత బిల్లులు

సిరిసిల్ల : ఇందిరమ్మ పథకంలో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గృహనిర్మాణశాఖ చర్యలు ముమ్మరం చేసింది. పైలట్ గ్రామాల్లో పునాది (బేస్మెంట్) పూర్తి చేసుకున్నవారు.. యాప్‌లో నమోదు చేసుకున్నవారికి రూ.లక్ష విడుదలకు సిద్ధం చేస్తున్నారు. దీని కోసం గృహనిర్మాణశాఖ పీడీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల ను సమన్వయం చేస్తూ ముందుకు వెళుతున్నారు.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో 1.08 లక్షల దరఖాస్తులు అందాయి. వీటి ఆధారంగా సర్వే నిర్వహించారు. ఇందులో సొంత స్థలం ఉండి, ఇల్లు లేనివారిని ఎల్1 విభాగంలో 42,679, స్థలం, ఇల్లు లేనివారిని ఎల్2లో 26,077. పక్కాగృహాల్లో ఇతర కారణాలతో ఉన్నవారిని ఎల్3లో 35,411 మందిని గుర్తించారు. వీటిలో ఎల్1లో స్థలం ఉండి ఇల్లులేని వారిని జిల్లాలో మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. అలా 13 గ్రామాల్లో 1,023 లబ్ధిదారులను గుర్తించారు. వీటన్నింటికీ మార్కింగ్ చేశారు. వీటిలో పునాదిస్థాయి పూర్తి చేసుకున్నవారు 22 మంది లబ్ధిదారులు మాత్రమే ఉన్నారు.అద్దె ఇళ్లలో ఉంటూ సొంత స్థలం వేరేచోట ఉన్నవారు.. అక్కడ ముగ్గు పోసే సమయంలో యాప్‌లో జియోట్యాగింగ్ చేసేలా రెండు చోట్ల ఫొటోలు తీస్తున్నారు. దీనిలో సాంకేతికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. సొంత స్థలంలోనే ఫొటోలు తీసుకునేందుకు అవకాశం



ఇచ్చారు. పునాది దశలో ఉన్న నిర్మాణాల్లో వేగం పెంచేలా చర్యలు ప్రారంభించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల్లో ఇసుక సమస్య రాకుండా మానేరు, మూలవాగుల్లో క్వారీలను గుర్తించారు. అనుమతుల మంజూరుకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చారు. పైలట్ గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా చూస్తున్నామని గృహనిర్మాణ శాఖ పీడీ శంకర్ 'ఈనాడు'కు తెలిపారు.

**ముందుకురాని నిర్వాసితులు**

మధ్యమానేరు జలాశయం ముంపు గ్రామాల నిర్వాసితుల్లో ఇళ్లు నిర్మించుకోనివారికి ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో 4,696 ఇళ్లను మంజూరు చేసింది. కాగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు నిర్వాసితులకు ఇంటి నిర్మాణాలకు రూ.5.04 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. కాలనీల్లో ఇప్పటికే సగానికిపైగా నిర్మాణాలు పూర్తిచేసుకు న్నారు. చాలా మంది స్థలాలు విక్రయించగా.. మరికొందరు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అప్పటి హామీలో భాగంగా నిర్వాసితులు డబ్బులు చెల్లిస్తారనుకున్నారు. ఇప్పుడు ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేయడంతో అందరూ నిరాశలో ఉన్నారు.

# సర్వే.. సమగ్ర పరిశీలన

రాజపేట : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాల కోసం ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తు న్నా.. ఆశించిన మేర విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సర్కారు పాఠశాలల్లో నెలకొన్న సదుపాయాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టనుంది. ఇటీవల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఈ విషయమై ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బీఈడీ, డీఈడీ చదువుతున్న విద్యార్థులతో (ఛాత్రోపాధ్యాయులు) ఈ సర్వే చేపట్టనున్నారు. ఈ విషయమై సదరు ఛాత్రోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారులు జూమ్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన సమాచారంపై విద్యాశాఖ తొలిసారిగా థర్డ్‌పార్టీతో సర్వే చేయిస్తుంది. ఈ నెల 15 నుంచి 21 వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో వారు వాస్తవ పరిస్థితులను పరిశీలించి ధ్రువీకరిస్తారు. అత్యంత ప్రామాణికమైన ఈ రిపోర్టు ఆధారంగా పాఠశాలలకు బడ్జెట్‌ను కేటాయిస్తున్నందున ఈ సర్వేకు ప్రాధాన్యం సంతరించుకుంది.

**గోప్యంగా.. ప్రామాణికంగా..**

యూడైస్‌లో నమోదు చేసే వివరాలు అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా ఉంటాయి. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల కు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు 'యూడైస్ ప్లస్'లో వివరాలను సమగ్రంగా నమోదు చేస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివరాలు, మౌలిక వసతులు, ఆధార్ అనుసంధానం, మధ్యాహ్న భోజన పథకం, ఏకరూప దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాల సరఫరా తదితర వివరాలు ఇందులో నమోదవుతాయి. పాఠశాలలో వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యూల్స్‌గా విభజించి సమాచారం నిక్షిప్తం చేశారు. పాఠశాలలో క్రీడా స్థలం ఉందా, గదులెన్ని, ఇంకా ఏమేం అవసరం, ఫర్నీచర్, ల్యాబ్,



ఇతర సదుపాయాలు ఉన్నాయా అమలవుతున్న కార్యక్రమాలు ఇందులో ఉంటాయి.

**15 నుంచి 21 వరకు..**

పాఠశాల విద్యా వ్యవస్థ ప్రామాణికతను అందించే నివేదిక ఇది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి 21 వరకు ప్రతి రోజు రెండు పాఠశాలల చొప్పున వీరు పరిశీలిస్తారు. పాఠశాలల్లో ఉన్న వాస్తవ పరిస్థితులు, వివరాలన్నీ యూడైస్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేశారా..? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది రిపోర్టులో నమోదు చేసిన వివరాల ద్వారా భౌతికంగా పరిశీలన చేసి ధ్రువీకరిస్తారు. తప్పులుంటే సరిచేయాలని ప్రధానోపాధ్యాయులకు రిమార్కు రాసి ఇస్తారు. వాటిని అదే రోజు సీఆర్పీల సహకారంతో సరి చేయాల్సి ఉంటుంది. ఈ సర్వేను జిల్లా విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

జిల్లా వివరాలు ఇవీ..

కాంప్లెక్స్‌ల సంఖ్య : 50

సర్వే చేయనున్నపాఠశాలలు : 672

ఛాత్రోపాధ్యాయుల సంఖ్య: 60

# మహిళా సంఘాలకు రైస్ మిల్లులు



హైదరాబాద్ : మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు.. పరిశ్రమలు స్థాపించేందుకు చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి మరో కొత్త బాధ్యతను అప్పగిస్తోంది. రైస్‌మిల్లుల ఏర్పాటు, నిర్వహణ చేపట్టాలంటూ ప్రోత్సహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైస్‌మిల్లులను అనువైన ప్రాంతాల్లో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్న మహిళా స్వయం సహాయక సంఘాలను ఎంపిక చేసి వారి రుణ చెల్లింపులు.. వార్షికాదాయం ఆధారంగా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. రైస్‌మిల్లుల ఏర్పాటు, మహిళా సంఘాల ఎంపిక బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రైస్‌మిల్లులకు స్థలాలను పరిశీలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసి ఐకేపీ కేంద్రాలకు విక్రయిస్తున్న మహిళా సంఘాలు, సబర్బన్ ప్రాంతాల్లో పరిశ్రమలు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల వివరాలను పరిశీలిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు..మార్కెటింగ్ అవసరాలు రైస్‌మిల్లులను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలను సేకరిస్తున్నారు. కనీసం ఐదెకరాల స్థలం ఉండడంతోపాటు అక్కడే ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాములను నిర్మించనున్నారు. స్థలాలు పరిశీలించేటప్పుడే మార్కెటింగ్ అవసరాలను పరిగణలోకి తీసుకోనున్నారు. మిల్లింగ్ పూర్తయ్యాక ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సులువుగా చేరుకునేందుకు రవాణా సౌకర్యాలపై దృష్టిసారించనున్నారు. ఓఆర్ఆర్ వెలుపలే నిర్మించాలన్న నిబంధన ఉంది. దీంతో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఓఆర్ఆర్‌కి సమీపంలోని సర్కార్ స్థలాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**రూ.కోట్లలో వ్యయం.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం**

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కొనసాగనున్న రైస్‌మిల్లులు.. ధాన్యాన్ని మిల్లింగ్ చేయాలంటే రూ.కోట్లలో వ్యయమవుతుంది. కనిష్ఠంగా రూ.2 కోట్లు, గరిష్ఠంగా రూ.8 కోట్లు అవసరమని అధికారులు భావిస్తున్నారు. మిల్లింగ్ చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలనుకుంటున్నారు. రాయితీ ఎంతివ్వాలి..? బ్యాంకుల నుంచి ఎంత వరకు రుణం మంజూరు చేయించాలనే అంశాలను క్రోడీకరిస్తున్నారు. నల్గొండ, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని ప్రైవేట్ రైస్‌మిల్లుల్లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని పౌరసరఫరా అధికారులు ఇప్పటికే తెలుసుకున్నారు. రైస్‌మిల్లులు, గోదాముల నిర్మాణాలు ఏకకాలంలో ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా మిల్లులను సంఘాలకు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించామని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

# ఇలా ఇచ్చారు.. అలా తీసుకున్నారు!




వికారాబాద్ : ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందించేందుకు తగిన సౌకర్యాల కల్పనకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఏటా నిధులు విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.కోటికిపైగా నిధులు విడుదల చేసినట్లే చేసి తిరిగి వెనక్కి తీసుకుంది. దీంతో జిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధి పనులు, వివిధ కార్యక్రమాలు చేసిన వారికి డబ్బులు చెల్లించలేకపోతున్నారు. దీనికి సంబంధించి కథనం.

**పారదర్శకతకు పెద్దపీట**

పూర్తి పారదర్శకంగా ఎన్‌హెచ్‌ఎం నిధులు ఖర్చు చేసేందుకు వైద్యులు, ప్రజాప్రతినిధులతో కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ ఆమోదించిన పనులనే చేపట్టి వాటికే డబ్బులు అందజేస్తారు. మండల పరిషత్తు అధ్యక్షుడితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పదవీ కాలం ముగిసింది. తిరిగి ఎన్నికలు జరిగేంత వరకు కమిటీలకు మోక్షం లేదు. సామాజిక ఆరోగ్య కేంద్రాలకు స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షుడిగా డాక్టర్ కన్వీనర్‌గా పురపాలక సంఘం అధ్యక్షుడు కమిటీ సభ్యుడిగా ఉంటారు. పురపాలక కమిటీల పదవీ కాలం గత జనవరిలోనే ముగిసింది.దీంతో పనుల నిర్వహణకు వీలుకాని స్థితి ఏర్పడింది.

**సౌకర్యాల కల్పనపై ప్రభావం**

ఆరోగ్య మిషన్ నిధులను ప్రధానంగా విద్యుత్తు మరమ్మతులు, గోడలకు రంగులు, ఫర్నిచర్ కొనుగోలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఆసుపత్రి ఆవరణలో శుభ్రత, మొక్కల పెంపకం తదితర వాటికి వినియోగిస్తారు. నిధులను మార్చి 31లోగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిధులు ఇవ్వక పోవడంతో ఈ ప్రభావం సౌకర్యాల కల్పనపై పడుతుందని పలువురు వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

**త్వరలో మంజూరవుతాయి**

(ఎన్‌హెచ్‌ఎం) కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి సుమారు కోటి రూపాయలు మార్చి నెలలో విడుదల చేశారు. బిల్లులు సబ్‌మిట్ చేద్దామనే లోపే వెనక్కి తీసుకున్నారు. తిరిగి ఈ నెలల్లో విడుదల చేస్తామంటున్నారు.అలా చేస్తే ఆరోగ్య కేంద్రాలకు తగిన సౌకర్యాలు కల్పిస్తాం.డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్.

జిల్లా వైద్య వ్యవస్థ ఇలా..

పీహెచ్‌సీలు.. 23

పట్టణ కేంద్రాలు .. 2

ఉప కేంద్రాలు.. 154

సామాజిక ఆరోగ్య కేంద్రాలు.. 4

జిల్లా ఆసుపత్రి.. 1 (తాండూరు)

జనరల్ ఆసుపత్రి.. 1 (వికారాబాద్)

# రైళ్లు ఆగని స్టేషన్లు




పెద్దపల్లి : ఆర్టీసీ ఛార్జీలతో పోల్చితే రైలు ప్రయాణ వ్యయం తక్కువగా ఉండడంతో రైల్వే స్టేషన్లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ రైలు ప్రయాణానికే ఇష్టపడుతారు. ఉమ్మడి జిల్లాలో కాజీపేట- బల్హార్షా, పెద్దపల్లి- నిజామాబాద్ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు మార్గాల్లో పదుల సంఖ్యలో రైల్వే స్టేషన్లు ఉన్నాయి. రైళ్ల హాల్టింగులు మాత్రం కొన్ని ప్రధాన స్టేషన్లకే పరిమితం కావడంతో గ్రామీణ స్టేషన్ల ప్రజలు ప్రయాణాలకు రోడ్డు మార్గాన్ని ఆశ్రయించక తప్పని పరిస్థితులున్నాయి. ప్యాసింజర్ రైళ్లు కూడా ఆయా ఆపకపోవడంతో కొన్ని స్టేషన్లు అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. ప్రధానమైన కాజీపేట- బల్హార్షా మార్గంలోని కొన్ని స్టేషన్లకు కూడా ఈ పరిస్థితి తప్పడం లేదు.

**స్థాయిని పెంచి.. హాల్టింగ్ ఎత్తివేసి**

రైళ్లలో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లుంటాయి. ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌గా పేర్లుమార్చి గ్రామీణ ప్రాంతాల్లో హాల్టింగ్ ఎత్తివేశారు. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ మాత్రం కాజీపేట-కాగజ్‌నగర్‌ల మధ్య ప్యాసింజర్ స్థాయిలో ప్రతిస్టేషన్‌లో ఆగుతుంది. సింగరేణి ప్యాసింజర్‌ను మెము ఎక్స్‌ప్రెస్‌గా మార్చి పెద్దంపేట, రాఘవపూర్, కొత్తపల్లిలో హాల్టింగ్‌లు ఎత్తేశారు. కాజీపేట ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మార్చేసి, పెద్దంపేట, కొత్తపల్లితో పాటు కొలనూర్‌లో హాల్టింగ్‌లు ఎత్తివేశారు. ఈ ప్రాంతంలో కరీంనగర్ మానేరు పుష్పుల్, భాగ్యనగర్‌లు మాత్రమే అన్ని స్టేషన్లలో హాల్టింగ్ ఉంది. టికెట్ల ధర మాత్రం మానేరు పుష్పుల్ మినహా అన్నింటికి ఎక్స్‌ప్రెస్ ఛార్జీలే వసూలు చేస్తున్నారు.

**అటువైపు అదే పరిస్థితి**

పెద్దపల్లి- నిజామాబాద్ మధ్య ప్రస్తుతం ఒక్క రైలు కూడా నేరుగా నడవడం లేదు. కరీంనగర్ నుంచి నిజామాబాద్ మీదుగా కాచిగూడ ఒక రైలు, కరీంనగర్ నుంచి పెద్దపల్లి మీదుగా తిరుపతి, మానేరు పుష్పుల్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. కరీంనగర్- కాచీగూడల మధ్య నడిచే రైలు మేడిపల్లి, పూడురు, కొత్తపల్లి స్టేషన్లను విస్మరించింది. కరీంనగర్- తిరుపతి రైలుకు కూడా సుల్తానాబాద్‌లో హాల్టింగ్ ఇవ్వలేదు.

**పేరుకే 'స్టేషన్ కొత్తపల్లి'**

కొత్తపల్లి గ్రామాల సంఖ్య ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా ఉండడంతో ఒక్కో ప్రాంతంలోని ప్రత్యేకతను బట్టి ఆయా పేర్లు జోడించి పిలుస్తుంటారు. ఈ విధంగా రైల్వేస్టేషన్ ఉండడంతో 'స్టేషన్ కొత్తపల్లి'గా మారిన పెద్దపల్లి మండలంలోని ఈ గ్రామంలో ప్రస్తుతం ఒక్కరైలు ఆగడం లేదు. 2020 కరోనా కంటే ముందు ఈ మార్గంలో నడిచే ప్రతీ ప్యాసింజర్, ఫాస్ట్ ప్యాసింజర్‌లకు హాల్టింగ్ ఉండేది. గత నెల వరకు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు ఇక్కడ హాల్టిండ్ ఉండేది. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో ఒక్కరైలు కూడా ఆగడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు గ్రామానికి చెందిన కొందరు యువకులు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు మొరపెట్టుకొని, వినతి పత్రాలు అందజేసిన ప్రయోజనం లేకుండా పోయింది.

# మట్టిగుట్టలు.. మాయం..!

నకిరేకల్ : గుట్టలుగా నిల్వ చేసిన మట్టిని అక్రమార్కులు గుట్టుగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలో ముఖ్యమైన నీటి వనరుగా ఉన్న ఏఎంఆర్ ప్రధాన కాల్వ వెంట నిల్వ చేసిన మట్టి (సాయిల్ బ్యాంక్) తరిగిపోతోంది. ప్రధాన కాల్వ తవ్వకం ద్వారా వచ్చిన మట్టిని గతంలో దీని వెంట గుట్టలుగా పోసి నిల్వ చేశారు. ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ, పిల్లకాల్వలకు గండ్లు పడినప్పుడు, పంట కాల్వలు, కాల్వకట్టలపై రహదారుల నిర్మాణం తదితర ప్రభుత్వ నిర్మాణల భవిష్యత్ అవసరాల కోసం వినియోగించేందుకు దీనిని నిల్వ చేశారు. వేల క్యూబిక్ మీటర్లలో ఉన్న ఈ మట్టిపై అక్రమార్కులు కన్నేసి కాజేస్తున్నారు. ఈ కాల్వ వెంట నీటిపారుదల శాఖ లస్కర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా.. మట్టి మాయమవుతుండటం గమనార్హం.

నకిరేకల్- కేతేపల్లి మండలాల మధ్య కాల్వ వెంట 25 కి.మీ నుంచి 27 కి.మీ వరకు ఉన్న మట్టిని తాజాగా తరలిస్తున్నారు. భవన నిర్మాణ పనులు, ఇతర అవసరాల కోసం మట్టిని పొక్లెయిన్లతో తోడి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు న్నాయి. ఈ మట్టిని ఒక్కో ట్రిప్పును రూ.వెయ్యి నుంచి 1200 వరకు వరకు విక్రయిస్తున్నారు. అధికారుల ప్రత్యేక అనుమతితో ప్రభుత్వ అవసరాల కోసం గుత్తేదారులు క్యూబిక్ మీటరుకు రూ.70 చొప్పున గనుల శాఖకు చెల్లించి తరలించుకునే వీలుంది. ఎలాంటి అనుమతులు



లేకుండా ప్రైవేట్ నిర్మాణాల కోసం తీసుకెళుతున్నారు

ప్రధాన కాల్వకు ఇరువైపులా ఏఎంఆర్పీ స్థలంలో నిల్వ చేసిన ఈ మట్టి ఖాళీచేసిన భూములను సమీప రైతులు తమ పట్టాభూముల్లో కలిపేసుకుంటున్నారు. కాల్వ వెంట రహదారులను ఆక్రమిం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి దందాను నిరోధించి ఏఎంఆర్పీ భవిష్యత్ అవసరాల కోసం మట్టిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ఏఎంఆర్పీ ప్రధాన కాల్వ వెంట మట్టిని తరలిస్తున్న విషయం మాదృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి మట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. మాశాఖ లస్కర్ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. మహేశ్ ఏఈ, నీటిపారుదల శాఖ

# ఆదాయం.. అంతంతే..!

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు గడిచిన ఆర్థిక ఏడాదిలో వచ్చిన ఆదాయం నామమాత్రంగానే ఉంది. 2023-24 ఆర్థిక ఏడాదితో పోల్చితే 2024-25 ఏడాదిలో అదనంగా రూ.7 కోట్లు మాత్రమే పెరిగింది. గత ఏడాదిలో రూ.412.37 కోట్లు వస్తే 2024-25లో మార్చి చివరి నాటికి రూ.419.49 కోట్లు వచ్చాయి. ప్రభుత్వానికి ఆదాయం పెరిగినా సంబంధిత శాఖ లక్ష్యానికి చేరువ కాలేకపోయింది. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా గత ఏడాది 1,43,426 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈఏడాది 1,38,729 జరిగాయి. రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నా పెరిగిన ధరలతో రూ.7 కోట్లు ఆదాయం వచ్చింది. అత్యధికంగా నల్గొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, దేవరకొండ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో చౌటుప్పల్ భువనగిరి, బీబీనగర్ కోదాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

**అవగాహన పెరిగి..**

జిల్లాలో గత ఆర్థిక ఏడాదిలో భూముల క్రయ,విక్రయాలు అనుకున్న స్థాయిలో జరగలేదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది వంద గజాల స్థలం కొనుగోలు చేసేవారు కూడా అన్ని విధాలా పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వ భూమి, శిఖం భూమి, ఎఫ్‌టీఎల్, నాన్ ఎఫ్‌టీఎల్ వంటి, వెంచర్ల అనుమతులు, నాలాల అనుమతులతో పాటు ఎల్ఆర్ఎస్ అనుమతులపై అన్ని వర్గాల వారిలో అవగాహన పెరిగింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేని భూములను కొనుగోలు చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

**వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ**

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అవినీతికి తావులేకుండా చూస్తున్నాం. మధ్యవర్తులు లేకుండా అధికారులు, సిబ్బందితో పనులు చేయించుకోవాలి. అవినీతికి పాల్పడేవారి సమాచారం ఇచ్చేవారు నేరుగా జిల్లా కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్‌లు త్వరలో అన్ని కార్యాలయాల్లో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎస్. ప్రకాశ్, డీఆర్ ఉమ్మడి నల్గొండ

# సభ్యత్వాల పేరుతో అక్రమాలు..!

నల్గొండ : మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పలువురు దోపిడీ చేస్తున్నారు. మత్స్య సహకార సంఘాలు ఉన్నా.. వాటి నిర్వహణపై అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం వల్ల అవి కనుమరుగైపోతున్నాయి. మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వాలు ఇప్పిస్తామంటూ కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో మిర్యాలగూడ పెద్ద చెరువు, యాదగార్‌పల్లి, శ్రీనివాసనగర్, చింతపల్లి చెరువులు ఉన్నాయి. గతంలో ఇందులో 281 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 71 మంది ఉన్నారు. ఆరేళ్లుగా కొత్త సభ్యులను చేర్చడం లేదు. ఇటీవల ఎలాంటి జనరల్ సమావేశం లేకుండా..వారసులకు సభ్యత్వాలు ఇస్తామంటూ కొత్త సభ్యులను చేర్చుకునే కార్యక్రమానికి తెరలేపారు. ఇలా ఒక్కొక్కరి నుంచి రూ.3000 చొప్పున 200 మంది నుంచి డబ్బులు వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం. ఇందులో అధికారుల పాత్ర ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈత రాకున్నా, చేపలు పట్టడం తెలియకున్నా.. సభ్యత్వం ఇప్పిస్తామంటూ సంఘంలో కొందరు పెద్ద మొత్తంలో వసూలు చేశారు. ఈనెల 16న కొత్త సభ్యులను చేర్చుకునే తేదీ ఎంపిక చేశారు. చెరువులో వలలు వేయడం, చేపలు పట్టడం వచ్చిన మత్స్యకార్మికులు తాము సభ్యత్వాలకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. బైలా ప్రకారం రుసుం తీసుకొని సభ్యత్వం ఇవ్వాలని కానీ.. రూ.3వేలు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

**16న కొత్త సభ్యుల ఎంపిక**మత్స్యకార సంఘంలో కొత్త సభ్యులను చేర్చుకునే సందర్భంలో ఈత కొట్టడం, వలలు వేయడం, చేపలు పట్టడం చేస్తుంటే మత్స్యశాఖ వీడియోలో చిత్రీకరించాలి. ఈ కార్యక్రమం మిర్యాలగూడలో 16న చేస్తామని మత్స్యశాఖ అధికారులు చెప్పారని కొందరు సభ్యులు తెలిపారు. ఇందులో వృత్తిలో అనుభవం ఉన్న వారిని ఎంపిక చేయాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యుల వద్ద వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు.

**అనుభవం మేరకే..** మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో అనుభవం ఉన్న వారికే సభ్యత్వం ఇస్తాం. వారి నైపుణ్యాన్ని వీడియోలు తీస్తాం. అనుభవం లేని వారికి ఇవ్వం. కొత్త సభ్యులను చేర్చుకుంటారని ఎవరి వద్ద డబ్బులు వసూలు చేయలేదు.

# రోడ్డు తవ్వేస్తామంటూ.. అడ్డగోలు ప్రతిపాదనలు

హైదరాబాద్: నగరం నలుమూలల నుంచి రహదారుల తవ్వకాల కోసం ఇంజినీర్లు పంపుతున్న ప్రతిపాదనలు అడ్డగోలుగా ఉంటున్నాయని జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. పూర్తి వివరాలు పేర్కొనకుండా ప్రతిపాదనలు పంపిస్తుండటంపై ముఖ్య ఇంజినీరు(సీఈ) సహదేవ్ రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు నమూనాలతో ఆయన తాజాగా ఇంజినీర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**మార్గదర్శకాలు ఇలా..**

10మీటర్ల పొడవున రోడ్డును తవ్వేందుకు సర్కిల్ స్థాయిలో కార్యనిర్వాహక ఇంజినీరు.. 10నుంచి 15మీటర్ల మధ్య జోన్ స్థాయిలోని సూపరింటెండెంట్ ఇంజినీరు అనుమతి తీసుకోవాలి. అంతకన్నా పెద్ద ప్రతిపాదనలను ముఖ్య ఇంజినీరు ఆమోదిస్తారు.

తవ్విన రోడ్లను పునరుద్ధరించే పనులకు పరిపాలన అనుమతి కావాలంటే.. ఆయా రహదారులను తవ్వడానికి ప్రజలు లేదా సంస్థ పెట్టుకున్న అర్జీని జత చేయాలి.జీ.వో.నెం.53 ప్రకారం చదరపు



మీటరు తారురోడ్డు తవ్వేందుకు రుసుమును కచ్చితంగా అంచనా వేయాలి. లోపాలకు ఇంజినీర్లే బాధ్యులు.

**తప్పని విమర్శలు**

ఈ మార్గదర్శకాలపై విమర్శలొస్తున్నాయి. రహదారి తవ్వకానికి అంచనాలు రూపొందించడంతోపాటే.. ఆ రోడ్డును పునరుద్ధరించేందుకు అవసరమైన టెండరు నోటిఫికేషన్ రూపుదిద్దుకోవాలి. పునరుద్ధరణ పనులకు గుత్తేదారును సిద్ధం చేశాకే.. తవ్వకం అనుమతి జారీ అవ్వాలి. గతంలోని ఈ నిబంధనను చీఫ్ ఇంజినీరు కార్యాలయం పట్టించుకోవట్లేదనే ఆరోపణలొస్తున్నాయి. రోడ్డు తవ్వకం పనులు పూర్తయ్యాక పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపాలన్న సీఈ ఆదేశాలు సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డును చదరపు మీటరు తవ్వితే రూ.4,550, సీసీ రోడ్డును తవ్వితే రూ.3,688ల రహదారి పునరుద్ధరణ రుసుమును వసూలు చేయాలనే నిబంధనను జీహెచ్ఎంసీ గుడ్డిగా అనుసరిస్తోంది. తారు రోడ్డుతో పోలిస్తే.. నాలుగు రెట్ల అదనపు ఖర్చుతో వీడీసీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పునరుద్ధరణ రుసుము మాత్రం తారు రోడ్డుకన్నా తక్కువ ఉండటం విమర్శలకు తావిస్తోంది.

# చల్లగా వచ్చి దోచుకెళ్లాడు

కరీంనగర్ : అర్ధరాత్రి సమయంలో చల్లగాలి కోసం ఇంటి ప్రధాన తలుపు తీసి, జాలి తలుపు వేసుకొని నిద్రిస్తే ఓ దుండగుడు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ సప్తగిరికాలనీకి చెందిన నేరెళ్ల రమేశ్‌గౌడ్ రెండేళ్లుగా ఆదిలాబాద్ భుక్తపూర్‌లో మెడికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. సోమవారం తన భార్య సోదరుడి కుమారుడు నామకరణం ఉండటంతో రమేశ్‌గౌడ్, అతని భార్య సుజాత ఆదివారం కరీంనగర్‌కు వచ్చి శుభకార్యానికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసి అర్ధరాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లో చల్లగాలి కోసం రెండు వైపులా ఉన్న తలుపులు తీసి జాలి డోర్లను దగ్గరకు వేసి నిద్రించారు. ఉదయం శుభకార్యానికి వెళ్లేందుకు బంగారు ఆభరణాలు, నగదును ఒక సంచిలో వేసి ఉంచారు. సోమవారం ఉదయం లేచి నామకరణం వేడుకకు వెళ్లేందుకు సిద్ధంకాగా ఆభరణాల సంచి కనిపించలేదు. రూ.2.62 లక్షల విలువగల ఆభరణాలు, బీరువాలోని రూ.35 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగర ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ యువకుడు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# సర్కారు బడుల్లో సౌకర్యాలపై ఆరా

పెద్దపల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాలలు బలోపేతం అవుతున్నా.. బాలల ప్రవేశాలు పెరగడంలేదు. విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో ఉండటంలేదు. ఏటా ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు వాటిపై గణాంకాలు అందిస్తున్నా మార్పు ఎందుకు రావడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు వాటి పరిస్థితి ఎలా ఉందనే దానిపై రాష్ట్ర విద్యాశాఖ సర్వే చేపట్టేందుకు ముందుకొచ్చింది. ఈనెల 21 వరకు ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో కరీంనగర్ సమీపంలోని 130 మంది డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు దీనిపై సర్వే చేపడుతున్నారు. **పొందుపరిచిన వివరాల ఆధారంగా**

ఏటా ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో వివరాలను ప్రామాణికంగా పొందుపరుస్తున్నారు. వాటి ఆధారంగానే వాటిలో సౌకర్యాల కల్పన, ఇతరత్రా వాటికి ప్రభుత్వాలు బడ్జెట్‌లు కేటాయిస్తున్నాయి. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు తోడు జూనియర్ కళాశాలల సమగ్ర వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. వాటిలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, తరగతి గదుల పరిస్థితి, క్రీడా మైదానాలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు తోపాటు కొరతగా ఉన్న వాటి వివరాలను ప్రధానోపాధ్యాయులు పొందుపరుస్తున్నారు. **ఒక్కొక్కరికి 10 పాఠశాలలు**

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గాకుండా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న వాటిల్లో ఈ సర్వే చేపడుతున్నారు. ఒక్కొక్కరు నిత్యం 10 పాఠశాలలను సందర్శించి పాఠశాల విద్యా ప్రామాణిక రిపోర్టు ఆధారంగా సర్వే చేస్తారు. వాస్తవ పరిస్థితుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేశారా? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది పరిశీలించి ధ్రువీకరించనున్నారు. వాటిలో తప్పులుంటే సరి చేయాలని రిమార్కులు అందిస్తారు. అప్పటికప్పుడు సీఆర్పీల సాయంతో ప్రధానోపాధ్యాయులు సరిచేస్తారని.. కరీంనగర్ జిల్లా సమగ్రా శిక్షా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# రుచి, శుచికి హామీ



హైదరాబాద్ : రుచికరమైన వంటలకు హైదరాబాద్ చిరునామా. దేశవిదేశాల నుంచి ఎవరొచ్చినా.. బిర్యానీ, ఇతర తెలంగాణ వంటలు రుచి చూసి సంతోషంగా వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రాజధాని కేంద్రంగా రుచితోపాటు శుచికరమైన ఆహారాన్ని హామీగా అందించేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖతో కలిసి నగరంలో ఐదు కొత్త ఆహార పరీక్ష కేంద్రాలు నెలకొల్పేందుకు కమిషనర్ ఇలంబర్తి నిర్ణయం తీసుకున్నారు. జోనల్ కమిషనర్లు స్థలాలను గుర్తిస్తున్నారు. ఆయా కేంద్రాలు అందుబాటులోకి వస్తే.. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు పెరగనున్నాయి.

జడ్సీలకు అధికారం: బల్దియా కేంద్ర కార్యాలయం నుంచి పనిచేస్తోన్న ఆహార భద్రత విభాగాన్ని తాజాగా ఆరోగ్యశాఖ కమిషనర్ వికేంద్రీకరించారు. ఐదుగురు జోనల్ కమిషనర్లకు ఇన్‌ఛార్జి డిజిగ్నేటెడ్ అధికారి(డీఓ) హోదాను కేటాయించి, ఆహార భద్రతాధికారులను వీరి కింద పనిచేసేట్టు ఉత్తర్వులిచ్చారు. వారి ఆధ్వర్యంలో లైసెన్సుల జారీ, ఐదు కేంద్రాలు నిర్మించాలని కమిషనర్ లక్ష్యం నిర్దేశించారు.

**మూడు రకాలుగా పరీక్షలు..**

వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాకేజీల్లోని పదార్థాల నమూనాలను సేకరించి అవి ప్రమాణాల మేరకు ఉన్నాయా, లేదా అని తెలుసుకునేందుకు పరీక్షలు ఉపయోగపడతాయి.

రసాయన: తృణధాన్యాలు, పప్పులు, నూనెలు, కొవ్వు పదార్థాలు, ఆకులు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసులు, పాలు, డెయిరీ వస్తువులకు రసాయన పరీక్షలు జరిపి, వాటిలో కలిసిన రసాయనాలు, ఇతరత్రా లోపాలను పరీక్షిస్తారు.

కల్తీ అయిందా..: ప్యాకేజీల్లోని పదార్థాలు, పచ్చళ్లు, సుగంధద్రవ్యాలు, శీతల పానియాలు, సీసాల్లోని నీరు కల్తీకి గురయ్యాయా.. లేదా తెలుసుకుంటారు.

సూక్ష్మజీవులున్నాయా..: ప్యాకేజీల్లోని పదార్థాల్లో వ్యాధికారక క్రిములు లేదా సూక్ష్మజీవులు ఉన్నాయా అని పరీక్షలో తేలుతుంది.

**గ్రేటర్‌లో ఇలా..**

ఆహార భద్రతాధికారులు: 22

ప్రస్తుతం ఉన్న పరీక్ష కేంద్రం: 1 (రాష్ట్రం మొత్తానికి)

హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలు: 25,000

ప్రస్తుతం ఆహార నమూనాల పరీక్ష ఫలితాలు రావాలంటే: 30 నుంచి 60 రోజులు

కొత్త కేంద్రాలు అందుబాటులోకి వస్తే.. 7 నుంచి 14 రోజుల్లో

ఐదు కేంద్రాలకు కానున్న వ్యయం: రూ.30 కోట్లు (ఒక్కోదానికి రూ.6కోట్ల చొప్పున)

కేంద్రాల ఏర్పాటుకు అవసరమయ్యే విస్తీర్ణం: 6,000 చ.అ నుంచి 10వేల చ.అ

# జోనుకో నిబంధన.. అర్హతల ఉల్లంఘన



హైదరాబాద్ : ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఒప్పంద కార్మికుల సరఫరాకు పిలిచిన టెండర్లలో ఓ గుత్తేదారు.. 3 శాతం కోట్ చేయగా.. సంబంధిత అధికారి ఆ గుత్తేదారుపై అనర్హత వేటు వేసి.. 4.8శాతం ధర కోట్ చేసిన సంస్థకు కట్టబెట్టారు. 200శాతం టర్నోవర్ లేదనే కారణం చూపారు. ఒప్పంద కార్మికుల వేతనాల మీద జీహెచ్ఎంసీకి జీఎస్టీ మినహాయింపు ఉంది. కూకట్‌పల్లి జోన్, తూర్పుజోన్‌లో ఓ సంస్థ టెండర్లను రద్దు చేశారు. జీఎస్టీ చలానాలు అప్‌లోడ్ చేయలేదన్న కారణం చూపారు. మిగిలిన జోన్లలో చలానాలు అడగలేదు.

**గాలిలో నిబంధనలు**

జీహెచ్ఎంసీలో ఏదైనా సెక్షన్‌లో ఒప్పంద ఉద్యోగుల సరఫరాకు ఆ అనుభవం ఉన్నవారే దాఖలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇదే దక్షిణ మండల పరిధిలో మ్యాన్‌పవర్ సరఫరాలో అనుభవం ఉన్న ఏజెన్సీలు ఎవరైనా టెండర్లు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. మిగిలిన వాటిలో ఈ నిబంధన లేదు. దీంతో అనర్హత వేటు వేస్తున్నారు.

జీహెచ్ఎంసీలో ఒప్పంద ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ గుత్తేదారులకు సంబంధం లేదు. కానీ టెండర్లలో కొన్నింటికి పీఎఫ్, ఈఎస్ఐ చలానాలు అడుగుతున్నారు. టెండర్లను ఏజెన్సీలు, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ ఉన్నవారికే ఇస్తామని నిబంధన పెట్టారు. కార్మికుల సరఫరాకు ఎంఎస్ఎంఈలు అవసరం లేదు.శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోనులో ఇలాంటి వాటిని ఇవ్వడం గమనార్హం.

**ఇదీ పరిస్థితి..!**

జీహెచ్ఎంసీ పరిధిలో జోన్లు, సర్కిల్ కార్యాలయాల్లో 25వేల మంది ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. వీరిని మూడు రకాలుగా విభజించారు. ప్రతి ఏడాది నిర్వహణ టెండర్లను పిలిచి గుత్తేదారులకు అప్పగిస్తారు. ఇవి జోన్ల వారీగా ఎస్ఈల పరిధిలో నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఈ ఒప్పంద ఉద్యోగులను కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి తీసుకుంటారు. నిర్వహణ నిమిత్తం ఏజెన్సీలకు కొంత చెల్లించే అవకాశం ఉంటుంది. దీనికి మాత్రం టెండర్లను కోట్ చేయాల్సి ఉంటుంది. ఇటీవల అవి తమ వారికే కట్టబెట్టేందుకు నానా గిమ్మిక్కులు చేస్తున్నారు.

**నేత సిఫార్సులతో..**

ఒప్పంద ఉద్యోగుల సరఫరా టెండర్లలో ఓ మాజీ ప్రతినిధి సిఫార్సులతో 20 వరకు అప్పగించినట్లు తెలిసింది. ఇంఛార్జిగా ఉన్న ఓ అధికారి అన్నీ తానై నిబంధనలు పక్కన పెట్టి మరీ ఇస్తున్నారు. సరఫరా ఏజెన్సీలు సాధారణంగా తమకు వచ్చే బిల్లుల్లో 0.5శాతం మామూళ్లు ఇస్తారనేది బహిరంగం. దీని కన్నా ఎక్కువ ఇస్తామనే వారికి టెండర్లను కట్టబెడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

**ఉలుకు పలుకు లేదు..**

ఒప్పంద ఉద్యోగుల వ్యవహారంలో జరుగుతున్న అక్రమాలపై కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేసినా.. కనీసం స్పందించలేదు. వివరణ కోరేందుకు గత వారం రోజులుగా 'ఈనాడు' ప్రయత్నించినా.. ఆయన స్పందించలేదు.

జీహెచ్ఎంసీ పరిధిలో..మొత్తం జోన్లు 6

ఒప్పంద ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 25,000

ఒక్కొక్కరికి నెలవారీ వేతనం రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు

జీతాలు, నిర్వహణ ఖర్చు రూ.50 కోట్ల నుంచి రూ.65 కోట్ల వరకు

# బిల్డ్‌నౌతో దందా ఆగేనా?

హైదరాబాద్ : హెచ్ఎండీఏ పరిధిలో బిల్డ్‌నౌ సేవలు త్వరలో ప్రారంభం కానుండటంతో ఇకనైనా దళారులకు అడ్డుకట్ట పడుతుందా..అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హెచ్ఎండీఏ పరిధిలోని లేఅవుట్లు, భవన నిర్మాణాలకు సంబంధించి ఈ నెలాఖరు నుంచి టీజీ-బీపాస్‌కు బదులు బిల్డ్‌నౌతో అనుమతులిచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక విధానంలో ఈ సాఫ్ట్‌వేర్‌కు రూపకల్పన చేసినట్లు చెబుతున్నారు. డాక్యుమెంట్ల అప్‌లోడ్, పరిశీలన, అనుమతులు జారీ అంతా చాలా పారదర్శకంగా.. తక్కువ సమయంలోనే పూర్తి చేయొచ్చునని పేర్కొంటున్నారు. ప్రస్తుతం టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో పరిశీలించి అనుమతులివ్వడం లేదంటే తిరస్కరించడం చేయాలి. చిన్నచిన్న కారణాలతో కొందరు సిబ్బంది దరఖాస్తు దారులను ఇబ్బంది పెడుతున్నారు. ఏదైనా వివాదం ఉన్న భూమి, భవనాల విషయంలో చుక్కలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం హెచ్ఎండీఏకు లేఅవుట్లు, భవన అనుమతుల ద్వారా నెలకు రూ.100 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. బిల్డ్‌నౌతో అనుమతుల్లో వేగం పెరిగితే ఆమేరకు ఆదాయంలో పురోగతి ఉంటుందని భావిస్తున్నారు.

**కన్సల్టెంట్ల ముసుగులో...**

హెచ్ఎండీఏ కార్యాలయం చుట్టూ పలు కన్సల్టెంట్ ఏజెన్సీలు ఉన్నాయి. లేఅవుట్ల కోసం వచ్చే దరఖాస్తు దారులకు కమీషన్ తీసుకొని సూచనలు, సలహాలు అందిస్తుంటారు. అంతేకాక హెచ్ఎండీఏలోని అధికారుల వద్ద దళారులుగా అవతారమెత్తుతున్నారు. సాధారణ దరఖాస్తుదారుల కంటే వారికే కొందరు అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బిల్డ్‌నౌతో ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడనుందని, అన్ని



సక్రమంగా ఉంటే నిర్ణీత సమయంలోనే అనుమతులు మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు. ఉద్దేశ పూర్వకంగా ఇబ్బందులు పెడితే అప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా బిల్డ్‌నౌలో సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ఉదాహరణకు ఏజెంట్ ఏఐ ద్వారా దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో రియల్ టైమ్ డేటాను అడిగి తెలుసుకునే సౌలభ్యం కల్పించారు. రియల్ టైమ్ వాట్సప్ అప్‌డేట్‌లు అందిస్తారు. స్మార్ట్ గైడెడ్ మార్కింగ్‌ను వినియోగించి, సాధారణ లోపాలు, తప్పులను నివారించి దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఇలా పలు సాంకేతిక పద్ధతులతో సేవల్లో పారదర్శకత పెంచేలా తీర్చిదిద్దారు.

# మురుగు శుద్ధికి మోక్షం

గోదావరిఖని : ఎట్టకేలకు రామగుండం నగరపాలక ప్రాంతంలో మురుగు జలాల శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నిర్మాణానికి మోక్షం లభించింది. 2023 సెప్టెంబరులో అమృత్ 2.0 పథకంలో భాగంగా అయిదు చోట్ల కేంద్రాల నిర్మాణానికి రూ.88.68 కోట్ల నిధులు మంజూరు కాగా.. టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించారు. కానీ స్థలం కేటాయింపుతో పాటు వివిధ కారణాలతో పనుల్లో జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇటీవల సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సత్వరమే పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. దీంతో మల్కాపూర్ శివారులో ఎస్టీపీ నిర్మాణ పనులు రెండ్రోజుల క్రితం మొదలయ్యాయి. గోదావరిఖనిలోని వివిధ కాలనీల నుంచి వెలువడే మురుగు జలాలను ఈ కేంద్రంలో శుద్ధి చేసి గోదావరిలో వదలాల్సి ఉంటుంది. యైటింక్లయిన్‌కాలనీ, రామగుండం, పాములపేట, జనగామ తదితర ప్రాంతాల్లోనూ మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్మాణ చేపట్టాల్సి ఉంది.

**ఆది నుంచి అవాంతరాలే..**

రామగుండం నగరపాలక ప్రాంతంలో మురుగు జలాల శుద్ధికి ఆది నుంచి అవాంతరాలే ఎదురవుతున్నాయి. గోదావరి జలాల పరిరక్షణ పథకంలో భాగంగా సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం రూ.15 కోట్లతో మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టారు. వివిధ కారణాలతో సుందిళ్లలో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. రామగుండం, మల్కాపూర్‌లలో నిర్మాణాలు పూర్తయినా నిర్వహణ కొరవడటంతో నిరుపయోగంగా మారాయి. అనంతరం



మల్కాపూర్‌లో 22.22 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మాణానికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.97 కోట్లు.. రామగుండంలో 4 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డీఎంఎఫ్‌టీ నిధులు 2.86 కోట్లు కేటాయించారు. మల్కాపూర్‌లో పరిశీలనలకే పరిమితం కాగా.. రామగుండంలో పూర్తయినా ప్రయోజనం నెరవేరటం లేదు. 'అమృత్ 2.0' పథకంలో భాగంగా మల్కాపూర్‌లో 21 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ నిర్మాణ పనులు రెండు రోజుల క్రితం మొదలయ్యాయి.

పరిశ్రమల కాలుష్యంతో..నగరంలోని వివిధ కాలనీల నుంచి వెలువడే మురుగు జలాల శుద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అయితే పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలు గోదావరి కలుషితానికి ప్రధాన కారణం అవుతున్నాయి. సింగరేణి తమ కాలనీల్లోని మురుగు జలాల శుద్ధికి ప్రత్యేకంగా కేంద్రాలు నిర్మించుకోగా.. ఎన్టీపీసీ సైతం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎరువుల కర్మాగారం మాత్రం గోదావరి నదిలోకే వ్యర్థ జలాలను వదిలేస్తోంది. కర్మాగారం ఆవరణలో శుద్ధి చేశాకే వ్యర్థ జలాలు బయటకు పంపాలంటూ కాలుష్య నియంత్రణ మండలి పలు మార్లు నోటీసులు జారీ చేయడంతో పాటు ఉత్పత్తి నిలిపివేసేలా చర్యలు తీసుకుంది. దీంతో త్వరలోనే కర్మాగారం ఆవరణలో శుద్ధి కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఉత్పత్తి మొదలుపెట్టారు.

# అనుమతులొస్తే పనుల పరుగు

సిరిసిల్ల : మధ్యమానేరు జలాశయం వెనక జలాలు సిరిసిల్ల పట్టణాన్ని తాకుతాయి. రామప్పగుట్ట నుంచి సాయినగర్ చెక్‌డ్యాం వరకు కరకట్ట నిర్మాణం.. దానిపై సుందరీకరణకు అయిదేళ్ల క్రితమే ప్రణాళికలు చేశారు. కరకట్ట నిర్మాణం.. చెక్‌డ్యాం పనులు ముడిపెట్టడంతో ముందుకు కదలడంలేదు. ఇటీవల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, నీటి పారుదలశాఖ ఈఎన్సీ శంకర్‌లతో కలిసి కరకట్ట, కూలిన చెక్‌డ్యాం ప్రాంతాలను పరిశీలించారు. నిలిచిపోయిన పనులు చేపట్టాలని కలెక్టర్ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రెండు పనులకు గుత్తేదారుల గడువు ముగిసింది. దీంతో వీటికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. మధ్యమానేరు జలాశయం వెనకజలాల నుంచి మానేరు వంతెన నుంచి సాయినగర్ వరకు 2.2 కిలోమీటర్ల పొడవునా కరకట్ట నిర్మించాలి. దీనిలో మొదటిదశ మానేరు వంతెన వరకు పనులు పూర్తయ్యాయి. ఇక్కడి



నుంచి సాయినగర్ వరకు రెండో విడతకు రూ.38 కోట్లు మంజూరయ్యాయి. కాగా ప్రారంభదశలోనే నిలిచిపోయాయి.

కరకట్ట 10 నుంచి 18 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. కరకట్ట కింది నుంచి మట్టితోకాకుండా వాగువైపు కాంక్రీటుతో గోడ నిర్మించి మట్టిని నింపనున్నారు.

రెండు కిలోమీటర్ల పైన కరకట్ట నిర్మాణానికి మట్టికొరత తీవ్రంగా ఉంది. బోయినపల్లి, ఇల్లంతకుంట మండలంలో అదనపు టీఎంసీ పనుల్లో కాల్వ తవ్వకాల్లో వెలువడుతున్న మట్టిని గనులశాఖ వేబిల్లుతో కరకట్టకు వినియోగించేలా ప్రణాళికలు చేస్తున్నారు.

సివిల్, కాంక్రీటు పనులు పూర్తయ్యాక పర్యాటక శాఖకు అప్పగిస్తారు. పురపాలకశాఖతో కలిసి సుందరీకరణ పనులు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇప్పటికే వరంగల్‌లోని భద్రకాళి చెరువు సుందరీకరణ పనులు నిర్వహించిన ఇంజినీర్ల బృందం కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించింది. మట్టికట్ట పనులు పూర్తయ్యాక సుందరీకరణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది.

**చెక్‌డ్యాం కీలకం**మానేరు వాగుపై సాయినగర్ వద్ద నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యాం 2021 వరదలకు 150 మీటర్ల మేరకు కాంక్రీటు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇక్కడ ఎగువ నుంచి వచ్చే నీటితోపాటు జలాశయం వెనకజలాలతో ఏడాది పొడవునా నీరు ఉంటుంది. కూలిన చెక్‌డ్యాంను పరిశీలించిన రాష్ట్ర చెక్‌డ్యాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇక్కడి చెక్‌డ్యాం నమూనాలను మార్చాలని సూచించారు. వాగులో పిల్లర్లతో బెడ్ నిర్మాణం చేపట్టడంతోపాటు ఎత్తు 150 మీటర్లకు పెంచడం, ఇరువైపులా రక్షణగోడలు నిర్మించాలని సూచించారు. అప్పుడే వరదలను తట్టుకునే అవకాశం ఉంటుంది. రూ.7 కోట్లతో నిర్మించే చెక్‌డ్యాంను అడ్వైజరీ కమిటీ సూచనలతో 2023లో రూ.25 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి పంపారు. నిధులు మంజూరుకాకపోవడంతో పనులు పడకేశాయి. ఈ విషయమై డీఈ కిషోర్‌ను 'ఈనాడు' సంప్రదించగా ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామన్నారు.

# నీటి వృథా నేరం.. చెల్లించాలి మూల్యం

సూర్యాపేట : పురపాలక చట్టం ప్రకారం వార్డుల్లో తనిఖీ చేసే సమయంలో నల్లా నీటిని ఇతరాలకు వాడినట్లు గుర్తిస్తే రూ.500లకు పైగా జరిమానా విధిస్తారు. నిత్యం ఈ తరహా నేరానికి పాల్పడితే నీటి చౌర్యం, ఉద్దేశపూర్వకంగా ఆస్తుల ధ్వంసం వంటి నేరాల కింద కేసులు నమోదు చేస్తారు.

పురపాలికల్లో నీటి వృథాకు పాల్పడితే పుర అధికారులు జరిమానా విధించే అధికారం ఉంది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం నల్లా కనెక్షన్ తీసుకున్నవారు గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలి. ఇతరాలకు వాడి వృథా చేస్తే, తనిఖీల్లో బయటపడితే జరిమానా విధించే హక్కు సంబంధిత అధికారులకు ఉంది.

ఈ నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు 2020లో పురపాలకశాఖ 231 ఉత్తర్వు జారీ చేసింది.



**బాధ్యత పెంపునకే..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలున్నాయి. ఇక్కడ నీటి వృథాను అరికట్టడం లేదు. నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడిన సమయంలో రాజకీయ నాయకుల ఒత్తిడితో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. నామమాత్రంగా జరిమానాలు వేసి వదిలేస్తున్నారు. ఇలాంటి వారికి 2019 చట్టంతో కఠినమైన చర్యలు తీసుకొనే అధికారం పుర అధికారులకు ఉంటుంది. ఇప్పటివరకు ఏ పురపాలికలోనూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

నీటి ఎద్దడి తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరిలో బాధ్యత పెంచాలని చట్టం అమలుకు రాష్ట్ర పురపాలక శాఖ చర్యలు తీసుకుంటుంది. వేసవి నుంచి పట్టణ ప్రజలను గట్టెక్కించాలంటే ఇలాంటి చర్యలు తప్పవు. వీటిని పుర సిబ్బంది కఠినంగా అమలు చేస్తే ఎక్కడా ఒక్క నీటిచుక్క కూడా వృథా కాదు.

**తనిఖీలు చేస్తాం(శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట)**వేసవి దృష్ట్యా నీటి వృథాను అరికట్టేందుకు సిబ్బందితో వార్డుల్లో తనిఖీలు చేపడతాం. వృథా చేస్తూ పట్టుబడితే పుర చట్టం ప్రకారం జరిమానా విధిస్తాం. నీటి వృథాను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలి.

# తడారితేనే కోత.. రైతుకు చేయూత

భువనగిరి: వరి ధాన్యం నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. వరి కోతకు వచ్చి పూర్తిగా తడి ఆరాకే కోతలు మొదలు పెడితే గింజ విరిగి తాలు, నూక శాతం తగ్గుతుందన్న ఉద్దేశంతో ముందస్తు కోతలు చేపట్టకుండా వరికోత మిషన్ల యజమానులు, డ్రైవర్లు, ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.హనుమంతరావు సూచనలతో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వీరారెడ్డి ఈ నెల 18న భువనగిరిలో జిల్లా స్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటుకు నిర్ణయించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలను కూడా సదస్సుకు పిలుస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా రైతులందరూ వరికోత యంత్రాలపైనే ఆధారపడ్డారు. జిల్లాలో యంత్రాలు 60 వరకు ఉన్నాయి. కోతలు పుంజుకున్న



సమయంలో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో జిల్లాకు వస్తుంటాయి. సాధారణంగా యాసంగి సీజన్లో 120 నుంచి 135 రోజులకు వరి కోతకు వస్తుంది. వరి కోత దశకు వచ్చాక పది రోజులు తడి ఆరాల్సి ఉంటుంది. వర్షాల భయం, ఇతర కారణాలతో కొందరు రైతులు తడి ఉన్న సమయంలో మిషన్లతో కోతలు నిర్వహిస్తున్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాల(ఎఫ్ఏక్యూ)పై ప్రభావం చూపి తాలు, తేమ, మట్టి అధికంగా వస్తుంది. మరాడించినప్పుడు నూకలు కూడా ఎక్కువగా వస్తున్నాయని అధికారులు దృష్టికి వచ్చింది.

**సూచనలు ఇలా..**

యంత్రం బెల్టును గట్టిగా బిగించాలి.అప్పుడే పైరు కింది స్థాయి వరకు కోస్తుంది. మిషన్ ఆర్పీఎం 18 నుంచి 25 ఉండాలి. ఇలా చేస్తే తాలు, మట్టి శాతం చాలా వరకు తగ్గుతుంది. పోచంపల్లి, వలిగొండ, మోత్కూరు, రామన్నపేట మండలాల్లో వరి కోతలు ముందుగా ప్రారంభిస్తారు. అక్కడే యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నది అధికారుల లక్ష్యం.నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకుజి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్(రెవెన్యూ), యాదాద్రి భువనగిరి

ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పెంచడంతో పాటు రైతులకు కనీస మద్దతు ధర పొందేలా వరికోత యంత్రాల యజమానులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశాం. కోత దశకు రాకముందే కోతలు చేపట్టొద్దని ఆదేశిస్తాం.

# పారిశ్రామిక కేంద్రం... కరవైన ఆహ్లాదం



గోదావరిఖని : పరిశ్రమల కేంద్రంగా పేరుపొందిన రామగుండం ప్రాంతంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వివిధ పరిశ్రమల ఉద్యోగుల కాలనీల్లో ఆయా యజమాన్యాలు అత్యాధునిక ఉద్యానవనాలు, కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. కానీ నగరంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం ఆహ్లాదం మచ్చుకు కనబడటం లేదు. వివిధ కాలనీల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసిన అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. కొన్నింటిని ప్రహరీలకే పరిమితం చేశారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను ఆధునికీకరిస్తూ మినీ ట్యాంకుబండ్లుగా రూపుదిద్దిన ప్రభుత్వం.. రామగుండం ప్రాంతంలోని ఏకైక చెరువు అభివృద్ధిని అర్ధాంతరంగా వదిలేసింది. బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం కోసం నగరంలోని మొదటి సీనియర్ సిటీజన్ పార్కును తొలగించగా.. భవనాన్ని అసంపూర్తిగానే నిలిపివేశారు.

**నిధులు తగ్గించారు... నిర్మాణం మరిచారు**

మిషన్ కాకతీయ-2లో భాగంగా చిన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.1.92 కోట్ల అంచనాతో గోదావరిఖనిలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న మల్కాపూర్ చెరువుపై మినీ ట్యాంకుబండ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ కారణాలతో నిధులను రూ.1.01 కోట్లకు కుదించి టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించారు. 2017 ఫిబ్రవరి 4న పనులకు శంకుస్థాపన చేయగా చెరువు తూము, ఓ వైపు కట్ట మరమ్మతులు, బతుకమ్మ ఘాట్, పూడిక తీత పనులు పూర్తిచేశారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కట్టకు ఇరువైపులా తుమ్మలు పెరిగాయి. చీకటి పడిందంటే చాలు మందుబాబులకు అడ్డాగా మారుతోంది.చెరువు మత్తడి నుంచి మొదలకొని కట్టపై మీదుగా శిఖం పక్కనుంచి తిరిగి మత్తడి వరకు చుట్టూ వాకింగ్, సైక్లింగ్ కోసం ప్రత్యేకంగా ట్రాక్, గ్రిల్స్‌తో పాటు కంకర రోడ్డు నిర్మించాల్సి ఉంది. కానీ కేవలం ఒక వైపు మాత్రమే కట్టపై మట్టి పనులు పూర్తిచేశారు. మరో వైపు కనీసం రహదారి పనులు కూడా మొదలుకాలేదు. చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దాలంటే సుమారుగా మరో రూ.2.5 కోట్లు అవసరం అనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. సిద్దిపేట కోమటి చెరువు, పెద్దపల్లి చెరువు తరహాలో మల్కాపూర్ చెరువును అభివృద్ధి చేసేలా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# దేవదేవా..వసతులు కల్పించరా?




కరీంనగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దేవాలయాల కార్యనిర్వహణ బాధ్యతలు చూసే కార్యాలయం వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవల దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. ఇదివరకు కరీంనగర్ కోర్టు చౌరస్తాలో ఉన్న శ్రీరాజరాజేశ్వర కల్యాణ మండప పైఅంతస్తులో కొనసాగింది. రూ.6 వేలు కిరాయి చెల్లించేవారు. వర్షాలు కురిసినప్పుడు పైకప్పు లీకేజీతో ఇబ్బందిగా ఉండేది. ఈ పరిస్థితుల్లో రూ.14 వేల కిరాయితో ప్రశాంత్‌నగర్ కాలనీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపాన్నే సహాయ కమిషనర్ కార్యాలయంగా మార్చారు.

**దాతలు ముందుకొచ్చినా..**

కార్యాలయంలో వసతులు కల్పించడానికి కామన్ గుడ్ ఫండ్ వడ్డీలో నుంచి కొంత ఖర్చు చేశారు. సిమెంట్, గ్రానైట్, ఇసుకకు సంబంధించి దాతల సహకారంతో ఎట్టకేలకు ఒక రూపంలోకి తీసుకొచ్చారు. అయినా వసతులు కల్పించాల్సిన అవసరముంది. క్యాబిన్‌లు ఏర్పాటు చేసి శాఖ పుస్తకాలు, కాగితాలు భద్రపరిచేందుకు నిర్మాణాలు జరగాలి. కోర్టు నుంచి మంచిర్యాల చౌరస్తాకు వెళ్లే దారిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయముంటుంది. ఇక్కడి నుంచి దేవాదాయ శాఖ కార్యాలయానికి వెళ్లేందుకు వీలుపడదు. ఇందుకు మంచిర్యాల చౌరస్తా నుంచి చొప్పదండి రోడ్డులో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది.

కార్యాలయ భద్రత విషయంలో.. ఇక్కడి పరిసరాలు చూస్తే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పక్కనే ఖాళీ స్థలం ఉండటం.. రాత్రి వేళలో ఆలయంలో ఎవరూ ఉండే పరిస్థితి లేదు. కార్యాలయంలో ఏ, బీ, సీ, డీ విభాగాలకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇవన్నీ హాలులోనే ఉన్నాయి. ప్రతి విభాగానికి కంప్యూటర్ అవసరముంది. అలాగే సీసీ కెమెరాలు అమర్చాల్సి ఉంది.

వేములవాడ, కొండగట్టు, ధర్మపురిలాంటి దేవస్థానాల నుంచి రూ.5 లక్షల చొప్పున కేటాయించినా నిధుల సమస్యే ఉండదని ఆ శాఖకు చెందిన కొందరు అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం- సుప్రియ, జిల్లా సహాయ కమిషనర్

కార్యాలయంలో వసతుల కల్పనకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వారి ఆదేశానుసారం నడుచుకుంటాం.

# సహకారం.. తిరోగమనం




నల్గొండ : ప్రభుత్వం రైతుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఏర్పాటు చేసింది. ఇవి పటిష్ఠంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి ఆరేళ్లకోసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని సహకార సంఘాలు లాభాలు గడించగా మరికొన్ని దెబ్బతింటున్నాయని 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదికలు చెబుతున్నాయి.

**ఇలా చేస్తే నయం..**ప్రాథమిక సహకార సంఘాలపై అధికారుల పర్యవేక్షణ పెరగాలి.నష్టాల్లో నుంచి గట్టేక్కేందుకు ఉన్న మార్గాలపై సంఘాల్లో అవగాహన పెంపొందించాలి.ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాల ఏర్పాటు చేసేందుకు అన్ని సంఘాలు ముందుకు రావాలి.రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా జరుగుతుందా లేదా అనేది పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బంది ఉండాలి.కారణాలు అనేకంసహకార సంఘాల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటోంది. రుణాలు ఇప్పించే సమయంలో ఉన్న శ్రద్ధ తిరిగి చెల్లించే విషయంలో నేతలు చూపడం లేదు. పాలకవర్గ సభ్యులే రుణాలు తీసుకొని తిరిగి చెల్లించడం లేదు.పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు, విత్తనాలు, ఎరువులు ద్వారా లాభాలు ఆర్జించడమే కాకుండా సంఘంలోని సభ్యులందరికీ ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. కొన్ని సంఘాలు మాత్రమే ఆ దిశగా ముందుకు సాగుతున్నాయి.కొందరు సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోవడం కూడా మరో కారణం. పీఏసీఎస్ సిబ్బందికి బదిలీలు లేకపోవడం వల్ల ఒకే చోట ఏళ్ల తరబడి ఉండటం కూడా ఓ కారణమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో నష్టాల బాటలో ఉన్న సొసైటీల ను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని జిల్లా సహకార అధికారి పత్యానాయక్‌తో తెలిపారు.

# ఇన్‌ఛార్జిలతో ఇంకెన్నాళ్లు!

భువనగిరి : ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరకులు అందజేస్తున్నా దాదాపు దశాబ్దన్నర కాలంగా ఖాళీలైన డీలర్ల నియామకాలు మాత్రం చేపట్టడంలేదు. పునర్ వ్యవస్థీకరణలో ఏర్పడిన కొత్త దుకాణాలకు కూడా సంవత్సరాల తరబడి డీలర్లు లేకుండా ఇన్‌ఛార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. పొరుగు గ్రామాల్లో ఉన్న డీలర్లకే బాధ్యతలు అప్పగించడంతో దుకాణం ఎప్పుడు తెరుస్తారో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.జిల్లా వ్యాప్తంగా 515 రేషన్ దుకాణాలు ఉండగా 90 ఖాళీలు ఉన్నాయి. డీలర్లను నియమించాలని ప్రజావాణిలో గ్రామస్థులు పలుమార్లు విన్నవించుకుంటున్నా వారి మొరను ఆలకించడం లేదు. గతంలో జరిగిన మండల పరిషత్ సమావేశాల్లో తీర్మానాలు చేసి జిల్లా అధికారులకు పంపినా ఎలాంటి స్పందన లేదు. ఖాళీలను భర్తీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉన్నప్పటికీ దశాబ్దన్నరం కాలంగా వారు ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని రేషన్‌కార్డు లబ్ధిదారులు



వాపోతున్నారు. 2022 ఫిబ్రవరిలో జిల్లా వ్యాప్తంగా 34 కొత్త షాపులు ఏర్పాటు చేశారు. పొరుగు గ్రామాల డీలర్లకే అదనపు బాధ్యతలు ఇచ్చి కొనసాగిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త డీలర్లను నియమించాల్సిన అవసరం ఉంది.త్వరలో నియామకాలు వీరారెడ్డి, అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా

జిల్లాలో రేషన్‌డీలర్ల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం. డీలర్లకు గిట్టుబాటు అయ్యే చోట ఖాళీలను భర్తీ చేస్తాం.

రేషన్ దుకాణాలు: 515

ఖాళీలు: 56, కొత్తవి : 34

# నైపుణ్య వృద్ధి.. ఉపాధి సిద్ధి

సంగారెడ్డి : పోటీ ప్రపంచమిది.. ప్రతిభ చూపితేనే ఉపాధి అవకాశాలు సొంతమవుతాయి. యువత నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)లను ఏర్పాటు చేసినప్పటికీ.. ఆశించిన ఫలితాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కోర్సు పూర్తి చేసినా.. నైపుణ్యాల లేమితో చాలా మంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేక పోతున్నారు. కొందరికి అవకాశాలు దక్కినా.. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారే ఎక్కువ. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్(ఏటీసీ)ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏటీసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాకు ప్రయోజనం చేకూరనుంది.

**ఆ మూడు నియోజకవర్గాల్లో..**

జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా మూడు ఐటీఐ కళాశాలలు మాత్రమే ఉండటం గమనార్హం. ఈ మూడింటిలో ఒకటి హత్నూర మండల కేంద్రంలో ఉంది. హత్నూర మండలం సంగారెడ్డి జిల్లాలోనే ఉన్నప్పటికీ.. అది మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. ఈ రకంగా చూస్తే జిల్లాలో రెండు నియోజకవర్గాల్లోనే ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ఇవి ఉండగా.. వాటి ఆవరణలో ఏటీసీ కోర్సులను ప్రారంభించారు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో లేకపోడంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో ఆ మూడు నియోజకవర్గాల్లోని విద్యార్థుల ఆశలు చిగురించాయి. జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో పాటు బీహెచ్‌ఈఎల్, ఓడీఎఫ్, బీడీఎల్ వంటి కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలు ఉండటం ఇక్కడి విద్యార్థులకు కలిసివచ్చే అంశం.

**ఇవీ కోర్సులు**

పరిశ్రమలచ్లి కొత్త యంత్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. ఏటీసీల్లో కోర్సులను ఇందుకు అనుగుణంగా ఎంపిక చేశారు. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో ఐటీఐ కళాశాలలు: 18

ఇందులో ప్రైవేటువి: 15

ప్రభుత్వ..: 3

విద్యార్థులు: 1,500

విద్యార్థులకు సదవకాశం

ఏటీసీలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. కోర్సుతో పాటు నైపుణ్యాల పెంపుతో మంచి అవకాశాలు కల్పిస్తారు. నైపుణ్య శిక్షణ పూర్తిచేసుకుంటే స్వయం ఉపాధిలోనూ రాణించేందుకు వీలుంటుంది. ఆధునిక యంత్రాల వినియోగంపై శిక్షణతో సత్ఫలితాలు ఉంటాయి. కొత్త ఏటీసీల ఏర్పాటుపై మార్గదర్శకాలు అందాల్సి ఉంది.

ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి.

# వనిత.. చేనేత

సిద్దిపేట: మహిళలు అన్ని రంగాల్లో తమదైన ముద్ర వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్వయం సమృద్ధి సాధనకు అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఆర్థిక పరిపుష్టితో కుటుంబ బాధ్యతల్లో భాగస్వాములయ్యేందుకు శ్రమిస్తున్నారు. ఈ తరుణంలోనే చేనేత, జౌళి శాఖ నేతృత్వంలో ఫిక్కి (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) మహిళా విభాగం సహకారంతో చేనేత ఆధునికీకరణపై అందిస్తున్న తర్ఫీదును వినియోగించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గత జనవరి 30న ప్రారంభం కాగా, ముగింపు దశకు చేరింది.45 రోజుల శిక్షణ యాంత్రీకరణ ప్రభావం, మారుతున్న పరిస్థితులు, తగ్గుతున్న ఆదరణతో చేనేత రంగం పూర్వ వైభవాన్ని కోల్పోతోంది. గిట్టుబాటు లభించని పరిస్థితుల్లో ప్రస్తుత తరం చేనేత వృత్తి చేపట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ తరుణంలో మహిళలను ప్రోత్సహించడం ద్వారా అటు కార్మికుల సంఖ్య పెంపు, ఇట ఉపాధి కల్పన సాధ్యమన్న ఉద్దేశంతో చేనేత, జౌళి శాఖ వివిధ దశల్లో శిక్షణ అందిస్తోంది. ఈ నేపథ్యంలో సిద్దిపేటలోని ఇర్కోడు చేనేత సహకార సంఘంలో 45 రోజుల పాటు తర్ఫీదు కార్యక్రమం చేపట్టారు. గొల్లభామ, ముత్యంపేట, పటోళ చీరల తయారీని మూడు మగ్గాలపై శిక్షకుడి ద్వారా ఔపోసన పట్టిస్తున్నారు. ఆకృతుల తయారీ, నేసే విధానంపై వివరిస్తున్నారు. ఇప్పటికే ఈ రంగంపై అవగాహన ఉన్న 10 మంది మహిళలను ఎంపిక చేయగా నిత్యం హాజరవుతున్నారు. వీరిలో 40 ఏళ్లలోపు వయసు ఉన్న వారు ఉన్నారు. రోజుకు రూ.300 చొప్పున భృతి చెల్లిస్తున్నారు. నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ సాగుతోంది.సంస్థల ద్వారా ప్రోత్సాహం..ఇన్నాళ్లు సదరు మహిళలు ఇర్కోడు సొసైటీ వద్ద పాఠశాలలకు సంబంధించిన ఏకరూప దుస్తులు తయారీ చేశారు.

# ఖనిజ నేలను కాజేశారు

నంద్యాల : పరిశ్రమలు ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి చూపుతామంటూ ముందుకొచ్చారు. స్థానిక నేతల సహకారంతో వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్ని లీజుకు తీసుకొన్నారు. అపారమైన ఖనిజ సంపద కలిగిన భూముల్ని సొంతం చేసుకొని పరిశ్రమల మాటే విస్మరించారు. పైగా ప్రభుత్వ భూముల్ని సొంత జాగీరులా అనుభవిస్తున్నారు. ఇతరులకు లీజుకు ఇస్తూ అక్రమంగా ఆదాయం పొందుతున్నారు. మరికొందరు ఎటువంటి కార్యకలాపాలు ప్రారంభించకుండా వందల ఎకరాలను తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పెద్దల పాలయ్యాయి.

**అడిగిందే తడవుగా అప్పగించారు**

ఒక ప్రాజెక్టుకు అనుమతిని ఇచ్చే ముందు ఆ సంస్థ పరిశ్రమను ఎప్పట్లోగా ఏర్పాటు చేస్తుంది.. ఎప్పుడు ఉత్పత్తిని ప్రారంభిస్తుందో స్పష్టత అవసరం. అందుకు అనుగుణంగా ప్రభుత్వ అధికారులు వివిధ రకాల చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పురోగతిలో ఉందో లేదో దశల వారీగా పర్యవేక్షించాలి. ప్రారంభించిన తర్వాత ఎంతమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయో పరిశీలించాలి. ఉమ్మడి జిల్లాలో మాత్రం ఇవేమీ పట్టించుకోకుండానే ఓర్వకల్లు మండలం, గడివేముల, పాణ్యం, కొలిమిగుండ్ల మండలాల్లో వైకాపా హయాంలో వేలాది ఎకరాలు కేటాయించారు.

**సొమ్ము చేసుకొంటున్నారు**

ఓ వ్యక్తి గడివేముల మండలంలో సొంతంగా సర్వే చేయించారు.. గుర్తించిన భూముల్లో సున్నపురాయి తవ్వకాలు చేపట్టేందుకు లీజు కోసం దరఖాస్తు చేసుకున్నారు. గడిగరేవుల గ్రామ సమీపంలో సుమారు 50 ఎకరాల్లో లీజులు పొందారు. ఇంత వరకు ఉత్పత్తి మాత్రం ప్రారంభించలేదు. బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్‌లోని పరిశ్రమలకు గడివేములలో 63.95 ఎకరాల భూమిని మూడేళ్ల కిందటే కేటాయించినా ఇంత వరకు ఉత్పత్తి మాటే లేదు.



గడివేముల మండలంలోనే 20 ఏళ్ల కిందట సున్నపురాయి లీజులను పొందిన ఓ గనుల యజమాని వాటిని ఒక పరిశ్రమకు బదలాయించి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నారు.

పనులు ప్రారంభించని 'పెద్ది' సంస్థ

కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో ఓ సంస్థ సిలికాస్యాండ్ ఖనిజం తవ్వకాల కోసం 300 ఎకరాలను తీసుకుంది. విద్యుత్తు ఉపకరణాలు తయారు చేసే ఈ సంస్థ వైకాపా ప్రభుత్వంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ప్రస్తుతం కేసులు నమోదవుతున్నాయి. గత ప్రభుత్వంలో పెద్ద నాయకుడిగా చెలామణి అయిన వ్యక్తి అస్మదీయ సంస్థగా ఇది గుర్తింపు పొందింది. రెండేళ్ల కిందట లీజు ప్రాతిపదికన భూములను కేటాయించినా ఇంతవరకు మైనింగ్ ప్రారంభించలేదు.

తూడిచెర్ల, కాల్వ తదితర గ్రామాల సమీపంలో లీజులు కేటాయించినా ఉత్పత్తులు జరగడం లేదు. ఒక్కో సంస్థకు 50 నుంచి 75 ఎకరాల వరకు భూములను కేటాయించారు.

**బోర్డు తిప్పేశారు**

2010లో కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామ సమీపంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు కోసం సుమారు 3 వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూమిని కేటాయించింది. సిమెంటు పరిశ్రమ ఏర్పాటుతో 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఉద్దేశంతో అధికారులు భూములను అప్పగించారు. ఆ తర్వాత ఈ సంస్థ పత్తా లేకుండా పోయింది.

కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామ సమీపంలో ఓ కంపెనీ సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేసింది. 15 ఏళ్ల కిందట కోటపాడు దగ్గర భూములు పొందిన బహుళ జాతి సంస్థ కల్వటాల వద్ద కొత్తగా పరిశ్రమను ఏర్పాటు చేసిన సంస్థకు వాటిని బదలాయించింది. తామే పరిశ్రమను ఏర్పాటు చేస్తామని తీసుకున్న భూములను మరో సంస్థకు బదలాయించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి.

# నిండు ప్రాణం తీసిన నిర్లక్ష్యం

నంద్యాల : పుర అధికారుల అలసత్వం ఏడేళ్ల బాలుడి ప్రాణం తీసింది. నంద్యాల పట్టణంలోని పురపాలక పార్కులో పైపులైను వాల్వ్ తొట్టి నిర్మాణానికి పదడుగులకు పైగా లోతైన గుంత తవ్వారు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు.. పనులు పూర్తయి రెండు వారాలవుతున్నా.. గుంతను పూడ్చి వేయలేదు. నీటితో నిండిన ఆ గుంతే ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. పట్టణంలో చాంద్‌బాడకు చెందిన మన్సూర్, రజియాబి దంపతులకు ఇద్దరు కుమారులు మహమ్మద్‌అలీ, అయాన్ సంతానం. ఇద్దరూ ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. సెలవు కావడంతో సమీపంలోని పురపాలక పాఠశాల మైదానంలో క్రికెట్



ఆడేందుకు వెళ్లారు. ఆడుకునే క్రమంలో బంతి వెళ్లి పక్కనే ఉన్న పురపాలక ఉద్యానవనంలో వాల్వ్ తొట్టి నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడింది. లోతైన ఆ గుంత నీటితో నిండి ఉంది. అన్నదమ్ములిద్దరు బంతి కోసం గుంత దగ్గరకు వెళ్లారు. బంతిని అందుకునే ప్రయత్నంలో అయాన్ గుంతలో పడిపోయాడు. ఇది చూసిన మహమ్మద్ అలీ తమ్ముడిని కాపాడేందుకు నీటిలో దిగాడు. మునిగిపోతున్న వారిని గుర్తించిన స్థానికులు వెంటనే వెళ్లి ఇద్దరినీ బయటకు తీసి స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అయాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మహమ్మద్ అలీ ప్రాణాలకు ప్రమాదం లేదని చెప్పారు. ఏడేళ్ల చిన్నారి మృతితో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

# కంటైనర్ క్యాంటీన్లు స్టార్టప్‌లట..!




అనకాపల్లి : సాధారణంగా వినూత్న ఆవిష్కరణలను స్టార్టప్‌లుగా పిలుస్తారు. కానీ, గత వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి హయాంలో కంటైనర్ క్యాంటీన్లను కూడా స్టార్టప్‌లుగా నిర్ధారించారు. ఆ పేరుతో అప్పటి వైకాపా నాయకులు సిఫార్సులు చేసిన వారికి క్యాంటీన్లను కట్టబెట్టారు. ఒక్కోదానికి అద్దె, విద్యుత్తు, నీటి ఖర్చులు కలిపి నెలకు వర్సిటీకి రూ.12,500 చొప్పున నిర్వాహకులు చెల్లించేవారు. ఈ ఒప్పందం గత ఏడాది జూన్ నెలతో ముగిసింది. అప్పటి నుంచి ఎలాంటి అద్దె చెల్లించకుండా కొనసాగుతున్నారు. ఫలితంగా వర్సిటీకి రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది.

**వర్సిటీ క్యాంటీన్ల మూత:** విశ్వవిద్యాలయంలో 2023 ఏడాదిలో తొమ్మిది కంటైనర్ క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి. అందులో ఆరు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోనే నెలకొల్పారు. వాటిలో ఒక సెలూన్, ఒక జిరాక్స్ సెంటర్ కూడా ఉంది. ఏయూ ఆధ్వర్యంలో సెంట్రల్ క్యాంటీన్, ఆర్ట్స్ కళాశాల వెనుక మరో క్యాంటీన్ నడిచేవి. ఏటా టెండర్ పిలిచి అధిక మొత్తానికి కోట్ చేసిన వారికి వీటిని కేటాయించేవారు. కొవిడ్ సమయంలో ఇవి మూతపడ్డాయి. తర్వాత ఆర్ట్స్ కళాశాల వెనుక ఉన్న క్యాంటీన్ తెరిచినప్పటికి అక్కడ తనకు వ్యతిరేకంగా విద్యార్థులు సమావేశాలు నిర్వహిస్తున్నారనే ఉద్దేశంతో అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి దాన్ని 2023లో మూయించారు.

**నిబంధనలు పక్కన పెట్టి..**నాడు కంటైనర్ క్యాంటీన్లలో ఆరింటిని ఇంక్యుబేషన్ కేంద్రానికి అప్పగించారు. నిర్వాహకులు నెలకు రూ.10వేల చొప్పున అద్దె ఆ కేంద్రానికి చెల్లించేవారు. నెలవారీ విద్యుత్తు, తాగునీటి ఖర్చులు రూ.2500 చొప్పున ఏయూ ఇంజినీరింగ్ విభాగానికి చెల్లించేవారు. వాస్తవానికి ఏయూలోని క్యాంటీన్ల నిర్వహణ ఇంజినీరింగ్ విభాగం చూస్తుంది. కంటైనర్ క్యాంటీన్లు కూడా ఆ విభాగమే నిర్వహించాలి. అయితే.. గత వీసీ వీటికి స్టార్టప్‌ల ముద్ర వేసి నిబంధనలకు విరుద్ధంగా ఇంక్యుబేషన్ కేంద్రానికి కేటాయించారు. దీనిపై ఏయూ చీఫ్ ఇంజినీర్ తిరుపతిరావును సంప్రదించగా కంటైనర్ క్యాంటీన్లను తమకు అప్పగించకపోవడంతో వాటి గడువు ముగిసినా చర్యలు తీసుకోలేకపో తున్నట్లు చెప్పారు.

**తెర వెనుక రాజకీయ నాయకులు**

గత ఏడాది జూన్ నుంచి ఎలాంటి అద్దె లేకుండా కంటైనర్ క్యాంటీన్లు కొనసాగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీటిని తొలగించడానికి ఏయూ అధికారులు చేసిన ప్రయత్నాలను స్థానిక రాజకీయ నాయకులు అడ్డుకున్నట్లు తెలిసింది. వీటికి టెండర్లు పిలవకపోవడంతో నెలకు రూ.99వేల చొప్పున 11నెలల్లో సుమారు రూ.10లక్షల మేర ఏయూ ఆదాయం కోల్పోయింది. ఇప్పటికైనా వర్సిటీ పాలకులు స్పందించి కంటైనర్ క్యాంటీన్లకు తిరిగి టెండర్లు పిలవడంతోపాటు సెంట్రల్ క్యాంటీన్, ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని క్యాంటీన్‌ను తెరవాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.

# విత్తన నాణ్యతకు పరీక్ష



కర్నూలు: ఉమ్మడి జిల్లాలో అగ్రిల్యాబ్‌ల్లో 'పరీక్ష'లు అటకెక్కాయి. పలు కేంద్రాల్లో రసాయనాల కొరత వేధిస్తోంది.. మరికొన్నింటిలో పరీక్షలు చేసేందుకు పరికరాలు లేవు. మరోనెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ వచ్చేస్తోంది. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు స్పందించి నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ల్లో సమస్యలు పరిష్కరించాలి. అప్పుడే నకిలీలకు 'పరీక్ష'లు చేయడానికి వీలుంటుంది. ఒక్కో కేంద్రానికి రూ.55 లక్షలు వెచ్చించి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతా పరీక్షలు చేసి రైతులకు దిశానిర్దేశం చేయాలి. కేవలం ఎనిమిది కేంద్రాలే పని చేస్తున్నాయి. నాలుగు వినియోగంలోకి రాలేదు.

**లక్ష్యం అందుకోవడం కష్టమే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి పది లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. కర్నూలు జిల్లాలో ఐదు, నంద్యాలలో మూడు కేంద్రాలే పని చేస్తున్నాయి. ఆత్మకూరు, పాణ్యం, బనగానపల్లి, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని అగ్రిల్యాబ్‌లను వినియోగంలోకి తీసుకురాలేదు. పరికరాల కొరత, పరీక్షలు చేసేందుకు రసాయనాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గతేడాది 2,629 మంది రైతుల విత్తనాలు, 31 ఎరువుల నమూనాలకు పరీక్షలు చేశారు. 2025-26 ఏడాదికి సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాల సేకరణ లక్ష్యాలను నిర్దేశించారు.

**అమర్చడం మరిచారు**

డోన్ ల్యాబ్‌కు మెంబరెన్స్ ఫిల్టర్ సరఫరా చేయలేదు. స్పినోటెక్ ప్రైవేటు లిమిటెడ్, నేషనల్ సైంటిఫిక్ కంపెనీ అగ్రిల్యాబ్ పరికరాలను అమర్చలేదు. పాణ్యం అగ్రిల్యాబ్‌లో సీడ్, ఫర్టిలైజర్స్ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) సరఫరా చేశారు. వాటిని ఇన్‌స్టలేషన్ చేయలేదు.

గూడూరు కేంద్రానికి వాటర్‌బాత్ షాకర్, పీహెచ్ మీటర్, వాక్యూమ్ పంప్ తదితర వాటిని సరఫరా చేయలేదు.

పరికరాలు పనిచేయడం లేదు

నంద్యాలలో జెల్డాల్ యూనిట్-2 యూనిట్లు, వాక్యూమ్ పంప్ ఆత్మకూరులో సీడ్ జర్మినేటర్ పనిచేయడం లేదు. మంత్రాలయర్లో జర్మినేటర్ ఛాంబర్ స్టెబిలైజర్‌ను మూలకువేశారు.

పత్తికొండ, ఆదోని కేంద్రాల్లో డిస్టిలేషన్ యూనిట్ సీడ్ జర్మినేటర్, ఆలూరులో ఎలక్ట్రికల్ వేయింగ్ మెషిన్ పనిచేయడం లేదు.

విద్యుత్తు లోవోల్టేజీతో ఆళ్లగడ్డ కేంద్రంలో సీడ్ జర్మినేటర్ పనిచేయడం లేదు. జెల్డాల్ యూనిట్-2 కాయిల్స్‌లో ఒకటే పని చేస్తోంది. వాటర్ డిస్టిలేషన్ యూనిట్ పనిచేయడం లేదు.

**రసాయనాలేవీ**

నందికొట్కూరు అగ్రిల్యాబ్‌లో సీడ్, ఫర్టిలైజర్స్ ఎక్విప్‌మెంట్ పరికరాలను ఇన్‌స్టలేషన్ చేశారు. పరీక్షలు చేసేందుకు రసాయనాలను సరఫరా చేయలేదు. బనగానపల్లి ల్యాబ్‌లో సీడ్, ఫర్టిలైజర్ ఎక్విప్‌మెంట్ పరికరాలను సరఫరా చేశారు. రసాయనాలు సరఫరా చేయలేదు. కంప్యూటర్లు లేవు. తేమశాతం మీటర్, జర్మినేషన్ పేపర్లు సరఫరా చేయలేదు. హాట్ ఎయిర్ ఓవెన్, వాక్యూమ్ పంప్ ల్యాబ్‌కు సరఫరా చేయలేదు.

# గోరుకల్లు.. కట్టకు చిల్లు

పాణ్యం : రాయలసీమ రైతుల జీవనాడి గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోయింది.. గతంలో రెండు చోట్ల కుంగిపోగా.. ప్రస్తుతం మరోచోట కుంగిపోయింది. వైకాపా హయాంలో నిర్వహణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. తాజాగా వారం రోజుల నుంచి కట్టకుంగడం మొదలైంది. సుమారు 20 మీటర్ల రాతిపరుపు నీళ్లలోకి జారిపోయింది. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే 1.90 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్టను పటిష్ఠం చేయాలంటూ అన్నదాతలు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

**రాయలసీమ జీవనాడి**

కృష్ణాజలాలను ఎస్సార్బీసీ, గాలేరు నగరి కాల్వల ద్వారా ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు తరలించాలన్న ఉద్దేశంతో గోరుకల్లు జలాశయాన్ని నిర్మించారు. ఇందులో 12.44 టీఎంసీల నీటిని నిల్వ చేసి పలు గ్రామాలకు మంచినీరు, 1.90 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. రూ.430 కోట్లు వెచ్చించి 2006లో పనులు ప్రారంభించారు.. 2016 నుంచి నీటిని నిల్వ చేస్తున్నారు. గతంలో తెదేపా హయాంలో 92 శాతం పనులు పూర్తయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. ఫలితంగా 11 టీఎంసీలే నిల్వ చేయాల్సి వస్తోంది.

**వైకాపా నిర్లక్ష్యం.. రైతులకు శాపం**

గోరుకల్లు జలాశయం నిర్వహణకు వైకాపా ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. నిర్వహణ గాడితప్పి కట్టపై దట్టంగా ముళ్లపొదలు పెరిగాయి. వర్షాలకు మట్టికట్ట కోతకు గురైంది. గుంతలు పడి



బలహీనంగా మారింది.

2023 మే నెలలో మట్టికట్ట కుంగడం ప్రారంభమైంది. జలాశయంలోని 2.600 కి.మీ వద్ద 50 మీటర్లు, మరోచోట 2.925 నుంచి 2.985 కి.మీ వద్ద 60 మీటర్ల పొడవున పది అడుగుల లోతు వరకు కుంగిపోయింది. మట్టికట్టపై వేసిన బండపరుపు రాళ్లు నీళ్లలోకి జారుతున్నట్లు అధికారులు గుర్తించారు. రైతులు ఆందోళన చేయడంతో దిగొచ్చిన అప్పటి వైకాపా ప్రభుత్వం పనులు చేపట్టింది. అందుకు సంబంధించి గుత్తేదారుకు రూ.93 లక్షలు రావాల్సి ఉంది.

2024 జనవరిలో గేట్ల వద్ద మరోసారి మట్టికట్ట కుంగింది. రైతులు విన్నవించినా అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు..'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరమ్మతులు చేయించారు.

# ఇసుక బావులు.. అక్రమాల తావులు

కౌతాళం : తుంగభద్ర నదిలో ఇసుక తోడేళ్లు 'లోతు'గా తవ్వి అక్రమాలను కప్పేస్తున్నాయి. కౌతాళం మండలంలోని గుడికంబాలి, మరళి-1, మరళి-2, నదిచాగి ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కౌతాళం మండలంలో ప్రస్తుతం గుడికంబాలి, నదిచాగి రీచ్‌ల నుంచి ప్రస్తుతం ఇసుక తరలిస్తున్నారు. మరళిలో ఆగిపోయాయి. గుడికంబాలి ఇసుక రీచ్ విస్తీర్ణం 10 హెక్టార్లు. ఇక్కడ ఏడాదికి లక్ష క్యూబిక్ మీటర్ల తరలించొచ్చు. 1 మీటరు లోతు వరకు అంటే 3 అడుగులు తవ్వాలి. కానీ ఇక్కడ సుమారు 8 అడుగుల లోతులో తవ్వకాలు చేపట్టారు. గుంతలు కాల్వను తలపిస్తున్నాయి. అంతేకాకుండా పరిమితికిమించి టిప్పర్లలో లోడు చేస్తున్నారు. వాహనాల సామర్థ్యానికిమించి రెండింతల బరువుతో ఇసుకను తరలిస్తున్నారు. నదిచాగి ఇసుక రీచ్‌ను 9.170 హెక్టార్లలో కేటాయించారు. ఇక్కడి నుంచి ఏడాదిలో 91,700 క్యూబిక్ మీటర్లు తవ్వుకోవాలి. రీచ్ ప్రాంతం నదిలో ఇసుకను 1 మీటరు లోతు వరకు అంటే 3 అడుగులు తవ్వాలి. సుమారు 8 అడుగుల లోతులో తవ్వకాలు చేపట్టారు. ఇసుక తీసిన గుంతలు నీటికుంటలు, చెరువులను తలపిస్తున్నాయి.

**కానరాని తనిఖీలు**

ఇసుక రీచ్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక లోతులో తవ్వకాలు చేపట్టినా, పరిమితికిమించి వాహనాల్లో అధికంగా లోడు చేస్తున్నా గనుల శాఖ, ఆర్టీవో అధికారుల తనిఖీలు కొరవడ్డాయి.

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా గనుల శాఖ అధికారులు రీచ్‌లను పరిశీలించిన దాఖలాలు లేవు. వారంతా కార్యాలయాలకే పరిమితమయ్యారు.గత వైకాపా హయాంలో నిబంధనలకు విరుద్ధంగా నది మొత్తం తవ్వేశారు. కర్ణాటక ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలించారు.. ప్రస్తుతమూ అదే పరిస్థితి నెలకొంది.

**సామర్థ్యానికి మించి తరలింపు**



నిబంధనల ప్రకారం రీచ్‌ల్లో ఒక టన్ను ఇసుక ధర గుడికంబాలిలో రూ.39, నదిచాగిలో రూ.40 చొప్పున అక్కడ చెల్లించి తగిన రసీదు తీసుకొని వాహనాల్లో తరలించాలి. కానీ అలా కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించడమే కాకుండా, అదనంగా ఒక టిప్పర్‌కు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు చెల్లిస్తేనే ఇసుక లోడింగ్ జరుగుతోంది. లేకపోతే రెండు, మూడు రోజులైనా లోడింగ్ కాని పరిస్థితి నెలకొంది. గుత్తేదారులకు కావాల్సిన లారీలకు, పలువురు రాజకీయ నాయకుల వాహనాలకు వెంటవెంటనే లోడింగ్ చేసి పంపిస్తున్నారు. సాధారణ వ్యక్తుల వాహనాల విషయంలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. గుడికంబాలి, నదిచాగి రీచ్‌ల్లో జరుగుతున్న అక్రమాలు, అదనపు వసూళ్ల గురించి ఇటీవల కర్నూలు కలెక్టరేట్ ఎదుట లారీ అసోసియేషన్‌వారు ఆందోళన చేపట్టారు. రీచ్‌ల్లో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక లోడింగ్ చేస్తూ తరలిస్తున్నారు. రాత్రిపూట తరలించే వాహనాలకు రుసుము, రసీదు లేకుండా రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది.

# ఆక్వా రైతు కుదేలు!

భోగాపురం: విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టి, వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆక్వా పరిశ్రమ ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. గత కొన్ని రోజులుగా వివిధ వైరస్‌ల కారణంగా రొయ్యల దిగుబడి తగ్గిపోయింది. ఓ వైపు రొయ్య విత్తనం, మేత సరకు దొరక్క ఇబ్బంది పడుతున్న రైతులు అమెరికా విధించిన సుంకాలకు కుదేలవుతున్నారు. దీనికితోడు పెద్ద కౌంటు రొయ్యల ధర ప్రస్తుతం కిలోకు రూ.40 వరకు తగ్గిపోయింది. దీంతో జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.జిల్లాలో సుమారు 200 చెరువుల్లో రొయ్యల సాగు చేపడుతున్నారు. ఈ సీజన్‌లో వైరస్ తక్కువగా సోకడం, పెద్ద కౌంటుకు అధిక ధర వస్తుండడంతో ఏటా వేసవిలో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ధర పతనం, పన్ను పోటు కారణంగా ప్రస్తుతం సేకరించాలో లేక చెరువుల్లోనే ఉంచాలో అర్థంకాక రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి, వైరస్‌ను అధిగమించి, ఎక్కువ కాలం చెరువుల్లో ఉంచడం మంచిది కాదని, త్వరగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకుంటే మరింత నష్టం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రోత్సహిస్తే నష్ట నివారణ** ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ప్రభుత్వం విద్యుత్తు రాయితీలను ప్రకటించింది. యూనిట్ రూ.1.50కే అందించనున్నట్లు ప్రకటించింది. ఇటీవల ఆ శాఖ మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వదేశీ వినియోగం పెంచాల కృషి చేస్తామని, ఆక్వా రంగం కోలుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు రాయితీపై



విధి విధానాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని కోరారు. రైతులు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందాలన్నా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు. జోన్, నాన్ జోన్ అనే తేడా లేకుండా రిజిస్ట్రేషన్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

**అధ్యయనానికి కమిటీ ఏర్పాటు**

– విజయ్, మత్స్యశాఖ డీడీ

ఆక్వా రైతుల సమస్యలపై అధ్యయనానికి ప్రభుత్వం 16 మందితో సలహా కమిటీని నియమించింది. కమిటీ నివేదిక ఆధారంగా ఇతర మార్గాల ద్వారా రైతులకు సహకారం అందించనుంది. 90 రోజుల పాటు గతంలో ఉన్న 10 శాతం సుంకం అమల్లో ఉంటుంది. రైతులను ఆదుకునే మార్గాల అన్వేషణకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఇదీ పరిస్థితి..

సాగు విస్తీర్ణం 568.21

రైతుల సంఖ్య: 230

కార్మికుల సంఖ్య సుమారు: 5వేల మంది

ఏడాదిలో వ్యాపారం: రూ.70 కోట్లు

# చొరవ చూపు.. వెలుగునివ్వు

రాయదుర్గం : రాయదుర్గం అంటే గుర్తుకొచ్చేది గార్మెంట్స్.. ప్రధానంగా విభిన్న రకాల జీన్స్ తయారీకి రాయలసీమలోనే ప్రసిద్ధి. గతంలో దుర్గం పరిశ్రమలతో కళకళలాడేది. ఐదేళ్లలో వైకాపా సర్కారు నిర్లక్ష్య వైఖరి కారణంగా వెలవెలబోతోంది. తెదేపా ప్రభుత్వ హయాంలో గార్మెంట్స్ పరిశ్రమకు అవసరమైన కార్మికులను సిద్ధం చేయడం... మహిళలకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాయదుర్గంలో రెండు చోట్ల సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్కులో ఒకటి, పుర పథకం కింద వెలుగు ఆధ్వర్యంలో మరొకటి శాంతినగర్‌లో అందుబాటులోకి తెచ్చారు. వాటి ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలకు దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చి ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయూత అందించాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో రూ.కోట్లు విలువైన భవనాలు, రూ.50 లక్షలు విలువ చేసే 150 అధునాతన కుట్టుమిషన్లు నిరుపయోగంగా మారాయి.

**ఏటా 250 మందికిపైగా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలో రెండు కేంద్రాల ద్వారా ఏటా సుమారు 250 మంది మహిళలకు స్టైఫండ్ ఇచ్చి... ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేవారు. తర్ఫీదు పూర్తి అయ్యాక ఇంట్లో, వివిధ గార్మెంట్స్ పరిశ్రమల్లో దుస్తులు కుడుతూ ఉపాధి పొందేవారు. టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మంది మహిళలకు అంతర్జాతీయ ప్రమాణాలతో దుస్తుల తయారీపై శిక్షణ ఇచ్చి.. నెలకు రూ.10వేల దాకా



సంపాదించేలా తర్ఫీదునిచ్చారు. ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా సాగిన తరువాత స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినా మూన్నాళ్ల ముచ్చటే అయింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిర్వహణను గాలికి వదిలేసింది. టెక్స్‌టైల్ పార్కులో రవాణా ఛార్జీ, భోజన వసతి మాత్రమే కల్పిస్తామని.. స్టైఫండ్ ఇవ్వమని అధికారులు చెప్పటంతో శిక్షణ ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం అటు ప్రభుత్వం ఇటు ప్రైవేటు వ్యక్తులు నిర్వహించకపోవటంతో భవనాలు, కుట్టుమిషన్లు వృథాగా మారాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు.. పీ4 విధానం ప్రకటించి అమలు చేస్తున్నారు. ఈ విధానంతో నైనా సీఎఫ్‌సీలను పునరుద్ధరిస్తే ఎంతో మందికి నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి కలుగుతుంది. దీంతో దుర్గం గార్మెంట్స్‌కు పూర్వవైభవం రానుంది.

**నిధులు రాగానే పునఃప్రారంభం – ఈశ్వరయ్య, పీడీ, డీఆర్‌డీఏ, అనంతపురం** నిధులు మంజూరు కాగానే సీఎఫ్‌సీలను పునఃప్రారంభిస్తాం. శిక్షణకు సంబంధించి కుట్టు యంత్రాలు, భవనం తదితరాలకు మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచుతాం.

# ముక్కంటి.. కష్టాలు కంటి!

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో రద్దీ సర్వసాధారణమవుతోంది. ప్రధానంగా వారాంతం, వరుస సెలవుల దృష్ట్యా వచ్చే భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో ఉండిపోతున్నారు. దోష పూజలు చేయించుకునేందుకు క్యూలైన్లు, మళ్లీ స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రధానంగా రూ.500, రూ.750 రాహు, కేతు పూజా టికెట్లు తీసుకునే భక్తులు పూజ, దర్శనం పూర్తయ్యే సరికి నాలుగైదు గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇలా గంటల తరబడి క్యూలైన్లలో ఉండటం వల్ల మధుమేహ బాధితులు. వృద్ధులు, పిల్లలు తీవ్ర అలసటకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించేలా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తీరతాయి. ః ఆలయంలో 5,580 దోష పూజలు జరిగాయి. ఇక రూ.200



శీఘ్రదర్శనం 4,554, రూ.50 ప్రత్యేక దర్శనం 3,648, రూ.500 అంతరాలయ దర్శనం టికెట్లు 586 అమ్ముడుపోయాయి. దాదాపు 28 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా ఆలయ ఈవో టి.బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డిలు క్యూలైన్లను పర్యవేక్షించారు.

**అనధికారిక డ్రోన్ స్వాధీనం!:** శ్రీకాళహస్తీశ్వరాలయంపై అనధికారికంగా ఎగురుతున్న డ్రోన్ కెమెరాను భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ముక్కంటి ఆలయంపై అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలను ఎగరవేయకూడదు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా దాటిన తరువాత డ్రోన్ ఎగరడంపై భద్రతా సిబ్బంది గుర్తించి ఎస్పీఎఫ్ విభాగానికి అప్పగించారు. డ్రోన్ కెమెరాతో పాటు వ్యక్తిని పట్టణ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

# బోయకొండకు రోప్ వే

బోయకొండ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన బోయకొండ గంగమ్మ దేవస్థానం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. రోప్ వే ద్వారా కొండపైకి చేరుకోవడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు అటవీ శాఖాధికారులు సైతం స్థలం పరిశీలించారు. బోయకొండ గంగమ్మను దర్శించుకోవడానికి ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు భక్తులు తరలివస్తారు. ఆలయానికి ఏటా రూ.12 కోట్ల పైబడి ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం కొండ కింద నుంచి వాహనాల ద్వారా, కాలినడకన ఆలయానికి చేరుకోవడానికి మార్గాలు ఉన్నాయి. కింద ఉన్న గాలి గోపురం నుంచి కొండపైనున్న ప్రధాన ఆలయం వరకు 2.5 కి.మీ. మేర రోప్ వే వేయాలని గతంలోనే అంచనాలు వేశారు. తర్వాత విషయం మరుగున పడింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రోప్ వే నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చజెండా ఊపాయని ఈవో ఏకాంబరం పేర్కొన్నారు.

# ఖాళీ స్థలమా.. కబ్జా చేద్దామా!



గుత్తి : గుత్తిలో ఖాళీస్థలం కనిపిస్తేచాలు కబ్జా చేస్తున్నారు. అది ప్రైవేట్‌దా? లేక ప్రభుత్వానిదా అని చూడటం లేదు. ముందు కబ్జా చేసి ఆ తరువాత నకిలీ పట్టాలు చూపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని దర్జాగా క్రయవిక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
గతంలో వివేకానంద నగర్‌లో కొందరు స్థలాలు తమవని నకిలీ పత్రాలతో వచ్చి నిజమైన వారితో గొడవకు దిగారు. నిజమైన లబ్ధిదారులు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం బయట పడింది. తాడిపత్రిరోడ్డులోనూ ఓ వ్యక్తి పదేళ్ల కిందట 3 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అది ఖాళీగా ఉండటంతో కొందరు ఆక్రమించారు. చివరకు నకిలీ పట్టా చూపించి, యజమానితోనే రూ.30వేలు దండుకున్నారు.

**పథకం ప్రకారమే...**

ఖాళీస్థలాన్ని పథకం ప్రకారం ఆక్రమించి తరువాత నకిలీ పట్టాలతో నిజమైన పట్టాదారులను బుకాయించి సొమ్ములు దుండుకుంటున్నారు. ఇలా గుత్తి పురపాలికలో అడ్డూ అదుపులేకుండా ఆక్రమణలు సాగుతున్నాయి.

**క్షేత్రస్థాయిలో కొన్ని ఇలా..**గుత్తిలో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు తాత్కాలికంగా షెడ్లు వేసుకోగా మరికొందరు శాశ్వతంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్, కోర్టు పరిసరాల్లో సుమారు 17 మంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. తాజాగా ఓ ప్రభుత్వ ఉద్యోగి సుమారు మూడు సెంట్ల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. ఆ నిర్మాణాలు రాత్రికి రాత్రే కొనసాగుతున్నాయి. ఆక్రమణలను తహసీల్దారు ఓబిలేసు గత గురువారం రాత్రి చూసి పనులు అడ్డుకున్నారు. నీ లచ్చానిపల్లి జగనన్న లేఅవుట్ సమీపంలో సర్వేనంబర్ 644–3లోని 4.60 ఎకరాలు మార్కెట్‌లో రూ.10కోట్లు విలువ పలుకుతోంది. దీన్ని వైకాపా నాయకులు ఆక్రమించగా వరుస కథనాలతో రెవెన్యూ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గుత్తిశివారులోని కొత్తపేట జగనన్న లేఅవుట్‌లోని సర్వేనంబర్ 431లో వైకాపాకు చెందిన ఓ నాయకుడు ఏకంగా ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. మొత్తం 200 ఎకరాల ప్రభుత్వ భూమి అక్కడ ఉండగా కొందరు ఆక్రమించుకుంటున్నారు.

**నోటీసులతో సరిపెడుతూ..**రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి మిన్నకుండిపోయారు. కొత్తపేట లేఅవుట్‌లో కూడా సుమారు 60 మందికి నోటీసులిచ్చారు.

**పరిశీలించి చర్యలు– ఓబిలేసు, తహసీల్దారు, గుత్తి**

ప్రభుత్వ స్థలాలు, భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. దీనిపై పూర్తి నివేదికను ఆర్డీవోకు పంపుతాం.

# ఎప్పుడొచ్చేనో వన్యప్రాణి బోర్డు అనుమతులు?



తిరుపతి: మదనపల్లె– తిరుపతి జాతీయ రహదారి (ఎన్‌హెచ్– 71) కొన్నేళ్లుగా కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు.. ఇప్పుడు దాదాపు తుది దశకు చేరింది. మదనపల్లె– పీలేరు మధ్య సుమారు 80 శాతం పనులు పూర్తి కాగా కీలకమైన భాకరాపేట కనుమలో రోడ్డు నిర్మాణానికి జాతీయ వన్యప్రాణుల బోర్డు నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఒక్కసారి ఆమోదం లభిస్తే ఏడాదిలోపు పనులు పూర్తయి తిరుపతికి వేగంగా చేరుకోవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేగంగా అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.
ఎన్‌హెచ్– 71ను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మదనపల్లె– పీలేరు ఒక ప్యాకేజీ కాగా, పీలేరు– కాలూరు (తిరుపతి గ్రామీణ మండలం) మరో ప్యాకేజీ. 103 కిలోమీటర్లుగా ఉన్న ఈ రహదారి నిర్మాణానికి రూ.1,877.47 కోట్ల వ్యయంతో ఆమోదం లభించింది. మొదటి భాగంలో రమారమి 82 శాతం పనులు పూర్తయ్యాయి. వాస్తవంగా తొలి ప్యాకేజీ ఈ ఏడాది సంక్రాంతికి ముందే అంటే జనవరి 12 నాటికి పూర్తి చేయాలని ఒప్పందం సందర్భంగా పేర్కొన్నారు. వేర్వేరు కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది. తుదిగా ఆగస్టు 15వ తేదీని చివరి గడువుగా నిర్దేశించారు.

**112.97 ఎకరాలు అప్పగించాలని..**

మదనపల్లె– పీలేరు మధ్య పెద్దగా ఇబ్బందులు లేనందున సాఫీగానే పనులు సాగుతున్నాయి. చిక్కంతా పీలేరు– కాలూరు మధ్యే ఎదురైంది. ఈ మార్గంలో రక్షిత అటవీ ప్రాంతం ఉం ఉండటంతో అటవీ శాఖ, జాతీయ వన్యప్రాణి బోర్డు అనుమతులు తీసుకోవాల్సిందే. 112.97 ఎకరాలు తమకు అప్పగించాలని ఎన్‌హెచ్ అధికారులు అటవీ శాఖను కోరారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చినా వన్యప్రాణి బోర్డు కూడా అంగీకరించాలి. జంతువులు స్వేచ్ఛగా తిరిగేందుకు అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించగా అందుకు ఎన్‌హెచ్ యంత్రాంగం అంగీకరించింది. మూడు ప్రాంతాల్లో రెండు కి.మీ మేర వీటిని కడతారు. ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు.

# అనుమితికి మించి బాణసంచా తయారీ?

అనకాపల్లి: కోటవురట్ల మండలంలో అనుమతికి మించి బాణసంచా తయారీ వల్లే భారీ విస్ఫోటనం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్ పేరుతో ఇక్కడ 15 కేజీలలోపు మందుగుండు సామగ్రి తయారీకే లైసెన్స్ తీసుకున్నారు. ఈ కేంద్రంలోజరిగిన పేలుడు ధాటికి కాంక్రీట్ కట్టడాలు నేలమట్టమయ్యాయి. అందులో పనిచేసే ఎనిమిది మంది కార్మికులు అల్లంతదూరాన ఎగిరిపడి చనిపోయారు. మరో ఎనిమిది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భారీ స్థాయిలో మందుగుండు పేలడంతోనే ఇంత విధ్వంసం జరిగింది. ప్రమాద పరిసరాల్లో ఇంకా వేలసంఖ్యలో పెద్ద తారాజువ్వలు, తాటాకు టపాసుల కట్టలు, సల్ఫర్, బొగ్గు, పొటాషియం నైట్రేట్, ఎలక్ట్రిక్ పౌడర్, బేకింగ్ సోడా నిల్వలున్నాయి. వీటన్నింటిని చూస్తే అనుమతికి మించే బాణసంచా తయారవుతున్నట్లు పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఓ అంచనాకు వస్తున్నారు. 15 కేజీలకు మించి మందుగుండు తయారీ చేయాలంటే చెన్నైలోని ఎక్స్‌ప్లోజివ్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతులు తీసుకోవాలి. అలా చేయకుండా స్థానికంగా తక్కువ మోతాదుకు లైసెన్స్ తీసుకుని భారీగా ఉత్పత్తి చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.
ప్రమాద స్థలం నుంచి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) సేకరించిన నమూనాలను విశ్లేషించిన తరవాతే అక్కడ ఎంత నిల్వలు ఉండే అవకాశం ఉంది. ఏయే రకాల రసాయన మిశ్రమాలను వినియోగించారనేది తెలుస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆ దిశగానూ దర్యాప్తు చేయిస్తున్నామని కోటవురట్ల పోలీస్‌స్టేషన్‌లో భారత న్యాయసంహిత సెక్షన్ 105, 125(ఎ), 125(బి), రెడ్‌విత్ 3(5), ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టేన్స్ యాక్ట్ సెక్షన్ 3, 5 కింద కేసు నమోదు చేసి విచారణకు ఆరు బృందాలను నియమించినట్లు చెప్పారు. అప్పుడే సిఫార్స్ చేసినా..
ఈ బాణసంచా తయారీ కేంద్రంలో నిబంధనలు పాటించడం లేదని, రక్షణ ఏర్పాట్లు లేవని 2019లో కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఫైర్‌వర్క్స్ లైసెన్స్ రద్దు చేయాలని ఎస్పీకి లేఖ



రాశారు. ఈ కేంద్రం నిర్వాహకుడు గతంలో కోర్టు తమకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును చూపించి లైసెన్స్ పునరుద్ధరించుకున్నారు. పోలీసులు సూచించినట్లు అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకున్నా విస్ఫోటనం జరిగిన సమయంలో అవేవీ ఇప్పుడు ఉపయోగపడనే లేదు. ఈ కేంద్రంలో సీజన్‌ను బట్టి 20 నుంచి 30 మందికి పైగా పని చేస్తుంటారు. వాస్తవానికి 20 మంది పనిచేస్తే కర్మాగారాల చట్టం ప్రకారం రిజిస్టర్ చేసుకోవాలి. కాని తక్కువ మంది పనిచేస్తున్నారని షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో వీరు అనుమతులు తీసుకున్నట్లు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ రామారావు చెప్పారు.

**రైతులు అభ్యంతరం తెలిపినా..**

బాణసంచా కేంద్రంలో తయారైన తారాజువ్వలను ఎప్పటికప్పుడు పరీక్షించేవారు. ఆ సమయంలో కొన్ని నిప్పురవ్వలు సమీపంలోని సరుగుడు తోటల్లో పడేవి. వాటివల్ల పంటంతా దగ్ధమయ్యేదని ఓ రైతు చెప్పారు. లైసెన్స్ పునరుద్ధరణ సమయంలో అభ్యంతరం లేదంటూ సంతకాలు పెట్టమని తమను కోరేవారని.. తాము నిరాకరించినా వాళ్లకు తెలిసిన వాళ్లతో సంతకాలు చేయించుకునేవారని ఆరోపించారు. వీరి బాణసంచా మూలంగా సరుగుడు పంట వేయడం మానేసుకుని నష్టపోయినట్లు సమీప రైతు తెలిపారు.

# పలమనేరు గోశాలలోనూ అవకతవకలు!

తిరుపతి: తిరుపతిలోని ఎస్వీ గో సంరక్షణశాల తరహాలోనే వైకాపా హయాంలో పలమనేరులోని శ్రీవేంకటేశ్వర గోశాలలోనూ అవకతవకలు వెలుగు చూశాయి. మూడున్నరేళ్ల కిందట విజిలెన్స్ విభాగం వీటిని గుర్తించి తితిదేకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిఫార్సులు చేసినా వాటిని బుట్టదాఖలు చేశారు. ఇక్కడ తితిదేకు ఏకంగా 450 ఎకరాల భూమి ఉంది. దేశవాళీ ఆవుల సంరక్షణ ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశం. 1,038 గోవులుండగా సంరక్షణ బాధ్యతలు చూస్తోన్న సంస్థకు ఒక్కో ఆవుకు నెలకు తితిదే రూ.1,435 చెల్లించింది. నెలకు రూ.14.89 లక్షలు చెల్లింపులు చేశారు. ఇందుకు తగ్గట్టుగా సిబ్బందిని మాత్రం నియమించుకోలేదు. రికార్డుల ప్రకారం 33 మంది సిబ్బంది, ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నా.. వేతనాలు మాత్రం 22 మందికి చెల్లించారు. 140 ఆవుల బాధ్యతను ఒక్క సిబ్బంది చూస్తున్నారని 2021 జులై 8న విజిలెన్స్ అధికారుల తనిఖీలో వెల్లడైంది. పరిసరాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు. పశుగ్రాసం కూడా సదరు గుత్తేదారుడే సరఫరా చేస్తున్నాడని.. భూమి, నీరు ఉచితంగా తీసుకుంటున్నారని, నెలకు తితిదే విద్యుత్తు బిల్లుకు రూ.90 వేలు చెల్లిస్తోందని అందులో ప్రస్తావించారు. గుత్తేదారుకు



నెలకు రూ.1.16 కోట్లు లాభం పొందుతున్నాడని వివరించారు. తితిదే ఈ విషయంలో పునరాలోచన చేయాలని సూచించారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో 2021లో 2,071 గోవులుండగా పలమనేరులో 1,038 ఉన్నాయి. ఏడాదికి పలమనేరులో పశుగ్రాసానికి ఏకంగా రూ.1.01 కోట్లు చెల్లిస్తుండగా, తిరుపతిలో రూ.99.67 లక్షలు చెల్లిస్తున్నారు. ఆవుల సంఖ్య తక్కువగా ఉన్నచోట ఇంత వ్యయం చేయడాన్ని విజిలెన్స్ విభాగం అప్పట్లోనే అభ్యంతరం తెలిపింది. పలమనేరులో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే గతేడాది అగ్ని ప్రమాదం జరిగిందని తాజాగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో తితిదే ఈవో శ్యామలరావు వెల్లడించారు.

# కరిగిపోతున్న కొండ.. ఆగని దందా!

మునగపాక : అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. ఇదే అదునుగా అక్రమార్కులుపాటిపల్లి కొండ చుట్టూ టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు మోహరించారు. పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వకాలు ముమ్మరంగా సాగించారు. పాటిపల్లి–తోటాడ రోడ్డులో గ్రావెల్ తరలింపులో వాహనాలు బారులుదీరాయి. ఈ తవ్వకాలతో మునగపాక మండలం పాటిపల్లి కొండ కరిగిపోతోంది. ఎత్తిపోతల పథకం సమీపాన అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డూ అదుపులేని పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో పట్టపగలే విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ పదుల సంఖ్యలో వాహనాల్లో తరలిస్తున్నారు. ఎత్తిపోతల పథకం మొదలుకొని పాటిపల్లి జగనన్న కాలనీ వరకు ప్రధాన రహదారి పక్కనే గ్రావెల్ తవ్వకాలు



సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు సాగుతున్నా అధికారులు నిలువరించే పరిస్థితి లేదు. లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు వీటివైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీఓకు, కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్టు స్థానిక నాయకులు తెలిపారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మునగపాక తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే సిబ్బందిని పంపించి వాహనాలను సీజ్ చేయిస్తానన్నారు. ఇకపై ఆ ప్రాంతంలో పోలీస్ నిఘా ఏర్పాటు చేయిస్తానని చెప్పారు.

# గురుకులం.. భవిష్యత్తు బంగారుమయం

ఎమ్మిగనూరు : గురుకుల పాఠశాలలు.. పేద విద్యార్థులకు ఆశా కిరణాలు. వీటిల్లో సీటు సాధిస్తే భవిష్యత్తు బంగారుమయం కానుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు. కర్నూలు జిల్లాలో పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కర్నూలు జిల్లాలో గురుకుల ప్రవేశ పరీక్షలు రాసేందుకు పాఠశాలకు 4,946, జూనియర్ కళాశాలకు 6,199, డిగ్రీ కళాశాలకు 211 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25న కర్నూలులో నిర్వహించనున్నారు.

**పాఠశాలకు సిలబస్ :** పాఠశాల ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు 1 నుంచి 4వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని అన్ని సబ్జెక్టుల నుంచి 100 బిట్స్ వస్తాయి. కళాశాల సిలబస్ : పదో తరగతి గణితం, సైన్స్ నుంచి 150 బిట్లు ఉంటాయి.

**డిగ్రీ కళాశాలకు సిలబస్ :** ఆయా గ్రూప్‌లకు సంబంధించిన పాఠ్య పుస్తకాల నుంచి 150 బిట్లు వస్తాయి. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. సదుపాయాలు : పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు భోజనంతోపాటు ఉచిత నోట్ పుస్తకాలు, టెక్స్ట్‌బుక్‌లు, పెట్టెలు, ఇతర వసతులు కల్పిస్తారు.

ప్రత్యేక తరగతులు: ఇంటర్ చదివే విద్యార్థులకు జేఈఈ మెయిన్స్, నీట్, అడ్వాన్స్ జేఈఈ పరీక్షలకు శిక్షణ ఇస్తారు.

**ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి - గీర్వాణి, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్, కర్నూలు జిల్లా సమన్వయకర్త**

గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 25న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కర్నూలులో 46 కేంద్రాల్లో 11,356 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాలకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం. ఏమైనా సమస్యలుంటే 87126 25079 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు.

# తీరంలో ఘోరం!

విశాఖపట్నం : సముద్ర తీరానికి సమీపంలో విధ్వంసకర రీతిలో ఏ పనులు చేపట్టకూడదు. ఆ ప్రదేశం అతి సున్నితమైందే కాకుండా జీవ వైవిధ్యానికి నెలవుగా ఉంటుంది. అనేక సముద్ర జీవులకు ఆవాసం కల్పిస్తుంది. భవన నిర్మాణ వ్యర్థాలు వేయకూడదు, సిమెంటు నిర్మాణాలు అసలే చేపట్టకూడదు. అటువంటిది ఆర్‌కే బీచ్‌కు సమీపంలోని తీరాన్ని దారుణంగా ధ్వంసం చేశారు. ఎక్కడికక్కడ నిర్మాణ వ్యర్థాలను గుట్టలుగా పోసి తీరం ఆనవాళ్లు లేకుండా చేశారు. అక్కడ యథేచ్ఛగా ఆక్రమణలు చోటుచేసుకుంటే యంత్రాంగం కళ్లు మూసుకుంది. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టనట్లు ఉండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇష్టానుసారంగా కప్పేయడాన్ని పర్యావరణ వేత్తలు తప్పు పడుతున్నారు.

దర్జాగా ఆక్రమించేసి..: కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సముద్ర తీరాన్ని దర్జాగా ఆక్రమించేస్తున్నారు. ఆర్కే బీచ్ రోడ్డులో ఏకంగా అలలు తాకే వరకు స్థలాన్ని ఆధీనంలోకి తీసుకొని ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆల్‌ఎబిలిటీ పార్క్ నుంచి లైట్‌హౌస్ వరకున్న తీరాన్ని నామరూపాల్లేకుండా చేసేశారు. ఆ మధ్యలో సుమారు అర కిలోమీటరు మేర 20 అడుగులు ముందుకొచ్చి మరీ నిర్మాణాలు చేపట్టేశారు. ముందుగా బండరాళ్లను తీసుకొచ్చి గుట్టలుగా పోశారు. భవన నిర్మాణ వ్యర్థాలను భారీగా డంపు చేశారు. వాటి మీద సిమెంటు పునాదులు నిర్మించారు. అవి కనిపించకుండా వ్యర్థాలతో వాటిని పూడ్చేశారు. గతంలో తీరానికి కొంచెం దూరంలో



నిర్మాణాలుండేవి. ఇప్పుడు ఏకంగా అలలు తాకే వరకు వచ్చేశారు. ఉద్ధృతంగా అలలు వస్తే నేరుగా ఆక్రమించిన స్థలాలను తాకుతున్నాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు. కొందరు తాత్కాలికంగా ఫెన్సింగ్ వేసి పూర్తిస్థాయిలో స్వాధీనంలోకి తీసుకోవాలని చూస్తున్నారు. ఓ హోటల్ వెనుక భారీగా మెట్ల నిర్మాణం చేపట్టేశారు. హోటల్ నుంచి నేరుగా బీచ్‌లోకి దిగేలా దాన్ని నిర్మించడం గమనార్హం.

**హైకోర్టు హెచ్చరించినా...**

విశాఖ తీరంలోని ఆక్రమణల మీద ఇటీవల హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎక్కడెక్కడ సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించారో వాటి మీద నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో అధికారులు ఆగమేఘాల మీద సర్వే చేపట్టి నివేదిక పంపారు. నగరం నడిబొడ్డున జరిగిన ఉల్లంఘనల గురించి మాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి సీఆర్‌జెడ్ నిబంధనలు అమలయ్యేలా చూడాలి. ఇందుకోసం ఏపీ తీర ప్రాంత అభివృద్ధి నిర్వహణ సంస్థ (ఏపీసీజెడ్ఎంఏ) ఆధ్వర్యంలో గట్టి పర్యవేక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిర్మాణ వ్యర్థాలతో తీరాన్ని కప్పేయడం వల్ల సముద్ర జీవరాశులకు ముప్పుగా పరిణమిస్తుంది. గతంలో ఆ ప్రదేశం పచ్చిక, తీగ జాతి మొక్కలతో గుబురుగా సముద్ర జీవులకు ఆవాశంగా ఉండేది. ఇప్పుడు దరిదాపుల్లో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

# ‘ఉత్తి’పోతల పథకాలు!

ఏలూరు: వైకాపా అయిదేళ్ల పాలనలో జిల్లాలోని ఎత్తిపోతల పథకాలను గాలికొదిలేసింది. కొత్తవి పూర్తిచేయలేదు. ఉన్నవాటి నిర్వహణకు పైసా విదల్చలేదు. దీంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలకు పునరుజ్జీవం తీసుకురావాల్సి ఉంది.

**గిర్రమ్మ సంగతేమిటి?**

కామవరపుకోట మండలం రావికంపాడు సమీపంలో గిర్రమ్మ పథకం



పంపు హౌస్ ఏర్పాటు చేసి పంపులు అమర్చినా 30కి పైగా కల్వర్టులు, స్లూయిజ్‌లు, అండర్ టన్నెళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. 17 ఉపకాలువలు తవ్వాల్సి ఉంది. దీని కోసం వంద ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది.

**దీనస్థితిలో గాడిదబోరు**

బుట్టాయగూడెం మండలంలో ఏర్పాటు చేసిన గాడిదబోరు పథకం మోటార్లు మూలన పడ్డాయి. పైపులు పగిలిపోయాయి. 2016లో తెదేపా ప్రభుత్వం చేసిన మరమ్మతులు తప్ప వైకాపా సర్కారు రూపాయి ఇవ్వలేదు.

**గురుగుమిల్లి వైపు చూడాలి..**

బుట్టాయగూడెం మండలం గురుగుమిల్లిలో 300 ఎకరాలకు నీరిచ్చేందుకు ఏర్పాటు చేసిన పథకంలోని నాలుగు మోటార్లు కొద్ది రోజులకే మూలనపడ్డాయి. రైతులే సొంత సొమ్ముతో రెండు పాత మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. మరో రూ.20 లక్షలు ఖర్చు చేస్తే పథకం అందుబాటులోకి వస్తుంది. పట్టిసీమను పట్టించుకోలేదు

పోలవరం మండలంలో వెయ్యి ఎకరాలకు నీరందించే ఈ పథకాన్ని అసంపూర్తిగా వదిలేశారు. తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయినా వైకాపా పాలనలో 2 కి.మీ. మేర పైపులైను వేయలేక వదిలేశారు. దీంతో ప్రాజెక్టు మూలన పడింది.

**గాలికొదిలేశారు**

నిర్వహణ మరీ అధ్వానంగా ఉన్న పథకాలకు రూ.10 కోట్లు ఇవ్వాలని వైకాపా హయాంలో ప్రతిపాదనలు చేసినా పైసా విదల్చలేదు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న 24 పథకాల్లోనూ పంపులు, పైపులు, మోటార్లు తదితర సమస్యలు ఉన్నాయి.

రూ.78 కోట్లతో ప్రతిపాదనలు

‘కూటమి అధికారం చేపట్టిన తర్వాత రూ.78 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం’ అని ఏపీఎస్ఐడీసీ డీఈ దుర్గాగురవయ్య తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం పథకాలు 29

ఎకరాలు నీరందే ఆయకట్టు 55,162

నిర్వహణ సమస్యలున్నవి 24

# రోడ్డున పడినా.. కరుణించరే



హిందూపురం : హిందూపురం పట్టణంలో రోడ్డు విస్తరణ కోసం స్థలాలు కోల్పోయిన బాధితులకు నేటికీ పరిహారం అందలేదు. ఐదేళ్ల కిందట పట్టణంలోని రైల్వే రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. 70 అడుగుల వెడల్పుతో కిలోమీటరు పాటు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి నంది సర్కిల్ వరకు విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. విస్తరణకు అవసరమైన స్థలం కోసం అడ్డుగా ఉన్న భవనాల్లో 90 శాతం వరకు తొలగించారు. అయితే బాధితులకు నష్ట పరిహారం చెల్లించలేదు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు 20 అడుగుల విస్తీర్ణంతో 200 మంది తమ స్థలాలను, భవనాలను కోల్పోయారు.

**టీడీఆర్ బాండ్లు అంటూ కాలయాపన**

రైల్వేరోడ్డులో సెంటు స్థలం రూ.కోటి పలుకుతోంది. రహదారి విస్తరణకు నష్ట పరిహారం చెల్లించాలంటే వందల కోట్లు రూపాయలు చెల్లించాల్సి ఉంది. అయితే సొమ్ముకు బదులుగా పరిహారంగా టీడీఆర్ బాండ్లను మున్సిపాలిటీ అందిస్తుంది. స్థలానికి ఉన్న ప్రభుత్వ విలువకు నాలుగు రెట్లు విలువైన బాండ్లను మున్సిపాలిటీ స్థల యజమానులకు ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయి. పట్టణాల్లో అదనపు అంతస్తులు, ఎత్తైన భవనాలు నిర్మించుకొనే వారు టౌన్ ప్లానింగ్ విభాగానికి చెల్లించాల్సిన రుసుముకు బదులుగా ఈ బాండ్లను వినియోగించుకోవచ్చు. వీటిని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల బిల్డర్లు కొనుగోలు చేస్తుంటారు. వాటి ముఖ విలువలో 30-40 శాతం మాత్రమే చెల్లించి కొనుగోలు చేస్తారు. దీంతో రూ.లక్ష విలువైన బాండుకు స్థల యజమానికి దక్కేది రూ.30-40 మాత్రమే.

**నాలుగేళ్లు దాటినా ..**

రోడ్డు విస్తరణతో వ్యాపారులు స్థలాలు, దుకాణాలు కోల్పోయి నాలుగేళ్లు దాటిపోయింది. అయినా వారికి ఎలాంటి న్యాయం జరగలేదు. స్థలాలను మున్సిపాలిటీ పేరుతో అధికారులే రిజిస్టర్ చేయించుకొని, యజమానులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలి. వారు వాటిని విక్రయించుకొని సొమ్ము చేసుకోనేవారు. ఈ విషయంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. విస్తరణ చేపట్టినప్పటి నుంచి ఐదుగురు కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగంలో 10 మంది అధికారులు మారిపోయారు. వచ్చిన ప్రతి ఒక్కరూ న్యాయం చేస్తామని చెప్పడమే కానీ ఒరిగిందేమి లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను సమావేశ పరుస్తాం. వ్యాపారులకు తక్షణం న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

# చివరికి.. పెద్దల చేతుల్లోకి!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వంలో విలువైన భూములపై కీలక నేతల కన్ను పడింది. ఇందుకు భూకేటాయింపుల నాటకానికి తెరతీశారు. నేరుగా పెద్దల చేతుల్లోకి వెళ్తే అనుమానం కలుగుతుందని మధ్యలో ఓ సంస్థను తీసుకొచ్చి వారితోనే దరఖాస్తు చేయించి... తరువాత కొట్టేసే వ్యూహం పన్నారు. అలాగే మరికొన్ని సంస్థలకు నగరం నడిబొడ్డున స్థలాలు కేటాయించి అందులో వాటాలకు ప్రయత్నించారు. వైకాపా నేతల సిఫార్సులతో కొన్ని కట్టబెట్టాలని చూశారు. ఇలా రూ.వందల కోట్ల ఆస్తులను దక్కించుకునేలా అడుగులు వేశారు. నిబంధనలు పాటించకపోవడంతో విశాఖలో ‘హయగ్రీవ’ ప్రాజెక్టు భూముల కేటాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో గత అయిదేళ్లలో సాగిన భూ కేటాయింపుల తీరుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరముంది.

**సేవ పేరుతో...**

ఎందుకంటే: హియరింగ్ కేర్ సెంటర్

విస్తీర్ణం : 88 సెంట్లు ప్రాంతం : ఎండాడలో

ప్రభుత్వ కేటాయింపు : ఉచితం

బహిరంగ మార్కెట్ విలువ : రూ.50 కోట్లు

ప్రస్తుత పరిస్థితి: ఆ భూముల ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.21.29 కోట్లని అప్పటి జిల్లా అధికారులు ప్రతిపాదించారు. ఆ తర్వాత ఓ నేత చక్రం తిప్పి ఉచితంగా కట్టబెట్టినట్లు సమాచారం. మొదట 2021లో ఆ సంస్థకు స్థలం కేటాయించారు. ఆ తర్వాత రద్దు చేసి మళ్లీ 2023లో కేటాయించారు. ఉచితంగా కట్టబెట్టిన నేపథ్యంలో సీఎంవో నివేదిక తెప్పించుకుంది. సీఎం చంద్రబాబు విశాఖలో భూఅక్రమాల గురించి వెల్లడించిన సమయంలోనూ దీని గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ స్థలాన్ని ఏవిధంగా వినియోగించడం లేదు.

**కేటాయించినా తీసుకోకుండా...**

ఎందుకంటే: విద్యాలయం నిర్మాణం

విస్తీర్ణం : 16 ఎకరాలు, ప్రాంతం : గాజువాక మండలం అగనంపూడి,

ప్రభుత్వ కేటాయింపు : ఉచితం

బహిరంగ మార్కెట్ విలువ : రూ.300 కోట్లు

ప్రస్తుత పరిస్థితి : 2023లో స్థలం కేటాయించగా వివాదాస్పదం అవ్వడంతో ఆ సంస్థ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా వదిలేసింది. కొందరి నేతల ఒత్తిడితో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదని సమాచారం.

అప్పటి ఎమ్మెల్యే కోసం

ఎందుకంటే: విద్యా సేవల కోసం, విస్తీర్ణం: ఏడెకరాలు

ప్రాంతం : బక్కన్నపాలెం బాబా కళాశాల సమీపంలో అరెకరం. మిగిలింది ఆనందపురం మండలంలో

బహిరంగ మార్కెట్ విలువ : రూ.200 కోట్లుప్రస్తుత పరిస్థితి : 2019లో తెదేపాలో గెలిచి ఆ తర్వాత వైకాపాలోకి మారిన ఎమ్మెల్యే... కారు చౌకగా నగర పరిధిలో భూములు చేజిక్కించు కునే ప్రయత్నం చేశారు. ఉన్నత స్థాయిలో దక్కిన ఆమోదంతో కేటాయింపులు చకచకా సాగాయి. ఈ కేటాయింపులపైనా ప్రభుత్వం దృష్టిసారించాలి.

# ఆధార్‌కు బాలారిష్టాలు!

మార్టేరు: బాల ఆధార్ నమోదుకు బాలారిష్టాలు తప్పడం లేదు. ప్రతి నెలా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ప్రక్రియ సాగడం లేదు. ఓవైపు సాంకేతిక సమస్యలు, మరోవైపు గ్రామీణుల్లో కొరవడిన అవగాహనతో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి. ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించే బాధ్యతను ప్రభుత్వం సచివాలయాలు, మహిళా శిశు సంక్షేమ శాఖలకు అప్పగించింది. జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా.. 54,489 మంది పిల్లలు నమోదు చేయించుకున్నారు. ఇంకా 6 వేల మంది చిన్నారులు దూరంగా ఉన్నారు.

ముందస్తు ప్రచారం లేక.. గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నా.. ముందస్తు ప్రచారం చేయడం లేదు. ఈ ప్రక్రియను మండల స్థాయిలో ఎంపీడీవోలు పర్యవేక్షిస్తుండగా- వారే దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. కొన్నిచోట్ల సిబ్బంది ఉండడం లేదు. మరికొన్ని చోట్ల అంతర్జాలంలో అవాంతరాలు ఎదురవడం, పరికరాలు సరిగా పనిచేయకపోవడం తదితర సమస్యలు వెన్నాడుతున్నాయి. గంటల తరబడి పిల్లలను కేంద్రాల వద్ద పెట్టుకోలేక.. తల్లిదండ్రులు వెనుతిరుగుతున్నారు. ‘ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయించేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రుల పరంగా



ఏవైనా లోపాలుంటే, వాటిని సరిదిద్దేలా చైతన్యపరుస్తున్నాం’ అని ఐసీడీఎస్ పీడీ సుజాతరాణి తెలిపారు. వెనుకబాటుకు కారణాలివే.. చిన్నారులకు జనన ధ్రువపత్రాలు లేకపోవడం, వివిధ కారణాలతో పేర్లు పెట్టకపోవడం, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల్లో వివరాలు సరిపోలకపోవడం, పుట్టిన బిడ్డకూ ఆధార్ నమోదు చేస్తారన్న విషయం తెలియకపోవడం.

జిల్లా వివరాలిలా..

అంగన్‌వాడీ కేంద్రాలు 1,626

ఆరేళ్లలోపు పిల్లలు 60,435

ఆధార్ నమోదుకాని వారు 5,946

# ఊరుతున్న అవినీతి ఊట

ఎమ్మిగనూరు : కురిసిన ప్రతి చినుకును నేలలో ఇంకించి భూగర్భ జలాలు పెంపొందించాలన్న లక్ష్యంతో చేపట్టిన ‘వాటర్ షెడ్’ పథకంలో అక్రమాల ఊట పరవళ్లు తొక్కుతోంది. రూ.కోట్లు కరిగినా పథకం ప్రయోజనం దక్కలేదు. ఎమ్మిగనూరు మండలంలో కడివెళ్ల, కందనాతి, వెంకటగిరి గ్రామాల్లో 170 ఫారం పాండ్లు, ఆరు చెక్ డ్యాంలు, నాలుగు నీటికుంటలు గతేడాది నిర్మించారు. ఒక్కోవాటర్ షెడ్డు పథకానికి రూ.5 లక్షల వరకు వినియోగించారు. నాసిరకం పనులు చేపట్టడంతో ఏడాదికే కంకర రాళ్లుతేలి అధ్వానంగా మారాయి.

**సిమెంటు పూతలు**

ఈ ఏడాది కొత్తగా మరో ఎనిమిది వాటర్ షెడ్డు(చెక్ డ్యాం)లు



మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.5 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే రెండు చోట్ల నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో సిమెంట్, ఇసుక, కంకర మిశ్రమాన్ని సమపాళ్లల్లో వినియోగించడం లేదు. అప్పుడే కంకర రాళ్లు తేలాయి. అవి కనిపించకుండా సిమెంట్ పూత పూసి మమ అనిపిస్తున్నారు. క్యూరింగ్ చేయడం లేదు.

**పాత పనులకు మెరుపులు**

ఒక్కోఫారం పాండుకు పరిమాణాన్నిబట్టి రూ.50 వేల నుంచి రూ.80 వేలకుపైగా వెచ్చించారు. వంకల పొడవునా ఎక్కువగా తవ్వారు. చాలాచోట్ల పైపైన పనులు చేపట్టారు. గతంలోనూ వివిధ పథకాల కింద తవ్విన పాత ఫారం పాండ్లను కొత్తగా తవ్వినట్లు చూపి అధికారులు బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామానికి దాదాపు 2 కి.మీ. దూరంలో వంకలు, వాగుల పొడవునా, బీడు భూముల్లో పనులు చేపట్టారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి క్షేత్ర స్థాయిలో సిబ్బంది నాసిరకంగా పనులు చేసి నిధులు కాజేశారు.

# ఎన్నాళ్లిలా..‘ఓటి’గట్టు

భీమవరరే: గోదావరి ఏటిగట్ల పరిరక్షణను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో విజ్జేశ్వరం బ్యారేజీ నుంచి నరసాపురం వరకు ఉన్న ఏటిగట్లు అక్కడక్కడా జారిపోతున్నాయి. వేసవిలో ముందస్తు పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎక్కడైనా లీకేజీ వస్తే ఇసుక బస్తాలు, సర్వే కర్రలతో నెట్టుకురావడం తప్ప స్థానికులకు వేరే గత్యంతరం లేకుండా పోయింది. 2022లో వచ్చిన భారీ వరదకు నరసాపురం వద్ద ఏటిగట్టు 40 మీటర్లు కొట్టుకుపోయింది. అప్పట్లో దానికి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఇలాంటి ఘటనలు ఏ క్షణంలోనైనా ఎక్కడైనా జరగొచ్చు.

భయపెడుతున్న తవ్వకాలు.. నిబంధనల ప్రకారం ఏటిగట్టుకు సుమారు కి.మీ. దూరంలో ఎటువంటి తవ్వకాలు చేయకూడదు. వైకాపా హయాంలో లంక భూముల్లో ఇష్టారీతిన తవ్వకాలు జరిగాయి. ఏటిగ




ట్టును చేర్చి ఉన్న లంకల్లోనే మట్టిని మీటరు నుంచి మూడు మీటర్ల లోతు తవ్వేశారు. ఫలితంగా గట్లు అనేక చోట్ల జారి పోతున్నాయి.

అంచనాలున్నా మంజూరు లేదు

వైకాపా హయాంలో పటిష్ఠం చేయాల్సిన ఎనిమిది ప్రాంతాలను అధికారులు గుర్తించారు. నిపుణులు పరిశీలించి రూ.161 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పొన్నపల్లి గట్టు నిర్మాణం, కాజ, ఈస్ట్ కుక్కిలేరు, ముసికేపాలెం రెగ్యులేటర్లకు మాత్రమే అనుమతులిచ్చింది. దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం నుంచి రాజుల్లంక వరకు, దొంగరావిపాలెం, కోడేరులంకలోని మిడ్‌స్ట్రీమ్‌లంకల్లో ఏటిగట్టు పటిష్ఠానికి రూ.36 కోట్లు, గోదావరి ఎడమగట్టు 20 కిలోమీటర్లు పటిష్ఠతకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపినా వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఏటిగట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ కేవీ సత్యనారాయణ తెలిపారు.

# ‘మొక్క’జొన్నను తిన్న ఎండుతెగులు

కోవెలకుంట్ల: వర్షాకాలంలో లాభాలు తెచ్చిపెట్టడంతో రైతులు రెండో పంటా మొక్కజొన్న సాగు చేశారు. ఎండుతెగులు



ఆశించడంతో దిగుబడి రాక దిగాలు చెందుతున్నారు. వానాకాలంలో ఎకరాకు రూ.30 నుంచి రూ.35వేలు పెట్టుబడి పెడితే దిగుబడి ఎకరాకు 25 నుంచి 29 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటా ధర 2,250 నుంచి 2,280 వరకు ఉండటంతో ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు పొందారు. రబీలోనూ అదే పంట సాగు చేశారు. జిల్లాలోని 28 మండలాల్లో 10,591 హెక్టార్లు సాగు చేశారు. మొక్కదశలోనే ఎండుతెగులు సోకింది. ఒకచోట బిళ్లగా మొదలైన తెగులు క్రమంగా పంటంతా సోకి మొక్క ఎండిపోయేలా చేసింది. కంకిలో ఉండే గింజలు సాధారణం కంటే తక్కువై తాలు మాత్రమే మిగిలింది. ఎకరాకు దిగుబడి 12నుంచి 15 క్వింటాళ్లు మాత్రమే వస్తుండటంతో పెట్టిన పెట్టుబడులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు దక్కలేదు - మిద్దె రామయ్య, అమడాల1.5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. మొత్తం రూ.35 వేలు పెట్టుబడి పెట్టా. మొక్క పెరుగుతున్న సమయంలో ఎండు తెగులు సోకి పంటంతా ఆశించింది. వానకారులో 44 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

# ప్రతి గొంతు తడిపేలా..

నర్సీపట్నం: పట్టణం విస్తరిస్తోంది.. తెల్లారిలేస్తూనే నీటి కోసం కుళాయిల వైపు చూసే జనాభా పెరుగుతోంది. కానీ ప్రతి గొంతునూ తడిపేంత నీరు కుళాయిల నుంచి రావడం లేదు. వేసవి వచ్చిందంటే దాహం కేకలు మరింత పెరుగుతూనే ఉన్నాయి. నర్సీపట్నం పురపాలికను ఏళ్ల తరబడి తాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నర్సీపట్నం నీటి సరఫరా, సెప్టేజ్ నిర్వహణ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. జిల్లాలో శరవేగంతో విస్తరిస్తున్న నర్సీపట్నంలో 2048 నాటి జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారీ తాగునీటి ప్రాజెక్టుకు 2012లోనే ప్రతిపాదన రూపొందించారు. నిధులు విడుదల కాకపోవడంతో అప్పట్లో పనులు మొదలు కాలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2018లో అప్పట్లో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు రూ. 142.76 కోట్లు మంజూరు చేయించి ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. 2019లో అధికారానికి వచ్చిన వైకాపా ప్రభుత్వం తొలుత పనులపై దృష్టి పెట్టలేదు. దాంతో గుత్తేదారు దాదాపు రూ. 15 కోట్ల విలువైన పనులు మాత్రమే చేపట్టారు. కేవలం నాలుగు కిలోమీటర్లు పెద్దపైపులు, ఎనభై కిలోమీటర్లు చిన్నపైపులు వేశారు. బలిఘట్టంలో



కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి ఇనుప చువ్వలు అమర్చి పనులు ఆపేశారు. ఈ భారీ తాగునీటి ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. ఆయన ఆదేశం మేరకు ప్రజారోగ్యశాఖ అధికారులు ఇప్పుడు రూ. 185.29 కోట్ల ఖర్చుతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేశారు. రెండు రోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనుంది. అనుమతి రాగానే టెండరు ప్రక్రియ మొదలవుతుంది. ఈ ప్రాజెక్టు పనులు కొద్దిరోజుల్లోనే మొదలవుతాయని అయ్యన్న రెండు రోజుల క్రితం ప్రకటించారు. రోడ్లు వేయకముందే పైపులైన్ల పనులు పూర్తి చేయించాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు.

**మనిషికి 135 లీటర్ల శుద్ధజలం**

ఈ పాజెక్టు కార్యరూపం దాల్చితే పట్టణంలో ప్రతి ఒక్కరికి మనిషికి 135 లీటర్ల చొప్పున శుద్ధజలం అందుతుంది. ప్రస్తుతం ఒక్కొక్కరికి 57 లీటర్ల నీరు మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పొందుపర్చిన అంశాల ప్రకారం కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద ఏలేరు కాలువ నుంచి 0.3 టీఎంసీల నీటిని తీసుకుంటారు. దాన్ని జోగునాథునిపాలెం కొండపై నిర్మించిన ట్యాంకులకు చేర్చి అక్కడ నుంచి నర్సీపట్నం పెద్దచెరువులో ఏర్పాటు చేసే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు పైపులైన్ ద్వారా పంపిస్తారు. ఇక్కడ నీటిని శుద్ధిచేసి పట్టణంలో ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లతో పాటు కొత్తగా నిర్మించబోయే మరో ఐదు రిజర్వాయర్లకు పంపిస్తారు. ఇంటింటికీ కుళాయిలు అమర్చి శుద్ధజలాన్ని అందజేస్తారు. పట్టణంలో ప్రస్తుతం 70 వేలకు పైగా జనాభా ఉంది. భారీ తాగునీటి పథకం డీపీఆర్ సిద్ధమైందని ప్రజారోగ్యశాఖ అనకాపల్లి డీఈఈ జానకి వెల్లడించారు. ఈ నివేదిక రాష్ట్ర ఇంజినీరింగ్ అధికారులకు రెండు రోజుల్లో పంపుతున్నామని తెలిపారు.

# కోలుకోని కోడి

నక్కపల్లి : చికెన్ ధరల్లో స్థిరత్వం లేకపోవడంతో ఇటు వ్యాపారులకు, అటు కోళ్ల పెంపకం రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతనెలలో బర్డ్‌ఫ్లూ ప్రభావం నుంచి మొదలైన పతనం తర్వాత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలతో కాస్త కోలుకున్నట్లు కనిపించినా, మళ్లీ యథాస్థితికి చేరింది. పౌల్ట్రీల్లో సరకు అధికంగా ఉండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా సుమారు 400 మంది వరకు రైతులు కోళ్ల ఫారాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పెంచే కోళ్లను స్థానికంగా వినియోగించడంతోపాటు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. కాగా గతనెలలో ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ రావడంతో అక్కడితో పాటు, ఉత్తరాంధ్రలోనూ విక్రయాలపై ప్రతికూల ప్రభావం పడింది. ఫలితంగా కొనుగోళ్లు తగ్గిపోగా, కేజీ రూ. 250 వరకు ఉన్న మాంసం ధర రూ. 150కి పడిపోయింది. ఇక విక్రయాల్లేక దుకాణాలు వెలవెలబోయాయి. ఫలితంగా రైతులకు ఆర్థిక నష్టాలు ఏర్పడగా, వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన అనేక మంది ఉపాధిపైనా ప్రభావం చూపింది. పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఆ మేరకు అధికారులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయించింది. ఇదే సమయంలో కోళ్ల పెంపకాలను చేపట్టే సంస్థలూ ముందుకు వచ్చి ఉచితంగా చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించిన ప్రజలకు మాంసం వంటకాలను పంపిణీ చేశారు. దీంతో పరిస్థితి కాస్త కుదుటపడినట్లే కనిపించి. ఫలితంగా క్రమేపీ ధర పెరుగుతూ.. పది రోజుల కిందట కిలో మాంసం రూ. 210కి చేరింది. ఆ మేరకు వ్యాపారులతోపాటు రైతులు ఊపిరిపీల్చుకోగా, ఈలోగానే ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వ చర్యల కారణంగా చికెన్ వినియోగం పెరిగినప్పటకీ ఇదే సమయంలో పౌల్ట్రీల్లో ఉత్పత్తి అధికంగా ఉండటంతో సరిపడా డిమాండ్ లేక ఈ పరిస్థితి నెలకున్నట్లు వ్యాపారులు వివరిస్తున్నారు. పౌల్ట్రీల్లో సగటున రెండు కిలోల వరకు పెరిగేలా చూస్తారు, ప్రస్తుతం దాదాపు పౌల్ట్రీల్లోనే కోళ్లు మూడు కిలోల వరకు పెరిగిపోయాయి. దీనికి తోడు ఎండల ప్రభావం పెరగడంతో ఇవి త్వరగా మరణించే ప్రమాద భయం వెన్నాడుతోంది. దీంతో వినియోగానికి మించి కోళ్లు ఉండిపోవడంతో వీటిని విక్రయించడానికి వీలుగా ధరలు తగ్గించాల్సి వచ్చింది. దీంతో గడిచిన వారం రోజులుగా కేజీ రూ. 160కి పడిపోయింది. ఆ మేరకు ప్రస్తుతం ఉన్న సరకును అమ్మకం చేసిన తర్వాత కాస్త విరామంతో మళ్లీ పెంపకం చేస్తే ధర పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు యోచించి, ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ధర మరో వారం, పదిరోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని నక్కపల్లికి చెందిన వ్యాపారి నానాజీ వెల్లడించారు.

# నైపుణ్యాభివృద్ధి.. ఉద్యోగప్రాప్తి



అనంతపురం : డిగ్రీలు చేత పట్టుకుంటే ఉద్యోగాలు వచ్చే రోజులు పోయాయి. అదనపు నైపుణ్యాలు ఉంటేనే కొలువులు వస్తాయి. ఆయా సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు అనువైన నైపుణ్యాలు లేనందువల్ల యువత నిరాశ, నిస్పృహలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వారు ఉద్యోగాల దరఖాస్తు, ఇతరత్రా ఖర్చులకు సైతం సొమ్ము అందజేయనుంది. ముందుగా ఉమ్మడి జిల్లాలోని అనంతపురం నగరంతోపాటు పురపాలికల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. దీనికి నిరుద్యోగ యువత నుంచి మంచి స్పందన లభిస్తోంది.

**ఇంకెందుకు ఆలస్యం!**

ఏదేని డిగ్రీ పూర్తి అయిన యువత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతరుల కంటే డ్వాక్రా సంఘాల్లోని మహిళల పిల్లలకు కొంత ప్రాధాన్యం ఉంటుంది. మెప్మా, ఆశా సొసైటీ సహకారంతో శిక్షణ ఇస్తారు. 2021 తర్వాత రెగ్యులర్ విధానంలో డిగ్రీ పూర్తి అయిన వారు అర్హులు. జాతీయ అప్రెంటీస్‌షిప్ పథకం (ఎన్ఏటీఎస్) ద్వారా వృత్తి, జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఆధార్ లింకు అయిన బ్యాంకు ఖాతా, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ వివరాలతో సమీపంలోని నగర, పురపాలికల్లోని మెప్మా విభాగంలో నమోదు చేసుకోవచ్చు.

**ప్రతినెలా రూ.4,500 భృతి**

ఎంపికైన వారికి సంవత్సరం మొత్తంలో 150 గంటలు, వారానికి కేవలం 3 గంటలు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. పరిస్థితులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలు పెంచుకోవచ్చు. ఏడాదిపాటు ప్రతి నెలా రూ. 4,500 భృతి నేరుగా ఖాతాలో జమ అవుతుంది. ఇందులో ప్రతి నెలా నిర్వహణ ఖర్చుల కింద ఆశా సొసైటీకి రూ. 1,000 భృతి పొందిన తరువాత ఇవ్వాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయ్యేలోగా కేంద్ర మంత్రిత్వశాఖ, ఎన్ఎస్‌డీసీ, పరిశ్రమ నుంచి మూడు శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈనెల 20వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని, అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ విశ్వజ్యోతి తెలిపారు.

అనంత లక్ష్యం: 2,000

ఇప్పటిదాకా పేర్లు నమోదు: 2,077

ఆనందంగా ఉంది

ఆన్‌లైన్ శిక్షణతో ఉచితంగా నైపుణ్యాలు పెంచుకోవచ్చు. భృతి కూడా ఇస్తుండటంతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. యువతలో ధైర్యం, భరోసా కల్పించడం ఆనందం ఉంది.

బిందుబాయి, బీకామ్ కంప్యూటర్స్

# పెన్నాలో ఇసుకాసురులు



తాడిపత్రి : ఇసుక అక్రమ రావాణ ఆగడం లేదు. అక్రమార్కులు తమకు అడ్డే లేదన్నట్లుగా రాత్రింబవళ్లు పెన్నానదిని తోడేస్తున్నారు. ఇసుకను తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. అధికారులు అడపా దడపా కేసులు నమోదు చేస్తున్నా.. ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడిపత్రి నియోజకవర్గంలో పెన్నానది సుమారు 64 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. నది పరిహాక ప్రాంతంలోని పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలించి పగలు ఒక చోట డంప్ చేస్తున్నారు. రాత్రివేళ టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లలో నంద్యాల, బనగానపల్లి, బళ్లారి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెన్నానది నుంచి రోజూ సుమారు 500 ట్రాక్టర్ల ఇసుక తరలిపోతున్నట్లు అంచనా.

**ఎక్కడెక్కడంటే..**


తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె నుంచి ఆలూరుకు వెళ్లే దారిలో పలుచోట్ల ముళ్లపొదలు, నాపరాళ్ల పరిశ్రమ, ఇటుక ఫ్యాక్టరీల వద్ద భారీగా ఇసుక నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి టిప్పర్లతో నంద్యాలకు తరలిస్తున్నారు. నందలపాడు వద్ద ఉన్న నదిలో నుంచి భారీగా ఇసుకను తోడి ఆదర్శ పాఠశాల, భగత్‌సింగ్‌నగర్‌లోని ముళ్లపొదల్లో డంప్ చేసి పట్టణంలోనే విక్రయిస్తున్నారు. బీ చిన్నపొలమడ, పెద్దపొలమడ, హుస్సేనాపురం, ఇడుగూరు, చుక్కలూరు, అక్కన్నపల్లి గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

**ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం**

**శివగంగాధర్‌రెడ్డి, గ్రామీణ సీఐ తాడిపత్రి**

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. రోజూ పెన్నానది పరివాహక ప్రాంతాల్లో తనిఖీలు చేసి పట్టుబడిన ట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తున్నాం. ఆయా గ్రామాల్లో నిఘా పెంచి ఇసుక అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తాం.

# రెప్పపాటులో కాజేస్తారు!



అనంతపురం : కాదేదీ దోపిడీకి అనర్హం అన్న రీతిలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. చుట్టూ అలాంటి మాయగాళ్లున్నపుడు వినియోగదారుడు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే.. ఇటీవల పెట్రోలు బంకుల్లో మైక్రో చిప్స్ అమర్చి వినియోగదారుల నుంచి దోచుకున్న తీరు చూస్తే ఎవరైనా నివ్వరబోవాల్సిందే.. లీటరుకు పది మిల్లీలీటర్ల చొప్పున తక్కువ కొలతతో పెట్రోలు, డీజిల్ విక్రయించి దోచుకుంటున్న తీరు వెలుగులోకి వచ్చింది. వినియోగదారుల హక్కుల వారోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కథనం.. ఉప్పు, పప్పు, బియ్యం, తినుబండారాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు ఏవైనా కొనుగోలు సమయంలో తక్కువ తూకంతో మోసపోరాదని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తూనికలు, కొలతల చట్టం మేరకు మార్గదర్శకాలు రూపొందించి అమలు చేస్తున్నా యథేచ్ఛగా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మోసాలపై ఎంతో అవగాహన ఉన్న వారే పోరాడుతున్నారు. చాలామంది మనతో ఏమవుతుందిలే అని నిమ్మకుండిపోతున్నారు.

తూకాల్లో మోసాలపై అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ 9849095707, తనిఖీ అధికారి మహమ్మద్ గౌస్ 9398112675 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.కేసుల తీరు ఇలా..: బీమారంగంలో– 44 కేసులు, చిట్‌ఫండ్స్ 41, బ్యాంకులు 19, విద్యుత్ 11, ఫైనాన్సులు 07, వ్యవసాయ, గృహాలు 4 చొప్పున, మెడికల్ 3, రవాణా 2 , ఇతరులకు సంబంధించి 46 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తూకాల్లోనే అత్యధికంగా మోసాలు జరుగుతున్నా..కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

**వైద్యంలో నిర్లక్ష్యానికి రూ.10 లక్షల పరిహారం**

మూడో రోడ్డు (అనంతపురం): వైద్యసేవల్లో లోపానికి పరిహారం రాబట్టవచ్చు.. బెంగళూరులోని సీఎంఐ ఆసుపత్రికి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు ఇందుకు ఉదాహరణ. నగరానికి చెందిన అనిల్‌కుమార్ (38) వాంతులు రావడంతో బెంగళూరులోని సీఎంఐ ఆసుపత్రిలో చేర్పించారు. మూత్రపిండాల సమస్య ఉందని తేల్చి శస్త్రచికిత్స చేసి స్టంట్ వేశారు. అనంతరం 4 వారాల తర్వాత స్టంట్ తొలగిస్తామన్నారు. 2018 డిసెంబరు 28న స్టంట్ తొలగించామని చెప్పారు. రెండేళ్ల తర్వాత 2020 జులై 1న రోగికి కాలు నొప్పి రావడంతో తిరిగి అదే ఆసుపత్రికి వెళ్లారు. అప్పుడు ఈ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడ వైద్యులు పరీక్షించి.. స్టంట్ పొరపాటున మూత్రపిండంలోనే ఉందని చెప్పారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి స్టంట్‌ను తొలగించినా.. రోగి వాంతులలో బాధ పడుతూ 2020 డిసెంబరు 21న మృతి చెందాడు. ఇదంతా వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితులు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించారు. కమిషన్ ఇరువర్గాల వాదనలను పరిశీలించి వైద్యసేవల్లో లోపానికి రూ. 10 లక్షలు చెల్లించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆదేశించింది.

6,408 కేసులు నమోదు

1986 నుంచి ఇప్పటివరకు వినియోగదారుల కమిషన్‌లో కేసులు : 6,408 పరిష్కారం అయినవి: 6,227 పెండింగ్: 181

# మిరప రైతు డీలా!

అచ్యుతాపురం :గిట్టుబాటుకాని ధరలు మిరప రైతులకు మంట పుట్టిస్తున్నాయి. కష్టపడి పండించినా ఆశించిన ధరలేక లబోదిబోమంటున్నారు. పెట్టుబడులు దక్కక దిగులు చెందుతున్నారు. పంట ప్రారంభంలోనే ఆశించిన గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. గత వారం కుంచం మిరప పళ్లు సన్నాలు రూ. 110, పొట్టికాయులు రూ. 140 వరకు ధర పలకగా శుక్రవారం జరిగిన వారపు సంతలో సన్నరకం రూ. 70–80, పొట్టిరకం రూ. 90–100కి పడిపోయింది. నాణ్యతను దృష్టిలో ఉంచుకొని ఏటా మొదటిసారిగా మార్కెట్‌కు వచ్చిన పండుమిరపను వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు. ఈ ధరలు రైతులకు అనుకూలంగా ఉండేవి. గత ఏడాది మార్కెట్ అనుకూలించక నష్టపోయిన రైతులు ఈఏడాదైనా అనుకూలంగా ఉంటుందనే ఆశతో అప్పులు చేసి పండించినా ఫలితం లేకపోయింది. సన్నరకం మిరపపళ్లు కుంచం రూ. 80కే విక్రయించడానికి రైతులు ముందుకొచ్చినా కొనుగోలుదారులు లేకపోవడంతో రైతులు సంతలో దిగాలు చెందారు. అచ్యుతాపురంలో ప్రతి శుక్రవారం జరిగే వారపుసంత, సోమవారం, బుధవారం జరిగే మార్కెట్లలో పండు మిరప కాయలను విక్రయిస్తారు. ఫిబ్రవరి మొదటి నుంచి ప్రారంభమయ్యే విక్రయాలు మే వరకు కొనసాగుతాయి. జిల్లా



వ్యాప్తంగా పండు మిరప కావాలనుకునే వారు, అవకాయ వ్యాపారస్థులు వీటి కొనుగోలుకు అచ్యుతాపురం వస్తారు. నిత్యావసర ధరలు పెరిగిపోగా మిరపపండ్లు ధరలు తగ్గిపోవడంతో రైతులకు పాలుపోవడంలేదు. ఇప్పటికే తెగుళ్లతో సగం నష్టపోయామని ఇప్పుడు కొనుగోలుచేసే వారులేక రోడ్డున పడ్డామంటుని ఆవేదన చెందుతున్నారు.

**పెట్టుబడీ దక్కడంలేదు- కూండ్రపు శ్రీరామ్మూర్తి, రైతు, భోగాపురం**

మిరప సాగు ఒకప్పుడు లాభదాయకంగా ఉండేది. కోవిడ్ తరువాత వరసగా ప్రతి ఏడాది నష్టాలే వస్తున్నాయి. కూలీకి రోజుకు రూ. 500 ఇస్తే తప్ప పనికిరావడంలేదు. తెగుళ్లు, పెట్టుబడులు పెరిగిపోయి సాగు గిట్టుబాటు కావడంలేదు. ఇదే సమయంలో మిరపధరలు పడిపోయాయి. కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకురావడంలేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

# పురాతన సమాధులు ధ్వంసం

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మండలం పాపంపల్లి గ్రామంలో పురాతన సమాధులను ఓ వైకాపా నాయకుడు ధ్వంసం చేసి భూమి కబ్జాకు యత్నిస్తున్నాడు. సర్వేనంబరు 441–5లో 1.78 ఎకరాల్లో మూడు సమాధులను, శాసనాలను 1995 సంవత్సరంలో కేంద్ర పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ అధికారులు గుర్తించారు. వాటి సంరక్షణకు చర్యలు చేపట్టారు. కొన్నేళ్ల తర్వాత గుట్టుచప్పుడు కాకుండా కొందరు తవ్వకాలు జరపడంతో గోతులు ఏర్పడ్డాయి. వాటిని మట్టితో కప్పివేశారు. 2022లో వైకాపా నాయకుడు ఆ భూమి తమదేనంటూ తవ్వకాలు చేయగా జిల్లా అధికారులు అడ్డుకొన్నారు. మళ్లీ 2024లో రాత్రికిరాత్రే తవ్వకాలు చేసి బండరాళ్లు తొలగించి చదును చేసేందుకు యత్నించారు. అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి



ఎలాంటి తవ్వకాలు చేయరాదని హెచ్చరించారు. తాజాగా కొన్ని రోజుల నుంచి అదే ప్రాంతంలో సమాధుల గుట్టలను, శాసనాలను ఆనవాళ్లు లేకుండా చేసి పంటల సాగుకు సిద్ధం చేస్తున్నాడు. ఈ విషయమై పురావస్తు శాఖ ఏడీ రజితను వివరణ కోరగా ఆ ప్రాంతంలో బృహత్‌శిలాయుగపు నాటి మూడు సమాధులు ఉన్నాయి. అక్కడ తవ్వకాలు జరిపి సమాధులు, శాసనాలు లేకుండా చేయాలని చూశారు. అప్పట్లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ ప్రాంతాన్ని చదును చేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయరాదని చెప్పినా వినడం లేదు. సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని చెప్పారు.

# గానుగాట మళ్లీ ఆగింది!

చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారంలో గానుగాటకు మళ్లీ బ్రేక్ పడింది. తరచూ యంత్రాలు మొరాయించడం ఒక కారమణమైతే.. రసం మరిగించేందుకు తగినంత ఆవిరి సామర్థ్యం లేకపోవడంతో తాజాగా గానుగాట ఆగింది. స్ప్రే పాండ్‌లో నీరు కలుషితం కావడంతో గానుగాడటం నిలిపివేశారు. స్ప్రే పాండ్‌ను పరిశుభ్రం చేసే కార్యక్రమం జరుగుతోంది.



**55 రోజుల్లో.. 189.20 గంటలు**

నిన్న, మొన్నటి వరకు బాయిలర్, టర్బయిన్, మిల్లు హౌస్‌ల్లో సాంకేతిక సమస్యలు తలెత్తేవి. బేగాస్ లేక గానుగాట నిలిచిన సందర్భాలున్నాయి. తాజాగా స్ప్రే పాండ్‌లో నీరు కలుషితమై ఆగిపోయింది. ఈ ఏడాది ఆలస్యంగా జనవరి మూడో వారంలో గానుగాట ప్రారంభించారు. 55 రోజుల్లో 189.20 గంటలపాటు కర్మాగారంలో అంతరాయాలవల్ల గానుగాట ఆగింది. ప్రారంభంలోనే బాయిలర్ డి ఫ్యాన్ దెబ్బతినడంతో ఏకంగా 23 గంటలు ఆగిపోయింది. ఇటీవల 36 గంటలు నిలిచిపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా గానుగాట నిలిచిన విషయాన్ని ఎండీ సన్యాసినాయుడు కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కర్మాగారం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయానికి సమస్యను పరిష్కరించి గానుగాటను పునః ప్రారంభిస్తామని ఎండీ సన్యాసినాయుడు పేర్కొన్నారు.

చురకలు



## నభా నటేష్.. హీటెక్కిస్తున్న గ్లామర్ ట్రీట్

టాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ తన స్టైల్ స్టేట్మెంట్‌తో మరోసారి ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేసింది. సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటుందో, అదే స్థాయిలో తన స్టన్నింగ్ ఫోటోషూట్‌లను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోలు నెటిజన్ల మతిపోగొడుతున్నాయి. ఇందులో నభా తన బోల్డ్ లుక్స్‌తో అందర్నీ ఫిదా చేసేసింది. స్టన్నింగ్ లుక్స్‌తో ఆమె పోస్ట్ చేసిన ఈ ఫొటోషూట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. బ్లాక్ కలర్ కెల్విన్ క్లీన్ బ్రా, లూజ్ బేజీ షర్ట్, మ్యాచింగ్ ట్రౌజర్స్‌లో నభా తన గ్లామర్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది.



ఒంటి మీద కవర్ చేసుకునేలా ఒక క్యాజువల్ లుక్ ఇచ్చినప్పటికీ, తన ఎక్స్‌ప్రెషన్స్‌తో సోషల్ మీడియాలో హీటెక్కిస్తోంది. మరీ ముఖ్యంగా ఈ లుక్స్‌లో నభా మోడ్రన్ యాంగిల్‌లో కొత్తగా కనిపించడం అభిమానులకు మజానే అందిస్తోంది. ఈ ఫోటోలను షేర్ చేస్తూ, నభా "మార్చి అంటే ఫిబ్రవరి మాత్రమే, మంచి లైటింగ్ ఉంటే!" అంటూ క్యాప్షన్ జత చేసింది. ఈ క్యాప్షన్ ఆమె ఫోటోషూట్‌కు ఎంత కష్టపడ్డారో చెప్పకనే చెబుతోంది. నెటిజన్లు ఆమె లుక్స్‌పై ఫిదా అవుతూ కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. టాలీవుడ్‌లో నభా గ్లామర్‌కు ఓ రేంజ్ ఉంది, బోల్డ్‌నెస్‌కీ, క్లాస్‌కీ మిక్స్ నువ్వే.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, నభా ప్రస్తుతం 'స్వయంభు' సినిమాలో నిఖిల్‌కు జోడిగా నటిస్తోంది. అలాగే అనే మరో రొమాంటిక్ డ్రామాలో నటిస్తోంది. గతంలో 'ఇస్మార్ట్ శంకర్'తో సూపర్ హిట్ అందుకున్న నభా, మళ్లీ అదే స్థాయి క్రేజ్ తెచ్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇటీవలి కాలంలో నటన పరంగా మంచి ప్రాజెక్ట్స్ ఎంపిక చేసుకుంటూ, కెరీర్‌ను కొత్త దిశగా మలచుకుంటోంది.

## మహేష్ హీరోయిన్ ఇప్పుడు గూగుల్ ఇండియా బాస్

1996లో 'పాపా కెహతే హై' సినిమాలో నటించిన తర్వాత నటి మయూరి కాంగో చాలా కాలంగా బాలీవుడ్ లో కనిపించ లేదు. ఈ బ్యూటీ చివరిసారిగా 2000లో విడుదలైన తెలుగు చిత్రం 'వంశీ'లో కనిపించింది. ఈ సినిమాలో మహేష్ బాబు కథానాయకుడిగా నటించారు. వంశీలో తన ప్రత్యేక పాట ఓహో సోనియా తనకు మంచి గుర్తింపు తెచ్చింది. 1995లో 'నసీమ్' అనే హిందీ చిత్రంతో అరంగేట్రం చేసిన మయూరి 'పాపా కెహతే హై', 'హొగీ ప్యార్ కీ జీత్' వంటి చిత్రాలను మినహాయించి పెద్దగా విజయం సాధించలేదు. గ్లామర్ రంగంలో ఆశించిన సక్సెస్ దక్కకపోవడంతో మయూరి తన రూట్ మార్చింది. ఇప్పుడు గూగుల్ ఇండియాలో సీనియర్ హోదాలో ఉంది. టీవీ మూవీ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ మయూరి 2000లో బుల్లితెరపైకి ప్రవేశించి నర్గీస్, థోడా ఘమ్ థోడి ఖుషి, డాలర్ బాబు, కిట్టి పార్టీ వంటి సీరియల్స్‌లో పనిచేసింది. అయితే



టీవీ నటిగాను ఆశించిన విజయం సాధించలేదు. సినిమాలు, సీరియల్స్‌లో విజయం సాధించకపోవడంతో,నిరాశపడింది. అటుపై మయూరి డిసెంబర్ 2003లో ఔరంగాబాద్‌లో ఎన్నారై ఆదిత్య ధిల్లాన్‌ను వివాహం చేసుకుంది. మయూరి– ఆదిత్య మొదట ఒక కామన్ స్నేహితుడి ద్వారా ఒక పార్టీలో కలుసుకున్నారు. ఈ జంటకు 2011లో ఒక కుమారుడు జన్మించాడు. తన చదువు సమయంలో మయూరి ఐఐటి కాన్పూర్‌కు ఎంపికైంది. కానీ సినిమాల్లో బిజీ కెరీర్ కారణంగా అక్కడ అడ్మిషన్ తీసుకోలేదు. మయూరి దాదాపు 16 సినిమాలు చేసింది. కానీ వాటిలో చాలా వరకు విడుదల కాలేదు. ఆమె పాపా కెహ్తే హైన్ (1996), హొగి ప్యార్ కి జీత్, బేటాబి, బాదల్, జంగ్, షికారి–కామియో, జీతెంగే హమ్ వంటి చిత్రాలలో నటించింది. మయూరి 2000లో విడుదలైన తెలుగు చిత్రం 'వంశీ'లో తన నటనతో ఆకట్టుకుంది. ఇందులో మహేష్ బాబు – నమ్రతా శిరోద్కర్ జంటగా నటించారు. వంశీ సినిమాలో నటించాక పరిశ్రమలో కనిపించలేదు. తరువాత తన భర్తతో కలిసి న్యూయార్క్‌కు వెళ్లి బారుచ్ కాలేజ్ జిక్లిన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుండి మార్కెటింగ్ – ఫైనాన్స్‌లో ఎంబీఏ పట్టా పొందింది. ఆమె గతంలో ఫ్రెంచ్ గ్రూప్ పబ్లిసిస్‌లో భాగమైన ప్రముఖ డిజిటల్ మీడియా ఏజెన్సీ అయిన పెర్ఫార్మిక్స్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం, మయూరి కాంగో ఐదు సంవత్సరాలకు పైగా గూగుల్ ఇండియాలో ఇండస్ట్రీ హెడ్‌గా పనిచేస్తున్నారు.




## ౨౨౦౯ ఏడాదికి జర్నీ షురూ..!




అన్ని భాషల ఇండస్ట్రీలో ఎక్కువ శాతం ప్రస్తుత కాలంలో జరిగే కథలను చూస్తూ ఉంటాం. అప్పుడప్పుడు పీరియాడిక్ నేపథ్యంలో అంటే కొన్ని సంవత్సరాలు వెనక్కి, గతంలో జరిగి పోయిన కాలంలో జరిగిన కథ అంటూ చూపిస్తూ ఉంటారు. పూర్వ కాలపు కథలు, రాజుల కాలపు కథలు, బ్రిటీష్ కాలపు కథలు, 1980, 70 కథలను ఇప్పటి వరకు ప్రేక్షకుల మందుకు తీసుకు వచ్చిన సినిమాలు చాలా ఉన్నాయి. అయితే ఫ్యూచర్‌లో ఎలా ఉండబోతుంది, ఫ్యూచర్‌కి సంబంధించిన కథలతో చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. గత ఏడాది వచ్చిన ప్రభాస్ కల్కి 2898 ఏడీ సినిమా ప్రేక్షకులను ఫ్యూచర్‌లోకి తీసుకు వెళ్లిన విషయం తెల్సిందే. ఇప్పుడు మరోసారి ప్రేక్షకులను ఫ్యూచర్‌లోకి తీసుకు వెళ్లబోతున్నారు. కన్నడ సూపర్ స్టార్ కిచ్చా సుదీప్ హీరోగా అనుపభండారి దర్శకత్వంలో నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డిలు సంయుక్తంగా నిర్మిస్తున్న 'బిల్లా రంగ భాష' సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయింది. నేటి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సినిమాను అధికారికంగా ప్రకటించారు. దాదాపు ఆరు నెలల పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరిపిన మేకర్స్ ఎట్టకేలకు సినిమాను పట్టాలెక్కించారు. సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కావడంతో వచ్చే ఏడాదిలో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి అంటూ కన్నడ సినీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యూచర్‌లో ఎలా ఉంటుంది, ఏం జరుగుతుంది అనే విషయాలను గురించి అనూప్ భండారి చాలా రీసెర్చ్ చేసి, హాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్‌తోనూ చర్చలు జరిపి ఈ సినిమా కథను రెడీ చేశారని తెలుస్తోంది. తక్కువ సమయంలోనే ఈ సినిమాను పూర్తి చేసే విధంగా దర్శకుడు పక్కా ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. కాన్సెప్ట్ వీడియోను, లోగోను రివీల్ చేశారు. సినిమాకు ఇప్పటికే పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. 2209 ఏడీ కి ప్రేక్షకులను తీసుకు వెళ్లే విధంగా దర్శకుడు అనూప్ స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాడు. విభిన్నమైన ఈ కాన్సెప్ట్‌లో కిచ్చా సుదీప్ పాత్ర ఏంటి అనే విషయమై ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఫైమ్ షో ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో ఈ టెక్నికల్ బ్రిలియన్స్ సినిమా రూపొందుతోంది. హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాల స్థాయిలో ఈ సినిమా ఉండబోతుందని, హాలీవుడ్‌లోనూ విడుదల చేసే విధంగా అద్భుతమైన యూనిక్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. నేటి నుంచి బిల్లా రంగ భాష ప్రయాణం మొదలు కాబోతుంది. వచ్చే ఏడాదికి ఈ సినిమా షూటింగ్ పూర్తి అయ్యి, వచ్చే ఏడాదిలోనే సినిమాను విడుదల చేయాలని భావిస్తు న్నారు. ఈ సినిమాలో నటించే నటీనటుల విషయమై మరింతగా క్లారిటీ రావాల్సి ఉంది. కన్నడం, తెలుగుతో పాటు హిందీ భాషల్లోనూ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాబోతున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నారు. రికార్డ్ స్థాయి కలెక్షన్స్ నమోదు చేయడం ఖాయం అనే ధీమాతో మేకర్స్ ఉన్నారు.


## కవర్ స్టిల్‌తో మతి పోగొడుతున్న కృతి




దశాబ్ద కాలం క్రితం '1 నేనొక్కడినే' సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కృతి సనన్. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈమెకు లక్ కలిసి రాలేదు. కానీ బాలీవుడ్‌లో ఈమె చేసిన మొదటి సినిమా హీరోపంతితోనే మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపుతో కృతి సనన్ బాలీవుడ్‌లో వరుస ఆఫర్లు సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లో నేనొక్కడినే సినిమా తర్వాత నాగ చైతన్యకు జోడీగా దోచెయ్ సినిమాలో నటించింది. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశను మిగిల్చింది. దాంతో టాలీవుడ్‌కి దూరం అయింది. చాలా ఏళ్ల తర్వాత ప్రభాస్‌తో కలిసి ఆదిపురుష్ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నటిగానే కాకుండా నిర్మాతగానూ కృతి సనన్ సినీ ప్రస్థానం కొనసాగిస్తోంది. జాతీయ అవార్డు సొంతం చేసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం బాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటిస్తోంది. కొన్ని షూటింగ్ దశలో ఉంటే కొన్ని చర్చల దశలో ఉన్నాయి. బాలీవుడ్ సినిమాలతోనే కాకుండా సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు తాను రెడీ అన్నట్లుగా ఇటీవల ఒక ప్రకటనలో ఈ అమ్మడు పేర్కొంది. సినిమా ఇండస్ట్రీలో ఎంత బిజీగా ఉన్నా ఇన్‌స్టాగ్రామ్‌లో వరుసగా ఫోటో షూట్స్ ను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తుంది. 58.5 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను ఇన్‌స్టాలో కలిగి ఉన్న ఈ అమ్మడు ఏ ఫోటో షేర్ చేసిన లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి, వెంటనే ఆ ఫోటోలు వైరల్ అవుతాయి. తాజాగా ఈమె గ్రాజియా ఇండియా 2025 వార్షికోత్సవ సంచిక కోసం కవర్ స్టిల్ ఫోటో షూట్ ఇచ్చింది. గ్రాజియా కవర్ పై ఈ అమ్మడు బ్లాక్ అండ్ వైట్ ఔట్ ఫిట్‌లో అలరించింది. స్టైలిష్ ఐకాన్‌గా ఎప్పటికప్పుడు కృతి సనన్ నిలుస్తూ ఉంటుంది. ఈ ఫోటోతో మరోసారి తన స్టైల్‌ను అభిమానులతో పంచుకుంది. నటిగా వచ్చిన పాపులారిటీతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఫాలోయింగ్ సొంతం చేసుకున్న కృతి సనన్ పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెల్సిందే. సినిమా ఇండస్ట్రీలో వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రమోషన్స్‌తో ఈమెకు ఎక్కువ పారితోషికం అందుతూ ఉంటుందని అంటారు. మోడలింగ్‌లో సుదీర్ఘ కాలం కొనసాగిన కృతి సనన్ నటిగా కెరీర్ ప్రారంభించిన తర్వాత ఫోర్బ్స్‌లోనూ చోటు సంపాదించింది. 2019 ఫోర్బ్స్ ఇండియా యొక్క సెలబ్రిటీ 100 జాబితాలో కృతి సనన్ నిలిచింది. ఆదిపురుష్‌లో సీత పాత్రలో నటించడం ద్వారా అరుదైన గౌరవం దక్కించుకున్న కృతి సనన్ ఆ సినిమా ఫలితంతో నిరుత్సాహం వ్యక్తం చేసింది. అయితే ఈమె నటించిన దిల్ వాలే, హౌస్‌ఫుల్ 4, లూకా చుప్పీ, బరేలీ కి బర్ఫీ సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇలాంటి అందమైన ఫోటోలు చూసిన సమయంలో కృతి సనన్ మళ్లీ తెలుగులో నటిస్తే బాగుండు అనే అభిప్రాయంను నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు. మరి ఈమెను తిరిగి సౌత్‌కి తీసుకు వచ్చే హీరో ఎవరు అనేది చూడాలి.

## ఒళ్లంత తుళ్లింత రావాలిలే.. మలైకా స్కిన్నోవేషన్


ఒళ్లంత తుళ్లింత కావాలిలే.. గుండెల్లో జల్లంతా కురవాలిలే!! .. గీతాంజలిలో గిరిజ వాన పాట ఇది. ప్రస్తుతం మలైకా సన్నివేశం చూస్తుంటే ఇలానే ఉంది. అందమైన బాడీ ఫిట్ దుస్తుల్లో మలైకా కవ్వింత ఇప్పుడు చర్చగా మారింది. నిజానికి ఇలాంటి అవతారం ఇదే మొదటి సారి కాదు. ఈ కొత్త లుక్ యువతరాన్ని ఆకర్షిస్తోంది. ప్రఖ్యాత కార్పొరెట్ బ్రాండ్ ప్రచారం కోసం మలైకా కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. దీనికోసం కోటి పారితోషికం అందుకుంటోందని తెలుస్తోంది. స్కిన్నోవేషన్ పేరుతో కొవ్వును కరిగించే పరికరాల సంస్థకు మలైకా ప్రచారం చేస్తోంది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమంలో స్కిన్ టైట్ దుస్తులను ధరించి గుండెల్ని మరిగించింది. ప్రస్తుతం ఈ



ప్రమోషనల్ కార్యక్రమం నుంచి మలైకా కొత్త లుక్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. 50 వయసులోను మల్లా అందచందాలు యూత్ కి మతులు చెడగొడుతున్నాయి. అదే సమయంలో ఏజ్ లెస్ బ్యూటీగా మలైకా కోట్లాది రూపాయల విలువ చేసే కాంట్రాక్టులను దక్కించుకోవడంపైనా ఆసక్తికర చర్చ సాగుతోంది. వెల్ నెస్, ఫిట్ నెస్ రంగాల్లో ఉత్పత్తులకు ప్రచారం చేయడానికి మలైకా బెస్ట్ ఆప్షన్ అనడంలో సందేహం లేదు. నిరంతరం జిమ్ యోగాతో పర్ఫెక్ట్ ఫిట్ లుక్ తో కనిపించే మలైకా ఇప్పుడు టోన్డ్ లుక్ కోసం యూత్ కి దిశా నిర్దేశనం చేస్తోంది. అయితే ఇలాంటి కార్పొరెట్ ఉత్పత్తులతో రిజల్ట్ ఎలా ఉంటుందో చెక్ చేయకుండా ఎలాంటి ప్రచారం కల్పించినా దానిపై విమర్శలు వెల్లువెత్తడం ఖాయం. మలైకా అలాంటి జాగ్రత్తలు తీసుకుంటుందని భావిద్దాం. మలైకా ఫిట్‌నెస్ దినచర్యలో యోగా, పైలేట్స్, ఎనర్జీ శిక్షణ, నృత్యం ఉంటాయి. ఇవి టోన్డ్ బాడీని కొనసాగించేందుకు, యవ్వన శక్తిని కాపాడుకోవడానికి సహాయపడతాయి. సమతుల్య ఆహారం, హైడ్రేషన్, స్వీయ సంరక్షణ ప్రాముఖ్యతను మలైకా తన అభిమానుల కోసం చెబుతుంది.

## దివ్య భారతి.. వయ్యారాల రోజా!

సౌత్ సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల భామ దివ్య భారతి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెట్టింట హీట్ పెంచేస్తోంది. బ్యాచిలర్ సినిమాతో అమ్మడు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. అయితే తాజాగా ఆమె షేర్ చేసిన ఈ స్టైలిష్ లుక్స్, ఎలిగెంట్ ఫ్యాషన్ సెన్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. అద్దిరిపోయే ఎక్స్‌ప్రెషన్స్, ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఈ ఫోటోలు నెటిజన్ల హృదయాలను దోచుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే,



ఆమె ధరించిన మేజెంటా కలర్ లేహంగా, ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత మెరుగుపరిచాయి. దివ్య భారతి ఫోటోషూట్‌లో కనిపించిన ఆ గ్రేస్, ఆమె గ్లామర్, మోడలింగ్ స్కిల్స్ ఓ కొత్త ట్రెండ్ సెట్టింగ్‌గా మారాయి. ఆమె ఫ్లోరిస్ట్ స్టైల్ జ్యువెలరీ, అట్రాక్టివ్ ఇయర్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. వీటికి తోడు ఆమె స్మైలింగ్ ఎక్స్‌ప్రెషన్.. ఆమె ఒదిగి ఉన్న కన్ఫిడెన్స్.. అభిమానులను మైమరపింపజేస్తున్నాయి. ప్రతి ఫోజ్‌లోనూ సొగసైన ప్రెజెంటేషన్ ఉన్న ఈ ఫోటోలు కేవలం గ్లామర్ కంటే క్లాస్ లుక్‌కి పెట్టింది పేరు అనేలా మారాయి. నేడు సోషల్ మీడియాలో టాప్ ట్రెండ్స్‌లో దివ్య భారతి తాజా ఫోటోలు కనిపిస్తున్నాయి. ఆమె వయ్యారాలు, ఆకర్షణీయమైన బాడీ లాంగ్వేజ్‌తో ఈ ఫోటోషూట్ మరింత హైలైట్ అయింది. ఒక్క ఫోటోలోనే కాదు, ఫుల్ లెంగ్త్ లుక్‌లో ఆమె చూపించిన గ్రేస్ నిజంగా ప్రత్యేకం. అభిమానులు 'దివ్య భారతి అంటే అందం, స్టైల్‌కి బ్రాండ్ అంబాసిడర్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో తన స్థానాన్ని బలపరచుకునే ప్రయత్నంలో ఉన్న ఈ బ్యూటీ త్వరలోనే మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులతో అలరించనుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536